అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 6-8-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 217 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 14 పేజీలు + సోపతి (వెబ్‌లో) | వెల : 8.00

విజయవంతంగా జాబిల్లి కక్ష్యలోకి...

చంద్రయాన్-3 కీలక ఘట్టం పూర్తి



బెంగళూరు : చంద్రునిపై పరిశోధనల కోసం ఇస్రో పంపిన చంద్రయాన్-3ను శనివారం రాత్రి 7గంటల సమయంలో చంద్రుని కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఇక్కడి మిషన్ ఆపరేషన్స్ కాంప్లెక్స్ (ఎంఓఎక్స్) నుంచి ఈ మేరకు ఆదేశాలను పంపినట్టు ఇస్రో తెలిపింది. ఈ మేరకు ఎక్స్ ...5లో

ఆర్టీసీ హైడ్రామా

- ప్రభుత్వమే కారణమన్న గవర్నర్
- కార్మిక సంఘాల జేఏసీ నేతలతో వీడియో కాన్ఫరెన్స్
- తేలని పంచాయతీ...

రాజ్‌భవన్ ముట్టడించిన కార్మికులు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్‌ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే విషయంలో హైడ్రామా చోటుచేసుకుంది. తాము పంపిన బిల్లును గవర్నర్ ఆమోదించలేదంటూ ప్రభుత్వం చేసిన ఆరోపణలకు గవర్నర్ కూడా ధీటుగానే సమాధానం చెప్పారు. అనేక నాటకీయ పరిణామాల మధ్య బిల్లుపై మరిన్ని సందేహాలను వ్యక్తంచేస్తూ గవర్నర్ ప్రభుత్వానికి మరో లేఖ రాసారు. అంతకుముందు విలీన బిల్లును తక్షణం ఆమోదించాలంటూ శనివారం ఆర్టీసీ కార్మికులు అంబేద్కర్ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. దీనికి టీఎమ్‌యూ (చీలికవర్గం) ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి నేతృత్వం వహించారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, రాజ్‌భవన్ వద్ద బైఠాయించారు. అయితే గవర్నర్ పుదుచ్చేరిలో ఉండటంతో అక్కడి నుంచి టీఎస్‌ఆర్టీసీ జేఏసీ నేతలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జేఏసీ చైర్మెన్ అశ్వత్థామరెడ్డి, కన్వీనర్ కే హన్మంతు ముదిరాజ్, కో కన్వీనర్ పీ కమాల్‌రెడ్డి సహా ఆరుగురు ప్రతినిధులు గవర్నర్‌తో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. థామస్‌రెడ్డి, టీఆర్ఎస్ కేవీ రాష్ట్ర అధ్యక్షులు జి రాంబాబు సహా మరికొందరు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల గోసను అశ్వత్థామరెడ్డి గవర్నర్‌కు వినిపించారు. ప్రభుత్వం మరోసారి ఆర్టీసీ కార్మికుల భుజాలపై తుపాకీ పెట్టి గవర్నర్‌కు గురిపెట్టిస్తున్నదని చెప్పారు. దీనిపై గవర్నర్ స్పందించారు. తనకు బిల్లును ఆలస్యంగా పంపి, పరిశీలన చేయకముందే... సంతకం పెట్టలేదంటూ రాజ్‌భవన్‌ను ముట్టడించడం ఏంటని ప్రశ్నించారు. 2019 సమ్మె సందర్భంగా ఆర్టీసీ ...5లో

ఇవీ గవర్నర్ ప్రశ్నలు

- 1958 నుంచి ఆర్టీసీలో కేంద్ర గ్రాంట్‌లు, వాటాలు, లోన్లు, ఇతర సహాయం గురించి బిల్లులో ఎలాంటి వివరాలు లేవు.
- రాష్ట్ర విభజన చట్టం 9వ షెడ్యూల్ ప్రకారం ఆర్టీసీ స్థితిని మార్చడంపై సమగ్ర వివరాలు లేవు.
- ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పరిగణిస్తామని చెబుతున్న ప్రభుత్వం... వారి సమస్యలకు ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ చట్టం, కార్మిక చట్టాలు వర్తిస్తాయా, వారి ప్రయోజనాలు ఎలా కాపాడబడతాయో స్పష్టత ఇవ్వలేదు.
- విలీనం డ్రాఫ్ట్ బిల్లులో ఆర్టీసీ ఉద్యోగులు అందరికీ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెన్షన్ ఇస్తారా?
- ప్రభుత్వ ఉద్యోగుల్లో కండక్టర్, కంట్రోలర్ వంటి పోస్టులు లేనందున వారి ప్రమోషన్లు, క్యాడర్ నార్మలైజేషన్ ఇతర ప్రయోజనాలు ఏ విధంగా అందుతాయి?

సర్కారు సమాధానాలు

- ఆర్టీసీ కార్మికులకు కార్పొరేషన్ కంటే మెరుగైన జీతాలు ఉంటాయి.
- విలీనమైన తర్వాత రూపొందించే గైడ్‌లైన్స్‌లో అన్ని అంశాలు ఉంటాయి.
- కేంద్ర ప్రభుత్వ వాటా, 9వ షెడ్యూల్ సమస్యలను ఆంధ్రప్రదేశ్ తరహాలోనే పరిష్కరిస్తాం.


ఈ వివరణలు వచ్చాక, కార్మిక సంఘాలతో భేటీ అనంతరం గవర్నర్ మరిన్ని సందేహాలను లేవనెత్తుతూ ప్రభుత్వానికి మరో లేఖ రాసారు.

- ఆర్టీసీలో కేంద్ర ప్రభుత్వ వాటా 30 శాతం ఉంది. విలీనానికి కేంద్రం సమ్మతించిందా...సమ్మతిస్తే సదరు లేఖను ఇవ్వండి.
- శాశ్వత, తాత్కాలిక ఉద్యోగుల సంఖ్య, డిపోల వారీగా వర్గీకరించబడిన కేటగిరీల వివరాలతో మొత్తం శాశ్వత ఉద్యోగుల సంఖ్య ఎంతో చెప్పాలి.
- కాంట్రాక్ట్, క్యాజువల్, ఇతర ప్రాతిపదికలపై పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్యనూ చెప్పాలి.
- కార్పొరేషన్ ఆస్తుల నిర్వహణపై వివరణ ఇవ్వాలి. ఆస్తుల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందా? లేక కార్పొరేషన్‌లోనే కొనసాగుతాయా?
- బస్సులు నడిపే అధికారానికి సంబంధించిన వివరాలు కావాలి.
- ఉద్యోగులు ప్రభుత్వ సర్వీసులోకి ప్రవేశించాక డిప్యుటేషన్ లేదా ఇతర ఏర్పాట్లపై స్పష్టత ఇవ్వాలి.
- ఈ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానాలు ఇవ్వాల్సి ఉంది. ఆదివారం జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ఈ అంశాలపై స్పందించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

నేడు అసెంబ్లీలో ఆర్టీసీ బిల్లు? 7లో..

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాల్సిందే..

అధికార, ప్రతిపక్ష సభ్యులందరి నోట ఒకటే మాట...



మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టిన గ్రామ పంచాయతీ కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాల్సిందేనని అసెంబ్లీలో పలువురు అధికార, ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇదే తరహాలో ఐకేపీ వీవోఏల కొలువులను సైతం క్రమబద్ధీకరించాలని వారు కోరారు. వివిధ అంశాలపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసే రూలింగ్, అపోజీషన్ సభ్యులందరి నోట... ఈ రెండు అంశాలపై మాత్రం ఒకే మాట వెలువడటం గమనార్హం. శనివారం శాసనసభ జీరో అవర్‌లో 14 మంది సభ్యులు పంచాయతీ కార్మికుల సమ్మె, వారి పర్మినెంట్ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఐకేపీ వీవోఏల సమస్యలను కూడా ఎక్కువ మంది సభ్యులు ఏకరువు పెట్టారు. పల్లె ప్రగతిపై లఘు చర్చ సందర్భంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు... ఆ పార్టీని ఇరకాటంలో పెట్టాయి. ఆయన్ను, పీసీసీ చీఫ్ రేవంత్‌ను ఉద్దేశించి మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాగా మొత్తం ఐదు బిల్లులను అసెంబ్లీ ఆమోదించింది. మరోవైపు శాసన మండలిలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి... ఐటీడీఏలు, పోడు భూముల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. మణిపూర్‌లో ప్రభుత్వ ప్రాయోజిత హింస కొనసాగుతోందంటూ బీఆర్ఎస్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇటు శాసనసభ, అటు మండలి... ఆదివారానికి వాయిదాపడ్డాయి. 6లో..

అవసరమైన మేరకు ఐటీడీఏలను ఏర్పాటు చేయాలి

- ఆదివాసీల పోడు సమస్యలు తీర్చండి : మండలిలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో అవసరమున్న మేరకు మరిన్ని ఐటీడీఏలను ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు.రాష్ట్రంలో గిరిజన సంక్షేమం -పోడు భూముల పట్టాల పంపిణీ అనే అంశంపై శనివారం శాసనమండలిలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జిల్లాల సంఖ్యను 33కు పెంచినా ఐటీడీఏలు ఇప్పటికీ మూడుకే పరిమితమయ్యాయని తెలిపారు. ఈ క్రమంలో అవసరం మేరకు ఐటీడీఏల సంఖ్యను మరిన్ని ...5లో

విభజించి... పాలించి ఓట్లు దండుకునే యత్నం

- బ్రిటీష్ వాళ్లు చెప్పిందే పాటిస్తున్న బీజేపీ
- ప్రభుత్వ ప్రోత్సాహంతోనే మణిపూర్‌లో హింస: మండలిలో బీఆర్ఎస్ సభ్యురాలు కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



మణిపూర్‌లో రెండు తెగల మధ్య చిచ్చు పెట్టటం ద్వారా వారిని విభజించు పాలించు అన్నట్టుగా బీజేపీ వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా ఓట్లను దండుకునేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని ఆమె విమర్శించారు. బ్రిటీష్ వాళ్లు మొదలుపెట్టిన విభజించు పాలించు సిద్ధాంతాన్ని బీజేపీ పాటిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్ ప్రభుత్వ ప్రోత్సాహంతోనే ...5లో

మణిపూర్‌లో మళ్లీ హింస

ఉగ్రవాదుల దాడిలో ముగ్గురు మృతి

- ఇంఫాల్ లోయ సహా పలు ప్రాంతాల్లో 24 గంటల సమ్మె



బిష్ణుపూర్ (మణిపూర్) : మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతూనే ఉంది. శనివారం తెల్లవారుజామున బిష్ణుపూర్ జిల్లాలో ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో ముగ్గురు మరణించారని పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మణిపూర్‌లోని బిష్ణుపూర్ జిల్లా క్వాక్తా సమీపంలోని ఉఖా తంపఖ్ గ్రామంలో శనివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఉగ్రవాదులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఉగ్రవాదులు తండ్రీకొడుకులిద్దరు, మరో వ్యక్తిని దారుణంగా హత్య చేసి చంపారని పోలీసులు శనివారం తెలిపారు. హత్యకు గురైన ...5లో

మీడియా..నీ దారెటు?

అసత్యాలు, కట్టు కథలతో మత విద్వేషాలకు ఆజ్యం

ప్రభుత్వ నియంత్రణ పూజ్యం



న్యూఢిల్లీ : దేశంలోని వివిధ ప్రాంతాలలో ఇటీవలి కాలంలో చెలరేగిన హింసాకాండ ప్రజాస్వామ్య వాదులను, శాంతి కాముకులను ఆందోళనకు గురిచేస్తోంది. మతాలు, జాతుల మధ్య చిచ్చుపెట్టి తద్వారా రాజకీయ ప్రయోజనాలను పొందేందుకు కొన్ని శక్తులు విశ్వ ప్రయత్నం చేస్తున్నాయి. ఈ తరుణంలో సంయమనం పాటించి, మత సామరస్యానికి కృషి చేయాల్సిన కార్పొరేట్ మీడియా సంస్థలు అగ్నికి ఆజ్యం పోస్తూ విద్వేషాలను మరింతగా రెచ్చగొడుతున్నాయి. కొద్ది రోజుల క్రితం హర్యానాలో ముస్లింల ప్రాబల్యం అధికంగా ఉన్న మేవాట్‌లో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ సంస్థలు నిర్వహించిన ప్రదర్శన ఘర్షణలకు దారి తీసిన విషయం తెలిసిందే. అంతకుముందు మణిపూర్‌లో కుకీలు, మైతీల మధ్య ప్రారంభమైన హింసాకాండ ఎన్నో అకృత్యాలకు, అఘాయిత్యాలకు, అమానవీయ ఘటనలకు దారి తీసింది. మణిపూర్ మంటలు ఇప్పటికీ చల్లారనే లేదు. ఆ దారుణాలపై దేశంలోనే కాదు... ప్రపంచ దేశాలలో సైతం నిరసన ధ్వనులు విన్పించాయి. ఇక ముంబయిలో కదులుతున్న రైలులో గత నెల 31న జరిగిన హత్య కూడా మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసింది. ఆ ఘటనలో చేతన్ కుమార్ సింగ్ అనే ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ తన అధికారిని కాల్చి చంపి, ఆ తర్వాత ముగ్గురు ముస్లిం ప్రయాణికులను కూడా పొట్టన పెట్టుకున్నాడు. ఆ సందర్భంగా కొన్ని అభ్యంతరమైన వ్యాఖ్యలు ...5లో



ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించిన సుప్రీం



టెలివిజన్ ఛానల్స్‌లో వచ్చిన విద్వేషపూరిత ప్రసంగాలపై దాఖలైన పిటిషన్లను జస్టిస్ కేఎం జోసఫ్, జస్టిస్ హృషీకేశ్ రాయ్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ఆ సందర్భంగా గత సంవత్సరం సెప్టెంబర్ 22న కీలక వ్యాఖ్యలు చేసింది. టీవీ ఛానల్స్ మత విద్వేషాలకు ఆజ్యం పోస్తుంటే ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఓ మతాన్ని లక్ష్యంగా చేసుకొని టీవీ ఛానల్స్‌లో వచ్చిన కథనాలు విధ్వంసానికి కారణమయ్యా యని తెలిపింది. ఇలాంటి ద్వేషపూరిత ప్రసంగాలను ప్రోత్సహిస్తుం టే దేశం ఎటుపోతుందని ప్రశ్నించారు. ఇలాంటి కథనాలు, ప్రసంగాలు టీవీ ఛానల్స్ టీఆర్‌పీ రేటింగులను, లాభాలను పెంచుతాయని అంటూ టెలివిజన్ కార్యక్రమాలను నియంత్రించేందుకు చట్టాన్ని రూపొందిం చాలని ప్రభుత్వానికి సూచించింది. చట్టాన్ని తీసుకొచ్చే వరకూ కొన్ని మార్గదర్శకాలు జారీ చేయాలని తెలిపింది.

జాతిపిత ఆవేదన

మీడియాలో అసత్యాలు, అర్ధ సత్యాలు ప్రచారం కావడం ఇది మొదటిసారి కాదు. పత్రికలో వచ్చిన ఒక తప్పుడు వార్తను చదివి 1926 డిసెంబర్‌లో అబ్దుల్ రషీద్ అనే వ్యక్తి స్వామి శ్రద్ధానంద్‌ను హత్య చేశాడు. దీనిపై గాంధీజీ స్పందిస్తూ రషీద్‌ను హత్యకు పురిగొల్పిన కారణాన్ని ప్రస్తావించారు. కొన్ని పత్రికలు, కొందరు పాత్రికేయులు అవాస్తవ సమాచారాన్ని మీడియా ద్వారా వ్యాపింపజేస్తున్నారని విమర్శించారు. అంతేకాదు... స్వామి శ్రద్ధానందకు నివాళి అర్పించేందుకు గౌహతిలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ విద్వేషాలను వ్యాపింపజేసే వార్తా పత్రికలను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. హిందూ పత్రికలు ముస్లింలను, ముస్లిం పత్రికలు హిందువులను ద్వేషిస్తూ కాలం గడుపుతున్నాయని గాంధీజీ ఆవేదన వ్యక్తం చేశారు.

అవినీతి కేసులో పాక్ మాజీ ప్రధాని

ఇమ్రాన్ అరెస్టు



ఇస్లామాబాద్ : పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు ఎదురుదెబ్బ తగిలింది. తోషాఖానా అవినీతి కేసులో ఇస్లామాబాద్ జిల్లా, సెషన్స్ కోర్టు ఇమ్రాన్‌ను దోషిగా తేల్చుతూ తీర్పునిచ్చింది. ఈ అవినీతి కేసుపై సెషన్స్ కోర్టు న్యాయమూర్తి హుమయూన్ దిలావర్ ఇమ్రాన్‌ఖాన్‌కు మూడేండ్లపాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే ఐదేండ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేశారు. ఈ కేసులో కోర్టు తీర్పు అనంతరం ఇమ్రాన్ శనివారం అరెస్టయ్యారు. అయితే కోర్టు తీర్పును ఇమ్రాన్‌ఖాన్ ఖండించారు. ఈ కేసులో అతని తరపున వాదించే న్యాయవాద బృందం వెంటనే అప్పీల్ దాఖలు చేయను న్నట్టు ఇమ్రాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తరపున వాదించిన న్యాయవా ది ఒకరు మాట్లాడుతూ.. 'ఈ కేసులో సాక్షులను హాజరుపరచడానికి మాకు అవకాశం ఇవ్వలేదు. వాదనలను పూర్తి చేయడానికి సమయం కేటాయించలేదు. మావైపు వాదనల్ని వినకుండానే కోర్టు తీర్పునిచ్చింది' అని ఆయన అన్నారు. కాగా, ఇమ్రాన్ ప్రధానిగా ఉన్న సమయంలో విదేశీ ప్రముఖుల నుంచి తాను పొందిన విలువైన బహుమతులను తోషిఖానాలో జమ చేయకుండా.. వాటిని అక్రమంగా విక్రయించారని మాజీ ప్రధాని షెహబాజ్ ఆరోపించారు. ఈ తోషిఖానా అవినీతి కేసులో ఈ ఏడాది మే నెలలో ఇమ్రాన్ అరెస్టయిన సంగతి తెలిసిందే.

గుజరాత్ బీజేపీలో

అసమ్మతి

పార్టీ పదవికి ప్రదీప్‌సింగ్ వాఘేలా గుడ్‌బై



అహ్మదాబాద్ : సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోడీ ఇలాకాలోనే బీజేపీలో అసమ్మతి స్వరాలు వినిపిస్తున్నాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాటిల్‌పై తిరుగుబాటు చేస్తున్న నాయకులను ఒక్కొక్కరినే బయటికి సాగనంపుతున్నారు. తాజాగా పార్టీ ఆదేశానుసారం బీజేపీ గుజరాత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్ వాఘేలా తన పదవికి రాజీనామా చేశారు. ఆయనను రాజీనామా చేయాల్సిందిగా పార్టీ ఆదేశించిందని డెక్కన్ హెరాల్డ్ పత్రిక తెలిపింది. 'పార్టీ పదవికి రాజీనామా చేయాల్సిందిగా వాఘేలాను గత నెలలోనే ఆదేశించారు. గాంధీనగర్‌లోని పార్టీ కార్యాలయానికి రావద్దని కూడా చెప్పారు' అని పేరు ...5లో

ఘాటెక్కనున్న ఉల్లి

వచ్చే నెలలో కిలో రూ.60-70కి చేరే అవకాశం



న్యూఢిల్లీ : నిన్న టమాటా...రేపు ఉల్లి. టమాటా ధర ఇప్పటికే కొండెక్కి కూర్చోగా ఉల్లిగడ్డలు ఈ నెలాఖరు నుండి మరింత ఘాటెక్కబో తున్నాయి. సెప్టెంబర్ నాటికి ఉల్లి ధర కిలో రూ.60 నుండి 70 వరకూ చేరుతుందని అంటున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాలు లేకపోవడంతో ధరలు పెరుగుతాయని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. అయితే 2020 నాటి పరిస్థితి తలెత్తకపోవచ్చునని వారు చెప్పారు. 'సరఫరా-డిమాండ్ అసమానతలు ఆగస్ట్ చివరి నాటికి ఉల్లి ధరలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. రిటైల్ మార్కెట్‌లో సెప్టెంబర్ ప్రారంభం నుండే ధరలు గణనీయంగా పెరగవచ్చు. కిలో రేటు రూ.60-70 పలకవచ్చు. అయితే 2020లో పెరిగినంతగా ఉండదు' అని క్రిసిల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ అండ్ అనలిటిక్స్ సంస్థ వివరించింది. బహిరంగ మార్కెట్‌లో రబీ పంట నిల్వలు ...5లో

గురుకులాల్లో

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి

ఏకరూప పాలన అమలు చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ మహా ధర్నాలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉన్నత ప్రమాణాలతో అత్యున్నత ఫలితాలు సాధిస్తున్న గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని, శ్రమకు తగ్గ వేతనాలు ఇవ్వాలని, అన్ని గురుకులాల్లో ఏకరూప పాలన అమలు చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులతోనే గురుకులాలకు మంచి పేరు వచ్చిందన్నారు. శనివారం టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య అధ్యక్షతన అన్ని సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఉపాధ్యాయులు హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సిరెడ్డి, రంగారెడ్డి హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు సంతోషంగా పని చేయగలిగితేనే విద్యార్థులకు సంతృప్తికరంగా బోధించగలుగుతారన్నారు. సామాజిక అంతరం పోవాలంటే గురుకులాలన్నీ ఒక్కటి కావాలన్నారు. కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని, తాత్కాలిక ఉపాధ్యాయులకు బేసిక్ పే ఇవ్వాలని, బీసీ గురుకుల పాఠశాలల సమయాలను ఇతర సొసైటీలతో సమానంగా మార్చాలని డిమాండ్ చేశారు. కేర్ టేకర్ నియామకం వంటి ఆర్థిక భారం లేని సమస్యలను పరిష్కరించి ఉపాధ్యాయుల మన్ననలను పొందాలన్నారు. గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ...6లో

రాజ్యాంగాన్ని రక్షించుకోవడం అత్యంత అవసరం

- ప్రముఖ సీనియర్ న్యాయవాది జి విద్యాసాగర్

నవతెలంగాణ-ముషీరాబాద్

రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ సీనియర్ న్యాయవాది, ఐలు జాతీయ సెమినార్ ఆహ్వాన సంఘం అధ్యక్షులు జి. విద్యాసాగర్ అన్నారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేలా పరిస్థితులు మారిపోతు న్నాయని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి చేతుల్లో ఉన్నదని.. ఆ రూపంలో న్యాయవాదులు మరింత పట్టుదలతో కృషి చేయాలని కోరారు. అక్టోబర్ 1న ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ సెమినార్ నిర్వహణ కోసం శనివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ మేరకు సెమినార్ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన ఆహ్వాన సంఘానికి చీఫ్ పాట్రన్లుగా అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కె పార్థసారథి, కోశాధికారిగా వేణుగోపాల్‌తో పాటు పూర్వపు కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్, బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎ. నరసింహారెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, సీనియర్ న్యాయవాది ఏ సత్యప్రసాద్‌లు, పాట్రన్లుగా పల్లె నాగేశ్వరరావు, గంగుల గోవర్ధన్ రెడ్డితో పాటు సీనియర్ న్యాయవాదులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ సెమినార్‌లో సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిలు, న్యాయరంగ ప్రముఖులు, విద్యావేత్తలు పాల్గొంటారని తెలిపారు. రాజ్యాంగ పునాదులను నిర్మూలించేలా ప్రస్తుత పాలకులు అవలంబిస్తున్న విధానాల వల్ల దేశంలో అభివృద్ధి కుంటుపడటంతోపాటు సామాజిక సమస్యలతో అట్టడుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. లౌకికవాదం కనుమరుగయ్యే ప్రమాదం ఉందని, లౌకికవాదం లేకపోతే జాతుల మధ్య సమస్యలు తీవ్రమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సెమినార్ సందర్భంగా సావనీర్‌ను ప్రచురించడంతోపాటు న్యాయ కళాశాలలో పోటీలు నిర్వహించి వ్యాసాలు ప్రచురిస్తామని తెలిపారు. షార్ట్ ఫిలిం కూడా తయారు చేసి సెమినార్‌లో ఆవిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి ఆలిండియా లాయర్స్ యూనియన్ బాధ్యులు, హైకోర్టు న్యాయవాదులు తోపాటు ప్రజాసంఘాల బాధ్యులు, నాగారం అంజయ్య, బీసీ ఆజాద్, శైలజ, రామచంద్రారెడ్డి, జలసుత్రం ప్రసాదు, శివరామకృష్ణ, గణేష్‌లతోపాటు యువ న్యాయవాదులు పాల్గొన్నారు.

సుద్దాల అశోక్‌తేజ 6 గంటల ఏక కంఠ పఠనం



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం(టీపీఎస్‌కే) ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ రచించిన అశో'కవనం' కావ్య పఠనం జరిగింది. ఈ సందర్భంగా సుద్దాల అశోక్ తేజ 6 గంటలపాటు ఏక కంఠ పఠనం చేశారు. భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ త్రేతయుగం నుంచి నేటి వి'కృత'యుగం దాకా, పురాణ కాలం నుంచి ఈనాటి కరోనాల కాలం దాకా, తనయుడిచే నిలువున చంపబడిన రేణుక దేవి నుంచి నిందితుల్ని నిలబెట్టి కాల్చిన పూలన్‌దేవి దాకా, శ్రీరాముని చేత తలనరకబడిన శంభూకుడి నుంచి శ్రీకృష్ణుని మాయోపాయాల వలన తల నరుక్కున్న భార్బరీకుని దాకా, సార్వభౌముల జులుం నుంచి సాల్వ జులుం దాకా జరిగిన దారుణాలు, మారణాలు, వాటి వాటి కారణాలు, మరికొన్ని మమకారాలు, వికారాల సమస్తము నిక్షిప్తం చేసిన అశోకవనం అభివేక్తం చేస్తుందని.. ఆశో "కవనం" భావితరాలకు ఇది ఆశా కవనం అని కావ్య గానం చేశారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎవరూ చూడని అనేక కోణాల్లో చరిత్రను తన అశో'కవనం' కావ్య గానంలో తేజ చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోత్కూరి నరహరి, జి. రాములు, కోయ కోటేశ్వరరావు, కె.అనందాచారి, జీ మహేందర్, వనం సుధాకర్, అరిబండి ప్రసాద్ రావు, ఐతగోని విజయ్, మూర్తి సామల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చార్మినార్ ఇల్యూమినేషన్ కార్యక్రమాన్ని

- ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన చార్మినార్ ఇల్యుమినేషన్ కార్యక్రమాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శనివారం ప్రారంభించారు. చార్మినార్ విద్యుద్దీపాలంకరణలో దగదగా మెరిసేలా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చార్మినార్, గోల్కొండ కోటలు చారిత్రాత్మకమైనవనీ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఆర్కియాలజీ విభాగం వాటి బాధ్యతలను తీసుకున్నదని తెలిపారు. రామప్ప దేవాలయానికి యూనెస్కో గుర్తింపు రావడం తెలంగాణకు, దేశానికి గర్వకారణమన్నారు. వచ్చే నెలలో గోల్కొండలో ఇల్యుమినేషన్, లైట్ అండ్ సౌండ్ షో ప్రారంభించుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంత త్వరగా భూమిని కేటాయిస్తే అంత త్వరగా హైదరాబాద్‌లో నేషనల్ సైన్స్ సిటీ సెంటర్‌ను ప్రారంభించుకుంటామన్నారు. ఘంటసాల గారి పేరు మీద సంగీత నాటక అకాడమీని కేంద్రం మంజూరు చేసిందనీ, త్వరలోనే దానికి భూమి పూజ చేయబోతున్నామని చెప్పారు. సాలార్‌జంగ్ మ్యూజియంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న మ్యూజియమ్‌ను త్వరలో ప్రారంభిస్తామన్నారు. వరంగల్‌పోర్ట్‌లో కూడా లైటింగ్, తదితర అభివృద్ధి పనులు చేస్తామన్నారు. చారిత్రాత్మకమైన ప్రదేశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత తమ ప్రభుత్వం ఉందన్నారు.

టెక్స్‌టైల్ అస్తవ్యస్తం

• సబ్సిడీ అందక.. ట్రయల్ రన్ కాక.. • మడికొండలో సూరత్ నేతన్నల దుస్థితి • రూ.10.40 కోట్ల సబ్సిడీ కోసం ఎదురుచూపులు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్ర ప్రభుత్వం పిలుపునందుకొని సూరత్‌కు వలసెళ్లిన చేనేత కార్మికులు ఎంతో ఆశతో తిరిగి వచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హామీతో వారంతా హన్మకొండ జిల్లా కేంద్రంలోని మడికొండ కాకతీయ టెక్స్‌టైల్స్ పార్క్‌లో యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ యూనిట్లకు నేటికీ సబ్సిడీ విడుదల కాకపోవడంతో కేవలం 26 పవర్‌ల్యూమ్ యూనిట్లు మినహా ఉత్పత్తికి సిద్ధమైన మరో 140 యూనిట్లు ట్రయల్ రన్ చేయక నిలిచి ఉన్నాయి. సబ్సిడీ ఇవ్వకపోవడంతో యంత్రాలను అమర్చినా ట్రయల్ రన్ చేయకపోవడంతో సేల్‌డీడ్‌లు రూపొందించలేదు. దీంతో పార్క్ అస్తవ్యస్తంగా మారింది. 364 యూనిట్లకుగాను కేవలం 26 యూనిట్లు మాత్రమే ఉత్పత్తిని ప్రారంభించాయి. సబ్సిడీ ఇస్తేనే ట్రయల్ రన్ చేస్తామని సూరత్ నుండి వచ్చిన నేత కార్మికులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో యూనిట్‌కు 25 శాతం సబ్సిడీ, బ్యాంక్ ఆఫ్ ఇంట్రెస్ట్ 7.5 శాతం ఇవ్వాల్సి వుంది. వీటి కోసం చేనేత కార్మికులు ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉన్నతాధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేదు. ఒక్కో యూనిట్‌కు సుమారు రూ.2 కోట్ల మేరకు పెట్టుబడి పెట్టగా ఇందులో 25 శాతం లెక్కన రూ.25 లక్షలు సబ్సిడీగా, బ్యాంక్ ఇంట్రెస్ట్ రూపంలో మరో రూ.15 లక్షలు మొత్తంగా ఒక్కో యూనిట్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.40 లక్షలు చెల్లించాల్సి వుంది. ఈ మొత్తం విడుదల చేయకపోవడంతో మిగతా యూనిట్‌ల యజమానులు ముందుకు పోలేకపోతున్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా కేసీఆర్ ఆనాడు అనేకమార్లు ఇక్కడ పనులు లేక మన నేతన్నలు కడుపు పట్టుకొని సూరత్, బీవండి, సోలాపూర్‌లకు తరలి వెళ్లారని, రాష్ట్రం ఏర్పడగానే వాళ్లందరినీ తిరిగి తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. ఈ మేరకు సూరత్ నుండి 364 మంది చేనేత కార్మికులు తిరిగి వరంగల్‌కు రావడానికి సిద్ధపడ్డారు. దీంతో కార్మికులంతా కాకతీయ టెక్స్‌టైల్స్ మరియు వీవర్స్ వెల్ఫేర్ మ్యాక్ సొసైటీగా ఏర్పడ్డారు. 2019లో సీడీటీఎంఎస్ పథకం కింద టెక్స్‌టైల్స్ పరిశ్రమలకు అనుమతి తెచ్చుకున్నారు. ఈ పథకం కింద ఒక్కో యూనిట్‌కు రూ.1 కోటి ఇచ్చారు. మిగతా పెట్టుబడిని బ్యాంకుల ద్వారా రుణంగా తీసుకున్నారు. సగటున ఒక్కో యూనిట్‌కు రూ.2 కోట్ల పెట్టుబడి పెట్టారు. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌళిక వసతుల కల్పన కార్పొరేషన్ మడికొండ ప్రాంతంలో 364 ప్లాట్లు చేసి నేత కార్మికులకు పంపిణీ చేశారు. ఇందులో షెడ్‌ల నిర్మాణం పూర్తి చేసి యంత్రాలను అమర్చారు. ఇందులో ఇప్పటికే 26 యూనిట్‌లు ఉత్పత్తిని ప్రారంభించాయి. నియమ, నిబంధనల మేరకు ఒక్కో యూనిట్‌కు 25 శాతం సబ్సిడీతోపాటు బ్యాంక్ ఆఫ్ ఇంట్రెస్ట్ 7.5 శాతం యూనిట్ యాజమాన్యానికి చెల్లించాల్సి వుంది. ఇప్పటి వరకు సబ్సిడీ చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర అసంతృప్తితో వున్నారు.



అధికారులు, కార్మికుల మధ్య నలుగుతున్న పార్క్

అధికారుల వాదన, కార్మికుల వాదనలు పరస్పరం భిన్నంగా వున్నాయి. సబ్సిడీ ఇచ్చే విషయంలోనూ భిన్నాభిప్రాయా లున్నాయి. హన్మకొండ జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారులు నడుస్తున్న యూనిట్‌లకు సంబంధించి దస్త్రాలు ప్రభుత్వానికి పంపామని, సబ్సిడీ విడుదల చేయాల్సి వుందని చెబుతున్నారు.

సర్కార్ సహకరించాలి : దర్గా స్వామి, ఛైర్మన్

మడికొండ టెక్స్‌టైల్స్ పార్క్‌లో ఏర్పాటు చేసిన పవర్ ల్యూమ్ యూనిట్‌లకు సబ్సిడీని విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కాకతీయ టెక్స్‌టైల్స్ మరియు వీవర్స్ వెల్ఫేర్ మ్యాక్ సొసైటీ ఛైర్మెన్ దర్గా స్వామి కోరారు. 166 యూనిట్లకు సబ్సిడీ విడుదల చేయకుండానే ఇఎంఐ చెల్లించమంటున్నారన్నారు. సబ్సిడీ విడుదల చేస్తే యంత్రాలు అమర్చిన యూనిట్స్‌ను కూడా రన్ చేస్తామన్నారు. కరోనాతో తీవ్రంగా నష్టపోయామని రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

రూ.10.40 కోట్ల సబ్సిడీ కోసం ఎదురుచూపులు

సూరత్ నుండి ఎంతో ఆశతో వచ్చిన నేత కార్మికులు మడికొండ పార్క్‌లో యూనిట్‌లను ఏర్పాటు చేసినా, సకాలంలో సబ్సిడీ ఇవ్వకపోవ డంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ మ్యాక్ సొసైటీ కార్మికులు మొత్తం 166 యూనిట్లకు సబ్సిడీ రావాలంటున్నారు. అధికారులు మాత్రం 26 యూనిట్లకే సబ్సిడీ రావాలంటున్నారు. ఈ మేరకు ఆ యూనిట్‌లకు సంబంధించిన దస్త్రాలను ప్రభుత్వానికి పంపినట్టు చెబుతున్నారు.

సమన్వయలోపం కార్మికులకు శాపం..

ఒకవైపు బ్యాంకు అధికారులు, ఇచ్చిన రుణానికి ఇఎంఐ చెల్లించాలని పట్టుపడుతున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తాం, మీరు ఇక్కడే పనిచేసుకోండని ప్రకటిస్తుందే తప్పా నిధులను విడుదల చేయదు. దీంతో పవర్‌ల్యూం కార్మికులు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. యంత్రాలను ట్రయల్ రన్ చేయకపోతే సేల్ డీడ్ చేయమని టీఎస్ఐఐసీ అధికారులు చెబుతుండగా, సేల్ డీడ్ చేయకుండా జాప్యం చేస్తే సిక్ ఇండస్ట్రీల కింద ప్రకటించి వేలం వేసే పరిస్థితి ఉత్పన్నమవుతుందని బ్యాంకు అధికారులు హెచ్చరిస్తున్నారు. యంత్రాలను నడిపి ఉత్పత్తి ప్రారంభించి మార్కెటింగ్ చేసి సేల్స్ ట్యాక్స్ కడితేనే యూనిట్‌లు పద్ధతి ప్రకారం పనిచేస్తున్నట్టు అని అని బ్యాంకర్లు చెబుతున్నారు.



సారు స్పీచ్‌పై సర్వత్రా ఆసక్తి...


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం కేసీఆర్ ఆదివారం శాసనసభలో చేయబోయే ప్రసంగంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అసెంబ్లీ సమావేశాల మొదటి రోజైన గురువారం ఆయన సభకు విచ్చేశారు. ఆ తర్వాత శుక్ర, శనివారాల్లో సభ జరిగినప్పటికీ సీఎం రాలేదు. సమావేశాలకు ఆఖరి రోజుగా భావిస్తున్న ఆదివారం ఆయన కచ్చితంగా సభకు రానున్నారు. సుదీర్ఘంగా ప్రసంగించనున్నారు. ఈ క్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పీఆర్సీ, ఐఆర్, గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె, ఐకేపీ వీవోల సమస్యలు, ఆర్టీసీ విలీనం, జర్నలిస్టుల ఇండ్ల సమస్యలు తదితరాంశాలపై ముఖ్యమంత్రి స్పందన కోసం ఆయా వర్గాలు ఆశగా ఎదురు చూస్తున్నాయి. ఇదే సమయంలో ప్రస్తుత బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఇవే చివరి అసెంబ్లీ సమావేశాలు కానున్నాయి. ఈ క్రమంలో గత ఐదేండ్లలో తాము చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు తదితరాంశాలపై సీఎం... సుదీర్ఘంగా ప్రసంగించే అవకాశాలున్నాయి. వచ్చే శాసనసభ ఎన్నికల దృష్ట్యా కూడా అధికార పక్షానికి ఈ సమావేశాలు చాలా కీలకమైనవి. ఈ నేపథ్యంలో కేసీఆర్ వివిధ అంశాలపై ఎలా స్పందిస్తారు..? ఏం మాట్లాడతారనేది వేచి చూడాల్సిన అంశంగా మారింది.

సర్కారుకు ఆ రెండే ఆదాయ మార్గాలు..

కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఎద్దేవా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



మద్యంతో పాటు భూముల అమ్మకాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ప్రభుత్వం భావిస్తున్నదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి తెలిపారు. శనివారం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి ఆదాయ మార్గాలు ఆ రెండేనని ఎద్దేవా చేశారు. ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ వాటా 44 శాతం అని చెబుతున్నారు.. కానీ ఆయా కంపెనీల్లో తెలంగాణ ఉద్యోగుల వాటా ఎంతని ప్రశ్నించారు. రాష్ట్రం వచ్చిన తర్వాత పాలకులు మారారు తప్ప... ప్రజల జీవన స్థితగతుల్లో ఎలాంటి మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులకు అవకాశాలు కల్పిస్తున్నారనీ, తెలంగాణలో మాత్రం అలాంటి పరిస్థితి లేదని చెప్పారు.

మిగిలిన కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి : మండలిలో నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో మిగిలిపోయిన కాంట్రాక్టు అధ్యాపకులనూ రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం శాసనమండలిలో ప్రత్యేక ప్రస్తావన కింద ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. జీవోనెంబర్ 16 ప్రకారం కాంట్రాక్టు అధ్యాపకులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసిందన్నారు. జూనియర్ కాలేజీల్లో 470 మంది, డిగ్రీ కాలేజీల్లో 600 మంది ఇంకా రెగ్యులరైజ్ కాకుండా మిగిలిపోయారని వివరించారు. వారు అర్హతలు కలిగి ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో 1,339 మంది కాంట్రాక్టు అధ్యాపకులను కూడా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి స్పందిస్తూ రెగ్యులరైజ్ అయిన కాంట్రాక్టు ఉద్యోగుల్లో ఎక్కువ మంది విద్యాశాఖకు చెందిన వారే ఉన్నారని చెప్పారు. మిగిలిన వారిని రెగ్యులరైజ్ చేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు.

స్పౌజ్ టీచర్ల బదిలీలు చేపట్టాలి : ఏవీఎన్ రెడ్డి

రాష్ట్రంలో స్పౌజ్ టీచర్లకు బదిలీలను చేపట్టాలని బీజేపీ సభ్యుడు ఏవీఎన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. భార్య ఒక చోట, భర్త మరోచోట విధులు నిర్వహించడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వారిని ఒకే జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్ల స్పౌజ్ బదిలీలు చేశారని వివరించారు. మిగిలిన ఎస్జీటీలు, భాషాపండితులు, పీఈటీలకు సంబంధించిన స్పౌజ్ బదిలీలు చేపట్టాలని సూచించారు. దీనిపై మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పందిస్తూ సీఎం కేసీఆర్ సహకారంతో మూడు వేల మంది స్పౌజ్ టీచర్ల బదిలీలు చేపట్టామని గుర్తు చేశారు. మిగిలిన వారికి సంబంధించి ఆయా జిల్లాల్లో ఖాళీ పోస్టులను బట్టి స్పౌజ్ బదిలీలు చేపట్టే అంశాన్ని పరిశీలిస్తామని హామీనిచ్చారు.

మండలిని సందర్శించిన సర్కారు బడి పిల్లలు

• స్వాగతం పలికిన ఎమ్మెల్సీ కవిత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులు శనివారం శాసన మండలిని సందర్శించారు. ఎమ్మెల్సీలు కవిత, వాణీదేవి వారికి స్వాగతం పలికారు. మండలి పనితీరు, సభా కార్యకలాపాలు జరిగే పద్ధతి గురించి ఎమ్మెల్సీ కవిత వారికి వివరించారు. మండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆయా విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం అందరూ కలిసి ఛైర్మెన్ ఛాంబర్‌లో ఫొటో దిగారు. విద్యార్థులు మండలి పనితీరు తెలుసుకోవడంతో ప్రజాసేవపై వారికి ఆసక్తి పెరుగుతుందని కవిత వ్యాఖ్యానించారు.

ఆర్టీసీ విలీనానికి బీజేపీ వ్యతిరేకం కాదు..: ఎమ్మెల్యే ఈటల



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికి బీజేపీ ఎంత మాత్రం వ్యతిరేకం కాదని ఆ పార్టీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తెలిపారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... ఈ విషయంలో ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. గవర్నర్ లేని సమయంలో బిల్లు పంపి ఆమోదించడంలేదంటూ విమర్శించటమేంటని ప్రశ్నించారు. ఈ రకంగా బట్ట కాల్చి మీద వేస్తున్నారని వాపోయారు. ఆర్టీసీ కార్మికులకు రెండు పీఆర్సీలు ఇవ్వలేదని తెలిపారు. వారి గుండెల్లోని బాధను మర్చిపోలేమన్నారు. మహిళా కండక్టర్లకు ఇష్టం లేకపోయినా రాజ్‌భవన్ వద్ద ధర్నాకు పంపుతున్నారని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలను బీఆర్ఎస్ ప్రభుత్వం మొక్కుబడిగా నిర్వహిస్తున్నదని విమర్శించారు. ప్రజల కోసం సమావేశాలు జరగడం లేదని.. తమ వైపు స్పీకర్ కన్నెత్తి చూడటం లేదని చెప్పారు. తాము మాట్లాడితే ఒక వైపు హరీష్‌రావు, కేటీఆర్ దాడి చేస్తున్నారని విమర్శించారు. గ్రామ పంచాయితీ సిబ్బంది జీతాలు రాక ఆందోళన చేస్తున్నారని గుర్తుచేశారు.

రైల్ కాల్పుల ఘటనలో మరణించిన సైపుద్దీన్ కుటుంబానికి కేటీఆర్ అండ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీలో హామీ ఇచ్చిన ప్రకారం, జూలై 31న జైపూర్-ముంబై రైలు ఘటనలో మరణించిన హైదరాబాద్ నివాసి సయ్యద్ సైపుద్దీన్ కుటుంబానికి మంత్రి కేటీ రామారావు రామారావు అన్ని విధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. మరణించిన సైపుద్దీన్ భార్య అంజుమ్ షాహీన్‌ను శనివారం అసెంబ్లీ ఆవరణలోని మంత్రి కార్యాలయంలో కలిసారు. తెలంగాణ ప్రభుత్వం వారి కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ తెలిపారు. షాహీన్‌కు కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో ఆఫీస్ సబార్డినేట్‌గా నిమించిన ఉత్తర్వులను ఆమెకు అందజేశారు. దీంతో పాటు ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఫ్లాట్ మంజూరు, కేటాయింపు పత్రాన్ని అందజేశారు. సైపుద్దీన్ ముగ్గురు పిల్లలకు... ఒక్కొక్కరి కోసం రూ.రెండు లక్షల చొప్పున బీఆర్ఎస్ పార్టీ తరపున అందించారు.

చారిత్రాత్మక కట్టడాల పునరుద్ధరణకు చర్యలు

• జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్

• ఆరు పురాతన కట్టడాల పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

చారిత్రాత్మక కట్టడాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్టు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. శనివారం హైదరాబాద్ పాతబస్తీలోని ఆరు పురాతన కట్టడాలను ఆయన సందర్శించారు. చెత్త బజార్ కమాన్, హుస్సేనీ ఆలం కమాన్, షేక్ ఫాయిజ్ కమాన్, దేవన్ దేవిడి కమాన్, డబీర్ పుర కమాన్, రాణిగంజ్ కమాన్‌ల పునరుద్ధరణ పనులను చేపట్టేందుకు ఇ.ఎన్.సీ జియాఉద్దీన్‌తో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో గల చారిత్రాత్మక కట్టడాలు పర్యాటకులను ఆకట్టుకునే విధంగా పునరుద్ధరణ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. గతంలో చార్మినార్ పెడెస్ట్రీరియన్ ప్రాజెక్ట్ ద్వారా సుమారు రూ. 60 కోట్లతో 13 పనులు చేపట్టామని, అందులో ఆరు పనులు పూర్తి కాగా మిగతావి వివిధ అభివృద్ధి దశలో ఉన్నాయన్నారు. హైదరాబాద్ వారసత్వ సంపదను భావితరాల వారికి అందించాలనే నేపథ్యంలో మూడు పురాతన హెరిటేజ్ భవనాల పునర్నిర్మాణం, పరిరక్షణకు రూ. 18 కోట్ల వ్యయంతో మోజంజాహి మార్కెట్, మౌలాలి కమాన్, క్లాక్ టవర్ పనులు ప్రారంభించామన్నారు. అదేవిధంగా రూ. 30 కోట్ల వ్యయంతో చేపట్టిన ముర్గీ చౌక్ పునర్నిర్మాణ పనులు, రూ. 30 కోట్ల వ్యయంతో చేపట్టిన సర్దార్ మహల్ పునరుద్ధరణ పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, జోనల్ కమిషనర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్ నాయక్, చార్మినార్ జోన్ ఎస్.ఇ మహేశ్వర్ రెడ్డి, కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్మెంట్ ఇ.ఇ శంకర్, మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోడేపూడి స్ఫూర్తితో ఉద్యమాలు : తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బోడేపూడి వెంకటేశ్వరరావు సీపీఐ(ఎం)శాసన సభాపక్ష నాయకుడిగా పనిచేస్తూనే రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఎంతగానో కృషి చేశారని తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో బోడెపుడి 26వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. చిన్నతనంలోనే కమ్యూనిస్టు ఉద్యమానికి ఆకర్షితులైన బోడెపుడి పూర్తికాలం కార్యకర్తగా ఖమ్మం జిల్లాల్లో పని చేశారని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిని వదులుకుని ప్రజా సేవలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైందని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడ ఏ సమస్య ఉత్పన్నమైనా.. అక్కడ ప్రత్యక్షమై సమస్యను పరిష్కరించడానికి కృషి చేశారని చెప్పారు. ఉపాధ్యాయుల, ఉద్యోగుల, కార్మికుల సమస్యలతోపాటు రైతాంగ సమస్యలను కూడా ప్రభుత్వ దృష్టికి తేవడమేగాక ఉద్యమాల్లో ప్రత్యక్ష పాత్ర పోషించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో కరువు, వరదలు ఏర్పడి తీవ్ర నష్టం జరిగినప్పుడు ఆయా ప్రాంతాలకు వెళ్ళి నష్టపోయిన వారికి ధైర్యం చెప్పడమేగాక ప్రభుత్వంతో పోరాడి పరిహారం ఇప్పించారని తెలిపారు. నేటి ప్రభుత్వాలు వాగ్దానాలు చేయడమే తప్ప ఆచరణలో పరిహారాలు ఇవ్వడం లేదని విమర్శించారు. ఈ క్రమంలో బోడెపుడి పోరాట స్ఫూర్తితో కమ్యూనిస్టు ఉద్యమాన్ని విస్తరించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, రాష్ట్ర నాయకులు ఆర్. ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు ఆర్. రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నాన్‌మైనార్టీ వైద్య కళాశాలల్లో ఏ కేటగిరీ సీట్లను 60 శాతానికి పెంచాలి

ప్రశ్నోత్తరాల్లో అక్బరుద్దీన్, భట్టి

• కమిటీ వేస్తాం : మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రాష్ట్రంలోని మైనార్టీ మెడికల్ కాలేజీల్లో మాదిరిగానే నాన్‌మైనార్టీ కళాశాలల్లోనూ ఏ కేటగిరీ సీట్లను 60 శాతానికి పెంచాలని ప్రతిపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పట్టుబట్టారు. మైనార్టీ కళాశాలల్లో 60 శాతం ఏ కేటగిరీ సీట్లున్నాయని తెలిపారు. నాన్‌మైనార్టీ కాలేజీల్లోనూ ఏ కేటగిరీ కోటాను పెంచడం వల్ల ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు న్యాయం చేకూరుతుందని నొక్కి చెప్పారు. దీనిపై మంత్రి హరీశ్‌రావు వివరణ ఇస్తూ పరిశీలించి కమిటీ వేస్తామని హామీనిచ్చారు. దీనిపై అక్బరుద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ..'పేద విద్యార్థులకు నష్టం జరుగుతుంటే కమిటీలేంటి? కౌన్సిలింగ్‌ను ఆపేయండి' అంటూ అరిచారు. రాష్ట్రంలో నూతన వైద్య కళాశాలల ఏర్పాటుపై శనివారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల్లో బీఆర్ఎస్ సభ్యులు గాదరి కిశోర్, డాక్టర్ సంజయ్‌కుమార్, డాక్టర్ మెతుకు ఆనంద్, ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క లేవనెత్తిన అంశాలపై మంత్రి సమాధానం ఇచ్చారు. ఎనిమిదేండ్లలో రాష్ట్రంలో 29 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు మంజూరు చేశామన్నారు. 21 కళాశాలలు నిర్వహణలో ఉన్నాయని తెలిపారు. మరో 8 కళాశాలల ఏర్పాటు ప్రక్రియ జరుగుతున్నదని చెప్పారు. రాష్ట్రంలో వైట్‌కోర్టు రెవల్యూషన్ నడుస్తున్నదన్నారు. ఒకనాడు రాష్ట్రంలో 2250 మెడికల్ సీట్లుంటే ఆ సంఖ్య నేడు 8,515కి చేరిందనీ, పీజీ సీట్ల సంఖ్య 2,890కి పెరిగిందని వివరించారు. ఎంబీబీఎస్ సీట్లు మూడు రెట్లు, పీజీ సీట్లు రెండున్నర రెట్లు పెరిగాయన్నారు. వంద సీట్ల మెడికల్ కాలేజీ ఏర్పాటుకు రూ.300 కోట్లు, 150 సీట్ల కళాశాలకు రూ.500 కోట్లు ఖర్చువుతున్నదని వివరించారు. ఒక్కో మెడికల్ విద్యార్థిపై రూ.30 లక్షలు, పీజీ విద్యార్థిపై రూ.45 లక్షలు, సూపర్ స్పెషాల్టీల తయారీకి రూ.75 లక్షలు ఖర్చువుతుందని సభకు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనలకు అనుగుణంగా రాష్ట్రంలో డాక్టర్ల సంఖ్య ఉందని చెప్పారు.

కేంద్రం ప్రయివేటీకరిస్తుంటే..మేం కాపాడుతున్నాం : మంత్రి జగదీశ్‌రెడ్డి



సింగరేణి బొగ్గు గనుల వేలం అంశంపై సభ్యులు సీఎల్పీ నేత భట్టివిక్రమార్క, కాంగ్రెస్ సభ్యులు శ్రీధర్ బాబు, బీఆర్ఎస్ సభ్యులు కోరుకంటి చందర్, సండ్ర వెంకటవీరయ్య, దివాకర్‌రావు అడిగిన ప్రశ్నలకు మంత్రి జి.జగదీశ్‌రెడ్డి సమాధానాలిచ్చారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని చూస్తున్నది ఒక్క కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. విద్యుత్ సంస్థ ప్రయివేటీకరణను వ్యతిరేకించిందీ తమ ప్రభుత్వమేనన్నారు. సింగరేణిపై కేంద్రం జోక్యం పెరుగుతున్నా చివరకు వరకు కాపాడుకునే ప్రయత్నం చేస్తామని చెప్పా రు. సింగరేణి ప్రాంతంలో ఇతర నిక్షేపాలను వెలికి తీసే బాధ్యత ప్రయివేటుకు అప్పగించాలని కేంద్రం యత్నాన్ని అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

ఎకరా పామాయిల్ తోటపై రూ.50,918 సబ్సిడీ : మంత్రి నిరంజన్‌రెడ్డి



రాష్ట్రంలో పామాయిల్ తోటల పెంపకంపై ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, సాగు ప్రోత్సహంపై అధికార పార్టీ సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, అడిగిన ప్రశ్నలకు మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. ఆయిల్ ఫామ్ సాగుచేస్తున్న రైతులకు ఎకరాకు రూ.50918 సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. పన్నెండున్నర ఎకరాల వరకు రైతుల కేటగిరీ ప్రాతిపదిక 80 శాతం నుంచి 100 శాతం వరకు బిందు సేద్య సహాయాన్ని కల్పిస్తున్నామన్నారు. తెలంగాణలో 20 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగును ప్రోత్సహించేవిధంగా అడుగులు వేస్తున్నామన్నారు. 25-30 ఎకరాల్లో కూడా సాగుచేసే రైతులకు సహాయం అందించే విషయంపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

రాష్ట్రంలో 7.7 శాతం పచ్చదనం పెరిగింది : మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



రాష్ట్రంలో హరితహారం వల్ల పచ్చదనం 7.7 శాతం అధికంగా పెరిగిందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చెప్పారు. హరిత వనాల పెంపుపై అధికార పార్టీ సభ్యులు గువ్వల బాలరాజు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమి చ్చారు. రాష్ట్రంలో 13.44 ఎకరాల్లో అంతరించిపోయిన అడవులను పునర్జీవింపజేశామని తెలిపారు. 109 పట్టణ పార్కులకుగానూ ఇప్పటికే 73 పూర్తయ్యి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. రాష్ట్రంలో 14864 నర్సరీలు, 19472 పల్లె ప్రకృతి వనాలు, 2011 బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశామన్నారు.

కాందిశీకుల భూములను కాపాడాలి

401 ఎకరాల భూములను భూమిలేని పేదలకు పంచాలి

తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్‌రాములు

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్



చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామ రెవెన్యూ పరిధిలో కాందిశీకుల భూములను భూబకాసురుల నుంచి కాపాడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు డిమాండ్ చేశారు. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కార్మిక సంఘం బృందంతో కలిసి సర్వేనెంబర్ 114,115లలో కాందిశీకుల భూములను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికార పార్టీ పెద్దలు కలిసి 401 ఎకరాల భూములను కాజేయడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జిల్లా కలెక్టర్, చౌటుప్పల్ ఆర్డీఓ, తహసీల్దార్ మంత్రి జగదీశ్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాటలు వినకపోవడంతో రాత్రికి రాత్రే వారిని బదిలీ చేయించారని అన్నారు. కాందిశీకుల వారసుల పేర్లపై దొంగ చాటుగా భూములను ఆక్రమించుకునేందుకు యత్నించారని విమర్శించారు. ఈవిషయం మీడియాకు లీకు కావడంతో విషయం వెలుగులోకొచ్చిందన్నారు. 1952 సంవత్సరంలో కాందిశీకులకు 401 ఎకరాల భూములను కేటాయించగా వారు దేశ విభజనలో పాకిస్తాన్‌కు వెళ్లారన్నారు. అప్పటినుండి ఆ భూములు పడావుగా ఉందన్నారు. ఈ మధ్యకాలంలో కొంతమంది తప్పుడు ధృవపత్రాలు సృష్టించి ఆ భూములకు మేమే వారసులమంటూ చూస్తున్నారని విమర్శించారు. ఒకట్రెండు కుటుంబాలకు వంద ఎకరాల భూములు ఎట్లా వస్తాయని ఆయన ప్రశ్నించారు. నిజమైన వారసులు ఎవరో తేల్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నిరుపేదలకు పంచకపోతే తమ సంఘం ఆధ్వర్యంలో ఇండ్లు, భూములు లేని నిరుపేదలకు పంచుతామని హెచ్చరించారు. చౌటుప్పల్ మండలంలో ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో సర్వే చేసి ఇండ్లస్థలాలు, భూములు లేని నిరుపేదలకు పంచాలని కోరారు. రానున్న కాలంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఉద్యమాలు చేపడతామన్నారు. కొంతమంది ఆ భూములను కాజేయాలని కుట్రలు చేస్తున్నారని పెద్దఎత్తున వార్తలు వస్తున్నాయన్నారు. ఈ వ్యవహారంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ప్రకటన చేయాలని కోరారు. జిల్లా రెవెన్యూ యంత్రాంగం స్పందించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ,రాష్ట్ర కమిటీ సభ్యులు, సీపీఐ(ఎం) మండలకార్యదర్శి గంగాదేవి సైదులు, జిల్లా సహాయ కార్యదర్శి గుంటోజు శ్రీనివాస్‌చారి, మండల ప్రధానకార్యదర్శి బొజ్జ బాలయ్య, జిల్లా కమిటీ సభ్యులు బోయ యాదయ్య, మానే సాలయ్య, మండల సహాయకార్యదర్శి మీసాల శ్రీనివాస్, గ్రామ నాయకులు గుండ్ల మహేష్, చెంచలమదారి, కాసం వెంకటేష్ పాల్గొన్నారు.

గురుకుల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయులు, అధ్యాపకులు , ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ బాల రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.దయాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి నవీన్ నికోలస్‌కు పలు సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి సుధారాణి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

స్నేహమేరా..!



మానవాళి విముక్తి కోసం జీవితాలను అర్పించిన మార్క్స్, ఏంగెల్స్‌ల స్నేహం ఇప్పటికీ ఆదర్శవంతమైనది. 'మానవళి చరిత్రలో స్నేహానికి దర్పణం పట్టే అన్ని ఉదాహరణలను అధిగమించే స్నేహితుల ద్వయం, మేథోజోడి, కార్మికవర్గపు శాస్త్రజ్ఞానాన్ని సృష్టించిందని యురోపియన్ కార్మికవర్గం చెప్పుకుంటుంది' అని మార్క్స్, ఏంగెల్స్ స్నేహం గురించి లెనిన్ వ్యాఖ్యానిస్తాడు. వారి స్నేహం ఎంత బలమైనదో, వారు దర్శించిన విప్లవ క్రమం అంత నిర్మాణాత్మకమైనదని వీరి స్నేహం రుజువు చేస్తుంది.

'స్నేహమేరా జీవితం, స్నేహమేరా శాశ్వతం, స్నేహమే నాకున్నదీ, స్నేహమేరా పెన్నిధీ!' అనే పాట మరపురానిది. ఎందుకంటే అది స్నేహబంధాన్ని గురించిన సృజన కాబట్టి. అన్ని సంబంధాల కన్నా స్నేహసంబంధం చాలా గొప్పదని ఎందుకు చెబుతున్నామంటే, అందులో స్వేచ్ఛ వుంటుంది. ప్రజాస్వామికతత్వం ఉంటుంది. పరస్పర గౌరవ భావన వ్యక్తం అవుతుంది. తన సహచరుడు బాగుండాలనే, ఎదగాలనే అభిలాష స్నేహంలో వుంటుంది. అందుకే స్నేహమంటే అందరికీ ఇష్టంగా వుంటుంది. ఒక వ్యక్తి తనను తాను పూర్తిగా తెరచి ఒక్క స్నేహితుడి దగ్గరే పెట్టగలడు. అది బలమైనా, బలహీనతైనా, మంచియైనా చెడైనా నిర్భయంగా స్నేహితుడితోనే పంచుకోగలము కదా! అందుకే స్నేహం అనే భావనకు ఎంతో విలువ ఏర్పడింది. స్నేహంలో ప్రేముంటది, బాధ్యతుంటది, ఇచ్చిపుచ్చుకోవడమూ, సహనము, ఓదార్పు, సమభావన, సమైక్యత అన్నీ కలిసి వుంటాయి. అందుకే 'స్నేహమేరా జీవితానికి వెలుగునిచ్చే వెన్నెల... స్నేహమేరా! బతుకుబాటలో నీడనిచ్చే తోడురా!' అని పాడుకోగలుగుతున్నాము.

ప్రకృతి గమనాన్ని మనం పరిశీలించినట్లయితే ప్రతి జీవీ సహచరత్వ జీవనాన్నే కొనసాగించింది. ఏ జీవీ ఒంటరిగా లేదు. సహచరత్వమనేది జీవలక్షణంగా కాక, బుద్ధి లక్షణంగా ఎదిగింది. మానవ సమూహమే. కానీ ఆస్తి, ఆధిపత్య భావాలతో కుటుంబ వ్యవస్థ ఏర్పడ్డాక, అన్ని సంబంధాలూ ఆ ఒరవడిలోనే కొనసాగుతున్నాయి. అందుకే మనిషి స్నేహమయ జీవితాన్ని కోరుకుంటున్నాడు. ఈ ఆధునిక సమాజంలో అన్ని సంబంధాలూ ఆర్థిక సంబంధాలుగా ఏర్పడ్డాక స్వేచ్ఛకు, మానవీయాంశానికి తావు లేకుండా పోయింది. కానీ మానవ హృదయం, కోల్పోయిన దాని గురించి వెతుకులాట నిరంతరం చేస్తూనే వుంది. అందుకే స్నేహమయ జీవనకాంక్ష ఎల్లప్పుడూ మనందరిలోనూ వుంటుంది. చరిత్రలోనూ గొప్ప స్నేహాలుగా ప్రసిద్ధికెక్కిన ఉదాహరణలూ మనకున్నాయి. కావ్యాలలోనూ, ఇతిహాసాలలోనూ మధురమైన స్నేహ పుటలను తిరిగేయ గలుగుతాము. మిత్రలాభం గురించిన కథలలో స్నేహ ప్రయోజనాలు, మిత్రభేదం వలన కలిగే కష్టాలను గురించీ మన సాహిత్యంలో చెప్పారు. కుటుంబాలలోని అనుబంధాలూ స్నేహంగా ఉన్నప్పుడే వర్ధిల్లుతాయి.

సంపాదకీయం

అయితే నేటి సమాజంలో అంత ఉన్నతంగా స్నేహం సాగుతున్నదా! చాలా వరకు లేదనే చెప్పవచ్చు. స్నేహమనే మాటను మనం తేలిక చేసేశాము. కుల, మత ప్రాతిపదికన, ఆర్థిక స్థాయిలను బట్టి, హోదాలను బట్టి ఏర్పడిన స్నేహాలు, నిజమైన స్నేహాలుగా చెప్పుకోలేము. అవి మంచి స్నేహాలుగా నిలువజాలవు కూడా. పరిచయాలు, అవసరాల మేరకు ఏర్పడ్డ మిత్రత్వాన్ని నిజమైన స్నేహంతో పోల్చలేము. రెండు భిన్నమైన, వైరుధ్య పూరితమైన భావాలు గలవారి మధ్య స్నేహం చిగురించడం కష్టమైన పని. భిన్న అభిప్రాయాలు ఉండవచ్చు. కానీ విరుద్ధ దృక్పథాలు స్నేహం చేయలేవు. చేసిన దాఖలాలూ లేవు. చరిత్రలో చూసుకుంటే భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల స్నేహం, స్వాతంత్ర్యం కోసం చేసిన సమరంలో సాగిన స్నేహం. ఇక మానవాళి విముక్తి కోసం జీవితాలను అర్పించిన మార్క్స్, ఏంగెల్స్‌ల స్నేహం ఇప్పటికీ ఆదర్శవంతమైనది. 'మానవళి చరిత్రలో స్నేహానికి దర్పణం పట్టే అన్ని ఉదాహరణలను అధిగమించే స్నేహితుల ద్వయం, మేథోజోడి, కార్మికవర్గపు శాస్త్రజ్ఞానాన్ని సృష్టించిందని యురోపియన్ కార్మికవర్గం చెప్పుకుంటుంది' అని మార్క్స్, ఏంగెల్స్ స్నేహం గురించి లెనిన్ వ్యాఖ్యానిస్తాడు. వారి స్నేహం ఎంత బలమైనదో, వారు దర్శించిన విప్లవ క్రమం అంత నిర్మాణాత్మకమైనదని వీరి స్నేహం రుజువు చేస్తుంది. ప్రపంచమానవాళిని మానవీయంగా తయారు చేయడానికి చేసిన కృషిలో వీరి మైత్రి వెలుగొందింది. అదే విధంగా ఒక దేశంలో విప్లవ సాధనలో ఏర్పడిన మైత్రి ఫిడెల్‌కాస్ట్రో, చేగువేరాలది. ఇలా ఆశయాలదారుల్లో పరిమళించిన స్నేహాలు మనకెంతో స్ఫూర్తినీ, చైతన్యాన్ని కలిగిస్తాయి. చిరస్మరణీయంగా నిలుస్తాయి.

వ్యక్తుల మధ్యనే కాదు, దేశాల మధ్య కూడా శత్రుత్వాలు, వైషమ్యాలు తీసివేసి స్నేహభావంతో కలసిమెలసి ఉండాలన్న లక్ష్యమూ ఈ స్నేహ దినోత్సవాన్ని జరుపుకోవటంలో వుంది. ప్రపంచ ప్రజల మధ్య స్నేహ సంబంధాలు ఏర్పడాలనే భావనా ఈ దినోత్సవాల ఆశయంగా కొనసాగుతున్న సందర్భంలో, మనదేశంలో కులాల మధ్య, తెగల పేరుతోని, మతం పేరుతోని మనుషుల మధ్య విద్వేషాలను సృష్టిస్తూ అమానవీయ కృత్యాలకు ప్పాలడటం నిజంగా ఎంతో బాధాకర విషయం. ఎప్పుడూ ఎదుటివానిలో వైషమ్యాన్ని రగిల్చే ఉన్మాద సమూహాల నుండి స్నేహాన్ని, మానవీయతను ఆశించలేము. మిత్రుడైన వాడు ఎదుటివాని తప్పులను సరిదిద్ది మంచి మార్గాన నడిపించాలి. చెడుమార్గాలు, సమాజానికి ఎంత ముప్పును తెచ్చిపెడతాయో స్నేహ హృదయంతో బోధించాలి. స్నేహం చేయాలి. స్నేహానందాన్ని పొందాలి!

హర్యానాలో బుసకొట్టిన మతోన్మాదం

మతసామరస్యం, లౌకికతత్వం కాపాడుకోవాలని చాలాకాలంగా ప్రజాస్వామికవాదులు చెబుతున్న మాట ఎంత నిజమో ఆచరణలో అర్థమవుతున్న సందర్భమిది. దేశ పాలకులు ఆ విధమైన సందేశంతో ముందుకు రావడం లేదు సరికదా ఎగదోసేందుకు కారణమవుతున్నారు.గత మూడు మాసాలుగా దేశం మణిపూర్‌లో హింసాకాండపై కలత చెందుతున్నది. ఈశాన్యాన కొండకోనల్లో మారుమూలల్లో మహిళలపై ఘోరకలి సాగిన తీరు తెలుసుకుని భరతమాత తల్లడిల్లింది. అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహించింది. దేశం సిగ్గుపడాలని ప్రధాని మోడీ పార్లమెంటు భవనం ముందు ప్రవచించారు కూడా. అయితే అత్యున్నత చట్టసభ అయిన పార్లమెంటులో అదే మాట చెప్పడానికి ఒప్పుకోలేదు. ఉభయ సభల్లో ఆ అంశం సమగ్రంగా చర్చించడానికి కేంద్రం సిద్ధపడలేదు. అవిశ్వాస తీర్మానం రూపంలో చర్చ చేద్దామని ప్రతిపక్షాలు కొత్తవ్యూహం చేపట్టాల్సి వచ్చింది. ఈలోగా దేశ రాజధాని శివార్లలోని కార్పొరేట్ హబ్ గుర్‌గ్రాం, నూహ్ పట్టణాల్లో మత కలహాలు భగ్గుమన్నాయి. మత సంస్థలు వ్యూహాత్మకంగా పెట్టిన చిచ్చు ఆరుప్రాణాలు పోవడానికి కారణమైంది. హిందూత్వ శక్తుల కవ్వింపు చర్యలు, వాటిపై అభద్రతతో ముస్లింలు రెచ్చిపోవడం తీవ్ర హింసాకాండకు దారి తీసింది. అక్కడ చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేవారు, పనిచేసుకుని పొట్ట పోసుకునే శ్రమజీవులు వలస ప్రాణులు అకారణంగా బలైపోయారు. మణిపూర్ మంటలు ఢిల్లీపాలకులను చేరడానికి చాలా సమయం పట్టింది కానీ ఈ విధ్వంసం దావానంలా వ్యాపించిన హింస దేశానికే కలవరం కలిగించాయి.



తెలకపల్లి రవి

ఈ సమయంలోనే వారణాసిలోని జ్ఞానవాపి మసీదు వాజ్యం తిరగదోడబడింది. ఒకప్పుడు అయోధ్యలో బాబ్రీమసీదు/రామజన్మభూమి వివాదం రగిలిన తీరులోనే ఇప్పుడు వారణాసి వివాదం రగులుకుంటుందనే సందేహాలు బలపడుతున్నాయి. ఈ మసీదులో పురావస్తు పరిశోధనలు జరపాలంటూ కింది కోర్టు ఇచ్చిన ఆదేశాలు సుప్రీం కోర్టు దాకా వెళ్లి తిరిగి హైకోర్టుకు వచ్చి అనుమతి పొందాయి. అయితే ఆ అనుమతితో నిమిత్తం లేకుండా యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దాన్ని మసీదు అననక్కరలేదని ఏకపక్షంగా ప్రకటించేశారు. ఇలాంటి వైఖరి ఆచరణలో మతోన్మాద రాజకీయాలను ఎలా ప్రకోపింపచేస్తుందో చాలాసార్లు చూశాం. అన్నట్టు మధురలోనూ కృష్ణజన్మస్థాన్ ఇలాంటి మలుపులే తిరుగుతున్నది. వందల సంవత్సరాల కిందటి చరిత్ర పరిణామాలపై ఇలాటి వివాదాలు పునరావృతం కాకూడదనే పార్లమెంటు 1991 ప్రార్థనా స్థలాల చట్టం ఆమోదించింది. అయోధ్య సమస్యలో సుప్రీం కోర్టు తీర్పును పాటించాలని మిగిలిన అన్ని చోట్ల 1947 ఆగష్టు15న స్వాతంత్రం వచ్చిన నాటి యథతథ స్థితి కొనసాగాలి తప్ప కొత్త వివాదాలు అనుమతించరాదని ఈ చట్టం నిర్దేశించింది. కాని స్వయాన సుప్రీం కోర్టు ఇప్పుడా చట్టానికి కొత్త భాష్యం చెప్పి కొత్త తగాదాలకు తలుపుతీసింది. ఈ వివాదాలు, విధ్వంసాలు వి ద్వేషాల పర్యవసానాల పట్ల ప్రతిభారతీయుడూ అప్రమత్తంగా వుండాలి. జైపూర్ ఎక్స్‌ప్రెస్‌లో ఒక ఆర్‌పిఎఫ్ జవాన్ నలుగురు ముస్లింలను వెతికి మరీ కాల్చి చంపడం అతన్ని మతిస్తిమితం లేనివాడని అధికారులు సమర్థించడం కూడా ఇలాటిదే.

హర్యానాలో జరిగిందేమిటి?

హర్యానాలో చెలరేగిన మత ఘర్షణలు, విధ్వంస విద్వేషాలు వాస్తవానికి ఢిల్లీలో జరిగినట్టే భావించాలి. ఎందుకంటే గురుగ్రామ్ పారిశ్రామిక కేంద్రం దేశ, విదేశీ పెట్టుబడులకు పెద్ద సంస్థలకు నిలయం. దేశమంతటి నుంచి వచ్చిన సాంకేతిక నిపుణుల నుంచి సామాన్యుల వరకూ అక్కడుంటారు. ఇటీవలే కురిసిన కుంభవృష్టి వరదల సమయంలో ఈ సంపన్నులు తప్పించు కోగలిగారు గాని మతకలహాల దెబ్బకు తట్టుకోలేకపోయారు. పని చేసుకోవడానికి వలస వచ్చిన అనేక మంది ఇంటిదారి పట్టారు. చిన్నచిన్న వ్యాపారులు దారుణంగా నష్టపోయారు. వారి దుకాణాలు, హోటళ్లు, ఇండ్లు ధ్వంసం కావడం , పూర్తిగా దగ్ధమై పోవడం వారిని కుదిపేసింది. డబుల్ ఇంజన్ సర్కార్ల బీజేపీ నేతల నుంచి ఒక్క ఓదార్పుమాటైనా రాకపోగా ఎదురు దాడి చేస్తుండడంతో హతాశులై వారు మరెక్కడికి పోవాలని కలవరపడు తున్నారు. మొత్తం వ్యవహారం చూస్తే ఒక పథకం ప్రకారమే అల్లర్లు సృష్టించినట్టు స్పష్టమవుతున్నది. వాస్తవానికి నూహ్ ముస్లిం జనాభా అధికంగా వుండే ప్రాంతం.జులై 31న విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఇతర పరివార్ సంస్థలు రెండు దేవాలయాల మధ్య బ్రిజ్ మండల్ యాత్ర ప్రదర్శన నిర్వహిస్తామని ప్రకటించాయి. సంప్రదాయకంగా ఎప్పటినుంచో జరుగుతున్న ఈ ప్రదర్శన ఇటీవలి సంవత్సరాలలో ఉద్రిక్తతలకు ఆలవాల మవుతున్నది. ఎందుకంటే వీహెచ్‌పీ స్థానికులతో పాటు చుట్టుపక్కల రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌ల నుంచి కూడా భారీగా జన సమీకరణ చేసి బలప్రదర్శనగా మార్చేసింది. పైగా ఈ సారి యాత్రలో భజరంగదళ్ నాయకుడైన మోనూ మనేసర్ పాల్గొం టాడని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ మనేసర్ భివానీ జిల్లా భరత్‌పూర్‌లో మొన్న ఫిబ్రవరిలో గోరక్షణ పేరిట నిస్సార్, జునాయిడ్ అనే ఇద్దరు ముస్లిం యువకుల హత్యకేసులో నిందితుడుగా వున్న వ్యక్తి. దానికి ముందు జిమ్‌లో శిక్షణ నిచ్చే ఆసిఫ్‌ఖాన్, వారిస్ ఖాన్ అనే మెకానిక్ హత్యలో కూడా నిందితుడుగా వున్నాడు. అలాంటి వ్యక్తి పాల్గొంటాడని ప్రకటించడం ముస్లిం యువతలో తీవ్ర నిరసనకు దారితీసింది. వారూ వ్యతిరేకంగా సమీకృతం కావడం ప్రచారం సాగించడానికి దారితీసింది. ముందునుంచి సోషల్ మీడియాలో ఈ కథనాలు పోటాపోటీగా నడిచాయి. ఈ సారి ప్రదర్శన తీవ్ర హింసాకాండకు దారితీయవచ్చునని ముందునుంచే పరిశీలకులు అనుమానిస్తూ వచ్చారు. రాజకీయ పార్టీల నాయకులు ఆ మేరకు పోలీసుల యంత్రాంగానికి హెచ్చరికలు చేశారు కూడా. అయితేనేం దేశంలో ఇప్పుడున్న వాతావరణం బీజేపీ-ఆరెస్సెస్ రాజకీయ వ్యూహాల కారణంగా వాటిని బేఖాతరు చేశారు. మరీ ముఖ్యంగా చివరి రోజున మరో భజరంగ్‌దళ్ కార్యకర్త రెచ్చగొట్టే భాషలో దారుణమైన విడియో విడుదల వైరల్ చేశాడు. 'నూహ్ ప్రజానీకం మా రాకను కాచుకోవడానికి సిద్ధంగా వుండాలని' సవాళ్లు విసిరాడు.

> **హర్యానాలో చెలరేగిన మత ఘర్షణలు, విధ్వంస విద్వేషాలు వాస్తవానికి ఢిల్లీలో జరిగినట్టే భావించాలి. ఎందుకంటే గురుగ్రామ్ పారిశ్రామిక కేంద్రం దేశ, విదేశీ పెటుబడులకు పెద్ద సంస్థలకు నిలయం. దేశమంతటినుంచి వచ్చిన సాంకేతిక నిపుణుల నుంచి సామాన్యుల వరకూ అక్కడుంటారు. ఇటీవలే కురిసిన కుంభవృష్టి వరదల సమయంలో ఈ సంపన్నులు తప్పించు కోగలిగారు గాని మతకలహాల దెబ్బకు తట్టుకోలేక పోయారు.**

హత్యలు విధ్వంసాలు,అరాచకం

వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేసే ఏ సంస్థ పైన అయినా డేటా ప్రొటెక్షన్ బోర్డు 250 కోట్ల రూపాయల వరకూ జరిమానా విధించవచ్చు. అయితే ఇందులో ఒక్క రూపాయి కూడా బాధితుడికి చేరదు. గతంలో బాధితుడికి ఐటీ చట్టంలోని సెక్షన్ 43–ఏ కింద నష్టపరిహారం లభించేది. ఇప్పుడు తీసుకొచ్చిన బిల్లులో ఆ సెక్షన్‌ను తొలగించారు. పైగా వినియోగదారులు తమ విధులను నిర్వర్తించడంలో విఫలమైతే రూ. 10 వేల వరకూ జరిమానా విధిస్తారు. ఉదాహరణకు వినియోగదారుడు తప్పుడు లేదా పనికిమాలిన ఫిర్యాదు చేశాడనుకోండి. అతనికి జరిమానా విధించే అవకాశం ఉంది. దీనివల్ల ఫిర్యాదు చేయాలంటేనే వినియోగదారులు భయపడే పరిస్థితి నెలకొంటుంది. వినియోగదారుల సమాచార గోప్యత హక్కును పరిరక్షించడానికి బదులు వారి పైనే జరిమానాలు విధించడం సరికాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అదీకాక ఫిర్యాదు చేసినా బాధితుడికి ఒరిగేదేమీ ఉండదు. అతనికి ఒక్క రూపాయి కూడా పరిహారం లభించదు. పైగా తప్పుడు ఫిర్యాదు చేశారన్న సాకుతో జరిమానా విధిస్తారేమోనన్న భయం. ఇక ఎవరు మాత్రం ఫిర్యాదు చేస్తారు?

మొండిగా వ్యవహరించిన కేంద్రం

ప్రపంచంలోని అనేక దేశాలలో అమలులో ఉన్న డేటా ప్రొటెక్షన్ చట్టాల ప్రకారం బాధితులకు నష్టపరిహారం అందజేస్తారని, మన దేశంలో మాత్రం తాజా బిల్లుతో ఆ అవకాశమే లేకుండా పోయిందని ఖైతాన్ అండ్ కంపెనీ భాగస్వామి సుప్రతిమ్ చక్రవర్తి చెప్పారు. ఆర్థిక నేరాల విషయంలో వ్యవహరించిన విధంగానే బిల్లులోని నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తారని శార్దూల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ అండ్ కంపెనీ ఓ ప్రకటనలో తెలియజేసింది. కాగా ప్రజలు తమ వ్యక్తిగత సమాచారాన్ని పరిరక్షించుకునే హక్కును, అదే సమయంలో ఆ సమాచారాన్ని చట్టపరమైన ఉద్దేశాల కోసం వినియోగించుకునే అవకాశాన్ని... ఈ రెండింటినీ డేటా ప్రొటెక్షన్ బిల్లు గుర్తిస్తోందని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ చెబుతోంది. బిల్లును పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం దానిని పట్టించుకోకుండా గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. బాధితులకు నష్టపరిహారం అందజేయకపోవడంపై కాంగ్రెస్ సభ్యుడు అధిర్ రంజన్ చౌదరి, ఎన్సీపీ సభ్యురాలు సుప్రియా సూలే ఆందోళన వ్యక్తం చేశారు.

ఉర్దూ భాష అభివృద్ధికి కృషి చేసిన వారికి అవార్డులు

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ఉర్దూ భాష అభివృద్ధికి కషి చేసిన ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ అవార్డులను ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించిన 213 మంది ఉపాధ్యాయులకు ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మోతి గల్లీలోని చౌమహల్లా ప్యాలస్ ఎదురుగా గల ఉర్దూ మస్కాన్ హాల్‌లో అవార్డులను అందించనున్నట్లు ఉర్దూ అకాడమీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖా మంత్రి కొప్పులఈశ్వర్, ఉర్దూ అకాడమీ అధ్యక్షులు ఖాజా ముజీబుద్దీన్, డైరెక్టర్ షఫీఉల్లా హాజరుకానున్నట్లు తెలిపారు.

జేఏసీ నేతల నిరసన



నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

గవర్నర్‌తో చర్చలకు సెలెక్టెడ్‌గా కొన్ని కార్మిక సంఘాల నేతల్నే పిలవడంపై టీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ అభ్యంతరం వ్యక్తం చేసింది. గవర్నర్ చర్చలకు రమ్మన్నారని తెలిసిన జేఏసీ చైర్మెన్ కే రాజిరెడ్డి (ఎంప్లాయీస్ యూనియన్), కో కన్వీనర్ కత్తుల యాదయ్య (బీకేయూ), జేఏసీ నాయకులు పీ రవీందర్‌రెడ్డి (స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్–ఎస్‌డబ్ల్యూఎఫ్) తదితరులు రాజ్‌భవన్‌కు వెళ్లారు. అక్కడ పోలీసులు వీరిని అడ్డుకున్నారు. తమ వద్ద ఉన్న లిస్ట్‌లో వారి పేర్లు లేవని బయటే నిలిపేశారు. తాము జేఏసీ ప్రతినిధులమని చెప్పినా లోనికి అనుమతించలేదు. దీనితో పై నాయకులంతా రాజ్‌భవన్ గేటు ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. చర్చల్లో కార్మిక సంఘాల పట్ల వివక్ష తగదని నినాదాలు చేశారు.

జైపూర్ ఎక్స్‌ప్రెస్ మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం

నవతెలంగాణ–సిటీబ్యూరో

జైపూర్–ముంబయి ఎక్స్‌ప్రెస్ రైలులో ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ జరిపిన కాల్పుల్లో మృతి చెందిన హైదరాబాద్ వాసి సయ్యద్ సైఫుద్దీన్ భార్య అంజుమ్ షాహీనకు రాష్ట్ర ప్రభుత్వం అవుట్‌సోర్సింగ్‌లో ఉద్యోగం కల్పించింది. కులీ కుతుబ్ షా పట్టణాభివృద్ధి సంస్థలో ఆఫీస్ సబార్డినేట్‌గా నియమిస్తూ ఆ సంస్థ పరిపాలనాధికారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జియాగూడలో డబుల్ బెడ్ రూం ఇల్లు, ఆసరా పథకం కింద వితంతు పింఛన్‌ను మంజూరు చేస్తూ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జీవో విడుదల చేశారు.

అదేవిధంగా నగరంలోని దారుస్సలాంలో మజ్లిస్ పార్టీ పక్షాన మృతుడి ముగ్గురు కుమార్తెల పేరిట రూ.1లక్ష చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు చెక్కులను బాధిత కుటుంబానికి ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అందించారు. మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ అసెంబ్లీలో ప్రస్తావించడంతో సర్కారు స్పందించి ఈ మేరకు ఉద్యోగం, ఇల్లు, పెన్షన్ ఆదేశాలు జారీ చేసింది.

గ్రామపంచాయతీ కార్మికులపై సభలో మాట్లాడిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ధన్యవాదాలు

- **సీఎం తన ప్రసంగంలో కీలక నిర్ణయం ప్రకటిస్తారని ఆశిస్తున్నాం**
- **గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగుల జేఏసీ**

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై శాసనసభ, మండలిలో మాట్లాడిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగుల జేఏసీ ధన్యవాదాలు తెలిపింది. ఆదివారం నాడు సీఎం కేసీఆర్ తన ప్రసంగంలో కీలక నిర్ణయం ప్రకటిస్తున్నారని ఆశిస్తున్నామని పేర్కొంది. శనివారం ఈ మేరకు జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యజ్ఞనారాయణ, కన్వీనర్లు వెంకటరాజం, పి.అరుణ్‌కుమార్, శివబాబు, ఎన్.దాసు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. శాసనసభ, మండలి సమావేశాల్లో 20 మందికిపైగా అధికార, ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతుగా మాట్లాడటాన్ని స్వాగతించారు. 30 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సమ్మె కు విశాల మద్దతు మద్దతు దక్కుతున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించి సమ్మెను నివారించాలని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో సీఎం కేసీఆర్ మాట్లాడే సందర్భంలోనైనా గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాల పెంపు, కారోబార్, బిల్ కలెక్టర్లకు పదోన్నతులు, ఆరోగ్య ప్రమాద బీమా, మల్టీ పర్పస్ విధానం రద్దు తదితర అంశాల పరిష్కారం దిశగా అడుగులు వేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

టెట్‌కు 69,899 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు ఇప్పటి వరకు 69,899 దరఖాస్తులొచ్చాయి. ఈ మేరకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్, టెట్ కన్వీనర్ ఎం రాధారెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు 73,938 మంది ఫీజు చెల్లించారని తెలిపారు. వారిలో 69,899 మంది దరఖాస్తు చేశారని వివరించారు. ఇందులో పేపర్–1కు24,294 మంది, పేపర్–2కు 3,243 మంది, రెండింటికీ కలిపి 42,362 మంది దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. దరఖాస్తుల సమర్పణకు తుది గడువు ఈనెల 16 వరకు ఉన్న విషయం తెలిసిందే. వచ్చేనెల 15న ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పేపర్–2 టెట్ రాతపరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లోనూ నిర్వహిస్తారు. ఇతర వివరాలకు https://tstet.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

ఒకేషనల్ సర్టిఫికెట్ కోర్సు ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

షార్ట్‌టర్మ్ ఒకేషనల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలకు సంబంధించిన ఫలితాలను ఇంటర్ విద్యాశాఖ విడుదల చేసింది. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం లక్ష్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ (ఎస్ఐవీఈ) ఆధ్వర్యంలో గతనెలలో ఈ పరీక్షలను నిర్వహించామని పేర్కొన్నారు. 1,322 మంది పరీక్షలకు హాజరుకాగా, 971 (84.24 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. 351 (15.76 శాతం) మంది ఫెయిలయ్యారని తెలిపారు. ఫలితాల కోసం sive.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వానికి ఉద్యోగులు గుండెలాంటి వారు

- **స్పీకర్ పోచారం**
- **అసెంబ్లీ కార్యకలాపాలను వీక్షించిన టీఎన్జీవో నేతలు**

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ప్రభుత్వానికి ఉద్యోగులు గుండెకాయలాంటి వారనీ, వారు క్షేత్రస్థాయిలో పథకాలను సమర్ధవంతంగా అమలుచేయడంతోనే రాష్ట్రంలో మంచి ఫలితాలు వస్తున్నాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో) నేతలు శనివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో మర్యాదపూర్వకంగా ఆయనతో భేటీ అయ్యారు. మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి టీఎన్జీవో కేంద్రసంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిళ్ల రాజేందర్, మారం జగదీశ్వర్‌తోపాటు, 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. అంతకు ముందు టీఎన్జీవో నేతలు అసెంబ్లీ సమావేశాలను ప్రేక్షకుల గ్యాలరీ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో చట్టసభలు తీసుకున్న నిర్ణయాన్ని క్షేత్రస్థాయిలో అమలుచేసే కార్యనిర్వాహక వ్యవస్థలోని వారే ఉద్యోగులని చెప్పారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదనీ, వారు తమ ఉద్యోగాలను ఫణంగా పెట్టి 42 రోజులు సమ్మె చేశారని గుర్తు చేశారు. తాను కామారెడ్డిలో టీఎన్జీవో భవన నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేశాననీ, దాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాలనూ సమానంగా గౌరవిస్తూ మేలు చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్రసంఘం కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్, ముత్యాల సత్యనారాయణగౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ముజీబ్ హుస్సేని, నాయకులు ఆకుల రాజేందర్, రాంకిషన్, పరమేశ్వర్, వెంకట్‌రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

బుక్కయిన భట్టి



నిండు సభలో నిలదీసిన మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అసెంబ్లీలో కాంగ్రెస్ శాసనసభాపక్షనేత మల్లు భట్టి విక్రమార్కను మంత్రి కే తారకరామారావు నిలదీశారు. మీకెలాంటి విశ్వసనీయత లేదంటూ ఎద్దేవా చేశారు. శనివారం 'రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన, పల్లె, పట్టణ ప్రగతి కోసం ప్రభుత్వ చర్యలు-సాధించిన ఫలితాలు' అంశంపై లఘుచర్చ జరిగింది. దీనిపై మల్లు భట్టివిక్రమార్క మాట్లాడారు. గ్రామాలకు నిధులు ఇవ్వకపోవడంతో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారంటూ కొన్ని పేర్లు చదివి వినిపించారు. దీనిపై బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం చెప్పారు. ఆత్మహత్యలకు అనేక కారణాలు ఉన్నాయనీ, నిధులు ఇవ్వకపోవడం కాదంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ వివరణ ఇచ్చారు.

తప్పుడు ఆరోపణలు చేసినందుకు భట్టి క్షమాపణలు చెప్పాలంటూ శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. పలు పత్రికల్లో సర్పంచుల ఆత్మహత్యల వార్తలు వచ్చాయనీ, అవి తప్పు అయితే తాను తన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకుంటున్నానని భట్టి చెప్పారు. అనంతరం పట్టణ ప్రగతిపై మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధి అంతా కాంగ్రెస్ హయాంలోదే అనీ, తాగునీళ్లు కూడా సరిగా ఇవ్వట్లేదని విమర్శించారు. తన ఇంటికి రోజూ ట్యాంకర్ ద్వారా నీళ్లు తెప్పించుకుంటున్నానని అన్నారు. మంత్రి కేటీఆర్ ఈ చర్చకు సమాధానం చెప్పే క్రమంలో భట్టి ఇంటి వివరాలు, నీటి కనెక్షన్ క్యాన్ నెంబర్ సహా అన్నింటినీ సభలో చదివి వినిపించారు. ఆయన కిరాయి ఇంట్లో ఉంటున్నారనీ, 2022 జనవరి నుంచి నల్లా మీటర్ చెడిపోయిందంటూ కట్టిన బిల్లుల వివరాలు వెల్లడించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు భట్టి తన ఇంటికి ఒక్క ట్యాంకర్ కూడా బుక్ చేసుకోలేదని తేల్చిచెప్పారు. శాసనసభలో ఇలాంటి అబద్ధాలు చెప్పడం సరికాదనీ, అందుకే కాంగ్రెస్ పార్టీ విశ్వసనీయత కోల్పోయిందని అన్నారు.

చిల్లర రాతలకు భయపడం

మీడియా పేరుతో బ్లాక్‌మెయిలర్లు, చిల్లర రాతగాళ్లకు తాము భయపడబోమని మంత్రి కేటీఆర్ అన్నారు. కొన్ని పత్రికలు పనిగట్టుకొని ప్రభుత్వంపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయనీ, వాటి రాజకీయ ప్రయోజనాలు అందరికీ తెలుసు అని చెప్పారు. అలాంటి పత్రికల్లో వచ్చిన వార్తలు పట్టుకొచ్చి అసెంబ్లీలో ప్రస్తావించడం ఏంటని భట్టిని నిలదీశారు.

రేవంత్‌పై ఫైర్

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి మంత్రి కే తారకరామారావు అసెంబ్లీలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌పార్టీ గురించి మాట్లాడుతూ ఆపార్టీ ఇప్పటి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 2014 జనవరి 25న అసెంబ్లీలో మాట్లాడిన మాటల్ని ఉటంకించారు. దీనికి తాను స్పీకర్ అనుమతి తీసుకున్నాననీ, అవసరమైతే చెక్ చేసుకోవచ్చని కాంగ్రెస్ శాసనసభాపక్షనేత మల్లు భట్టి విక్రమార్కను ఉద్దేశించి చెప్పారు. అసెంబ్లీ రికార్డుల నుంచే తాను రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల్ని తీసుకున్నాననీ అన్నారు. ఆనాడు అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ... తన తండ్రి చనిపోతే స్నానం చేయడానికి కూడా నీళ్లు లేవనీ, శ్మశానంలో నెత్తిన నీళ్లు చల్లుకొని, ఇంటికొచ్చి స్నానం చేద్దామంటే కరెంటు లేదనీ, దీనికి కారణం కాంగ్రెస్‌పార్టీనే' అని చెప్పారని ఉటంకించారు. అలాంటి వ్యక్తిని పార్టీ అధ్యక్షుడిగా ఎలా పెట్టుకున్నారో...ఏమో అని వ్యంగ్యంగా అన్నారు.

ఓట్ల కోసం మాట్లాడొద్దు

కండ్లముందు రాష్ట్రంలో ఇంత అభివృద్ధి జరుగుతుంటే, కేవలం లేని అసంతృప్తిని ప్రజల్లో సృష్టించేందుకు పాదయాత్రలు చేస్తూ, కాంగ్రెస్ నేతలు నానా అవస్థలు పడుతున్నారని మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని అభివృద్ధి పనుల ఫోటోలను ప్రదర్శించారు.

మమ్మల్ని ఓడించండి

అసెంబ్లీలో తాను చెప్పే అభివృద్ధి అబద్ధమైతే వచ్చే ఎన్నికల్లో ప్రజలు తమను ఓడించాలని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో సమగ్ర, సంక్షేమ, సమ్మిళిత, సమీకృత అభివృద్ధి జరుగుతున్నదని వివరించారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన వేగంగా జరుగుతున్నదనీ, అది ప్రజల ఆస్తి అని చెప్పారు. కాంగ్రెస్‌పార్టీ 2004లో తెలంగాణ ఇస్తామని నానబెట్టి వెయ్యిమంది ప్రాణాలు తీసుకున్నదనీ, అప్పుడే వారి విశ్వసనీయత పోయిందన్నారు. కర్నాటకలో గెలిస్తే, ఇక్కడా ఏదో జరుగుతుందని పగటికలలు కంటున్నారని అన్నారు.

మా ప్రభుత్వాన్ని చంద్రబాబు, జగన్ మెచ్చుకున్నారు : మంత్రి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'దేశానికి తెలంగాణ ఆహారభద్రతను అందిస్తే..హైదరాబాద్ ఆర్థిక భద్రతనందించింది. ఆదాయంలో హైదరాబాద్ అయువుపట్టు. కావాల్సింది డబుల్ ఇంజిన్ కాదు.. గ్రోత్ ఇంజిన్. కేంద్రానికి తెలంగాణ రూపాయి ఇస్తే కేంద్రం తిరిగి 45 పైసలే ఇచ్చింది. వ్యవసాయ మోటార్లకు రాష్ట్ర ప్రభుత్వం మీటర్లు పెట్టలేదని చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. ఆయనకు ధన్యవాదాలు. శాంతిభద్రతల విషయంలో ఏపీ సీఎం జగన్ మెచ్చుకున్నారు. ఆయనకూ ధన్యవాదాలు. కానీ ఇక్కడున్న భట్టికి మాత్రం అర్థంకావడంలేదు. బీజేపీ బురద రాజకీయం చేస్తుంది. రోడ్ల విస్తరణకు 96ఎకరాలు కావాలని ఐదుగురు కేంద్ర మంత్రులను కలిసినా ఫలితంలేదు. ఈ పనిచేయలేదని బీజేపీ నేతలు ఎగిరెగిరి పడుతున్నారు. చివరకు బండి షెడ్డుకుపోయింది. ఛాయ్ పే చర్చను బంద్ పెట్టినా.. ఒకాయన ఇప్పుడు సిలిండర్‌పైనా, మణిపూర్ పైనా, హర్యానాపైనా చర్చ మొదలు పెట్టారు' అని రాష్ట్ర మంత్రి కేటీఆర్ శాసనసభలో శనివారం విమర్శలు గుప్పించారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతిపై లఘు చర్చ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఓఆర్ఆర్ కుంభకోణాన్ని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా..

'అవుటర్ రింగ్ రోడ్ టోల్ లీజు విషయంలో అవినీతి జరిగిందంటూ రేవంత్‌రెడ్డి నోటికొచ్చినట్టు మాట్లాడారు. కుంభకోణం జరిగిందని నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంట. సీఎం కేసీఆర్‌ను ఉరేసి రాళ్లతో కొట్టాలని అంటాడా? రాజకీయ విభేదాలుంటే కూర్చొని మాట్లాడుకోవాలి. సంస్కారంలేకుండా మాట్లాడితే చూస్తూ ఊరుకోవాలా? ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి. ఐఏఎస్ అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. హెచ్‌ఎండీఏ, సదరు కాంట్రాక్టు ఏజెన్సీ ఆయనపై పరువు నష్టం దావా వేసింది' అని అన్నారు.

ఓఆర్ఆర్ ప్రయివేటుకు ఎలా ఇస్తారు?

- అసెంబ్లీలో కాంగ్రెస్ శాసనసభాపక్షనేత భట్టి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

'హైదరాబాద్ అభివృద్ధి మీ వల్ల జరగలేదు. మా వల్లే జరిగింది. మేం వేసిన పునాదుల వల్లే ఇప్పుడు మీకు ఎకరం వందకోట్లు పలుకుతుంది. మేం కట్టిన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను అతి తక్కువ ధరకు ప్రయివేటు కంపెనీకి ఎలా కట్టబెడ్తారు? రూ.2.7 లక్షల కోట్ల ఆస్తిని కేవలం రూ.7,385 కోట్లకు ఉదారంగా ఎలా ఇస్తారు? 30 ఏండ్లకు లీజుకిచ్చి, 30 ఏండ్ల సొమ్మును మూడు నెలల్లో చెల్లించాలని షరతు పెడితే, ఆ తర్వాత వచ్చే ప్రభుత్వాలు ఏం చేయాలి? పట్టణ ప్రగతి అంటే బంజారాహిల్స్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటివే కాదు. హైదరాబాద్ గ్లోబల్ సిటీ మావల్లే అయ్యింది" అని శాసనసభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆయన మాట్లాడుతున్నంత సేపూ అధికార పక్ష సభ్యులు, మంత్రులు అడ్డుపడుతూనే ఉండటంతో ఒకింత అసహనానికి గురయ్యారు. బీసీ జనగణన జరగాలని అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపాలని సూచించారు. పల్లె ప్రగతి పేరుతో శ్మశానాలు, చెరువులు, కుంటల్లో క్రీడా మైదానాల పేరుతో బోర్డులు పెట్టి చేతులు దులుపుకున్నారని ప్రభుత్వాన్ని విమర్శించారు. ట్రాక్టర్లకు ఈఎమ్ఐ, డ్రైవర్లకు జీతాలు ఇవ్వలేక పంచాయతీలు నానా అవస్థలు పడుతున్నాయని చెప్పారు.

గిరిజనుల హామీలు మేమే అమలుచేశాం

- మండలిలో మంత్రి సత్యవతి రాథోడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'గిరిజనులు అమాయకులు. తమ సమస్యలను తీర్చాలని కోరుతూ వారు 70 ఏండ్లుగా కొన్ని రాజకీయ పార్టీల వెంట నిడిచారు. కానీ వారికి హామీలే మిగిలాయి. అమలు మాత్రం చేయలేదు. వారి సమస్యలను సీఎం కేసీఆర్ తీర్చారు. లంబాడా హక్కుల పోరాట సమితి, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ తరపున, సర్పంచ్‌గా నేను కూడా గతంలో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చాను. పోడు సమస్యలతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని పదే పదే కోరేవాళ్లం. 70 ఏండ్ల తర్వాత నేను గిరిజన శాఖ మంత్రిగా పోడు భూములకు పట్టాలిచ్చా. ఇది కేసీఆర్ వల్లే సాధ్యమైంది...' అని ఆ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ కొనియాడారు. శనివారం శాసనమండలిలో గిరిజనుల సంక్షేమం - పోడు భూముల పట్టాల పంపిణీ అనే అంశంపై జరిగిన చర్చకు ఆమె సమాధానమిచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్, గిరిజన రిజర్వేషన్లను నాలుగు నుంచి ఆరు శాతానికి పెంచితే, 36 ఏండ్ల తర్వాత మళ్లీ కేసీఆర్ వాటిని పెంచారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయలేదనీ, భూములు కేటాయించినా గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ముందుకు రావడం లేదని ఈ సందర్భంగా మంత్రి విమర్శించారు. ఎస్టీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచాలని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని ఐదేండ్ల పాటు పక్కన పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు రాష్ట్ర ప్రభుత్వమే రిజర్వేషన్లను పెంచిందని తెలిపారు. వాటికి ఆమోదం తెలపాలని రాష్ట్రపతిని కోరారు. సమ్మక్క, సారాలమ్మ జాతరను జాతీయ గిరిజన పండుగగా బీజేపీ గుర్తించడం లేదని విమర్శించారు. ఈ చర్చలో బీఆర్ఎస్ సభ్యులు శేరి సుభాష్ రెడ్డి, కోటిరెడ్డి, తాత మధు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, బీజేపీ సభ్యులు ఏ.వీ.ఎస్.రెడ్డి, ఎంఐఎం సభ్యులు బేగ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అసెంబ్లీలో ఆర్టీసీ బిల్లు?

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రెండోసారి లేవనెత్తిన అభ్యంతరాలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సమాధానాలు పంపినట్టు సమాచారం. శనివారం రాత్రి ఈ సమాధానాలను రాజ్‌భవన్‌కు అందించినట్టు తెలిసింది. గవర్నర్ తమిళిసై శనివారం హైదరాబాద్‌కు రావల్సిఉండగా, వాయిదా పడింది. ఆదివారం ఉదయం ఆమె హైదరాబాద్ వస్తారని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం పంపిన సమాధానాలకు సంతృప్తి చెందితే, ఆమె వెంటనే బిల్లుపై సంతకం చేసి, ప్రభుత్వానికి పంపుతారని తెలిసింది. అదే జరిగితే ఆదివారం ఈ బిల్లు శాసనసభ, శాసనమండలిలో చర్చకు వస్తుంది. ఉభయ సభల ఆమోదం తర్వాత తిరిగి బిల్లును గవర్నర్‌కు పంపుతారని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

శాసనసభలో ఐదు బిల్లులకు ఆమోదం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర శాసనసభలో శనివారం ఐదు బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ బిల్లులు ప్రవేశపెట్టిన సమయంలో కాంగ్రెస్‌పార్టీ, బీజేపీలకు చెందిన సభ్యుల్లేకపోవడం గమనార్హం. తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ అఫ్ మెడికల్ సైన్సెస్(టిమ్స్) ఆక్ట్-2023, జీఎస్‌టీ సవరణ బిల్లులను మంత్రి హరీశ్‌రావు ప్రవేశపెట్టారు. టిమ్స్ ప్రాధాన్యత వివరాలను ఆయన వెల్లడించారు. అనంతరం ఫ్యాక్టరీల(తెలంగాణ సవరణ) బిల్లు-2023ను మంత్రి మల్లారెడ్డి ప్రవేశపెట్టారు. ఓవర్ టైం పొడగింపు, రాత్రి వేళల్లోనూ పురుషులతో సమానంగా మహిళలు చేసేవిధంగా వారికి భద్రత, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేందుకు చట్టాన్ని సవరిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గాల కమిషన్ సవరణ బిల్లు-2023ను మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రవేశపెట్టారు. జైనులను కూడా మైనార్టీల జాబితాలో చేర్చాలని, మైనార్టీ కమిషన్‌లో సభ్యునిగా ఒకరికి అవకాశమివ్వాలని బిల్లులో పెట్టినట్టు ఆయన వివరించారు. పంచాయతీరాజ్ 2018 చట్టాన్ని సవరించాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బిల్లు ప్రవేశపెట్టారు. ఈ బిల్లులను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అయితే మంత్రి మల్లారెడ్డి బిల్లు ప్రవేశపెడుతుంటే స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అసహనం వ్యక్తంచేశారు. తొందరగా ముగించాలని పదేపదే సూచించారు.

ప్రభుత్వానికి ఉద్యోగులు గుండెలాంటి వారు : స్పీకర్ పోచారం

అసెంబ్లీ కార్యకలాపాలను వీక్షించిన టీఎన్జీవో నేతలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వానికి ఉద్యోగులు గుండెకాయలాంటి వారనీ, వారు క్షేత్రస్థాయిలో పథకాలను సమర్థవంతంగా అమలుచేయడంతోనే రాష్ట్రంలో మంచి ఫలితాలు వస్తున్నాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో) నేతలు శనివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో మర్యాదపూర్వకంగా ఆయనతో భేటీ అయ్యారు. మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి టీఎన్జీవో కేంద్రసంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిళ్ల రాజేందర్, మారం జగదీశ్వర్‌తోపాటు, 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. అంతకు ముందు టీఎన్జీవో నేతలు అసెంబ్లీ సమావేశాలను ప్రేక్షకుల గ్యాలరీ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో చట్టసభలు తీసుకున్న నిర్ణయాన్ని క్షేత్రస్థాయిలో అమలుచేసే కార్యనిర్వాహక వ్యవస్థలోని వారే ఉద్యోగులని చెప్పారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదనీ, వారు తమ ఉద్యోగాలను ఫణంగా పెట్టి 42 రోజులు సమ్మె చేశారని గుర్తు చేశారు. తాను కామారెడ్డిలో టీఎన్జీవో భవన నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేశాననీ, దాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాలనూ సమానంగా గౌరవిస్తూ మేలు చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్రసంఘం కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్, ముత్యాల సత్యనారాయణగౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ముజీబ్ హుస్సేని, నాయకులు ఆకుల రాజేందర్, రాంకిషన్, పరమేశ్వర్, వెంకటేరెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని టీఎన్జీవో నేతలు ఘనంగా సన్మానించారు.

విద్యారంగ సమస్యలపై నేడు చలో అసెంబ్లీ : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగంతో పాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. నూతన విద్యావిధానం 2020ను రాష్ట్రంలో అమలు చేయకుండా ఉండేందుకు వీలుగా అసెంబ్లీ లో తీర్మానం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇవే డిమాండ్లపై ఆదివారం చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.రాష్ట్రంలో గత మూడేండ్లుగా 5,177 కోట్ల మేర స్కాలర్ షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఫీజు రీయంబర్స్ మెంట్స్ విడుదల చేయలేదనీ, గురుకులాలు, కేజీబీవీలు,మోడల్ స్కూళ్లలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. వాటి పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టటం లేదని విమర్శించారు.

ఆ పదవులకు మా పేర్లు సూచించండి

మంత్రి కేటీఆర్ కు పలువురు ఆశావహుల విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ కమిషన్, సమాచార కమిషన్ చైర్మెన్, సభ్యుల పదవులకు తమ తమ పేర్లు సూచించాలని పలువురు ఆశావహులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలోని లాబీల్లో శనివారం వారు మంత్రిని కలిశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు సెప్టెంబర్‌లోగా పాలక మండలిని నియమించాలంటూ హైకోర్టు ఆదేశించిన విషయాన్ని వారు ఈ సందర్భంగా ఆయనకు గుర్తుచేశారు. మంత్రిని కలిసిన వారిలో ములుగు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మెన్ రాకేశ్ నాయక్ తదితరులున్నారు.

తెలంగాణ ప్రజల గుండెల్లో జయశంకర్ చిరస్మరణీయుడు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చివరి శ్వాస వరకు పోరాడిన ప్రొఫెసర్ జయశంకర్ ప్రజల గుండెల్లో చిరస్మరణీయునిగా ఉంటారని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. ఆయన చేసిన త్యాగం, సేవలను సీఎం గుర్తు చేసుకున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా కేసీఆర్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. జయశంకర్ కలలుగన్న సకల జనుల అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు.

ఒకే తేదీల్లో రెండు పరీక్షలు రాసేదెట్లా?

- 22, 23 తేదీల్లో గురుకుల, ఓయూ సెమిస్టర్ పరీక్షలు
- ఆందోళనలో విద్యార్థులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఒకే తేదీల్లో రెండు పరీక్షలను రాసేదెట్లా?అని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఈనెల ఒకటి నుంచి 23 వరకు గురుకుల బోర్డు ఆధ్వర్యంలో టీజీపీ, పీజీటీ, జేఎల్ పోస్టుల భర్తీకి పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. వాటికి దరఖాస్తు చేసిన అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారు. అయితే ఈనెల మూడో తేదీన ఓయూ పరీక్షల నియంత్రణ అధికారి పీజీ ఎంఎస్సీ, ఎంఏ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, లైబ్రరీ సైన్స్, ఎంజే అండ్ ఎంసీ కోర్సులకు సంబంధించిన రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 16 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్టు ప్రకటించారు. అయితే గురుకుల బోర్డు రాతపరీక్షల షెడ్యూల్‌ను గతంలోనే విడుదల చేశారు. అందుకనుగుణంగా ఇప్పుడు పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఆ విషయం తెలిసి చేశారా? లేదంటే తెలియకుండానే అవగాహన రాహిత్యంతో ఓయూ పరీక్షల నియంత్రణ అధికారులు మాత్రం గురుకుల బోర్డు రాతపరీక్షలు నిర్వహించే తేదీల్లోనే సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు షెడ్యూల్‌ను విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది.

ఈనెల 22న గురుకుల బోర్డు ఆధ్వర్యంలో పేపర్-3కి సంబంధించి టీజీటీ ఇంగ్లీష్, టీజీటీ ఫిజికల్ సైన్స్, టీజీటీ సైన్స్ సబ్జెక్టులకు పరీక్షలను నిర్వహించనున్నట్టు ప్రకటించింది. 23న పేపర్-2కి సంబంధించి లైబ్రరియన్, పేపర్-3కి సంబంధించి జేఎల్ హిస్టరీ, జువాలజీ పరీక్షలను నిర్వహిస్తామని షెడ్యూల్‌లో పేర్కొంది. ఓయూ పీజీ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి ఈనెల 22న పేపర్-3, అదేనెల 23న పేపర్-4 పరీక్షలను నిర్వహించనున్నట్టు ప్రకటించింది. అటు గురుకుల బోర్డు, ఇటు ఓయూ పీజీ పరీక్షలకు పరీక్షలకు రెండింటికీ హాజరయ్యే అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఏ పరీక్షలు రాయాలో అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారు. ఓయూ పరీక్షల నియంత్రణ అధికారులు దీన్ని అర్థం చేసుకుని గురుకుల బోర్డు పరీక్షల తేదీల్లో నిర్వహించే పరీక్షల తేదీలను మార్చాలని కోరుతున్నారు.

భూముల స్కాంపై చార్జిషీట్

- రాష్ట్రంలో కర్నాటక తరహా ప్రచారం
- కాంగ్రెస్ నేతలతో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ భేటీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో జరుగుతున్న భూ కుంభకోణాలపై చార్జిషీట్ వేయాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పార్టీ శ్రేణులకు సూచించారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడం కోసం కర్నాటక తరహా ప్రచార వ్యూహాన్ని అమలు చేయాలని చెప్పారు. శనివారంనాడాయన గాంధీ భవన్‌లో తెలంగాణ పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులతో భేటీ అయ్యారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఏఐసీసీ ఇంచార్జ్ మానిక్ రావ్ ఠాక్రే, రాష్ట్ర ఎన్నికల పరిశీలకురాలు దీప దాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శులు శ్రీధర్ బాబు, రోహిత్ చౌదరీ, విశ్వనాథ్, మన్సూర్ అలీ ఖాన్, వంశీచంద్ రెడ్డి, ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సంపత్ కుమార్, ప్రచార కమిటీ చైర్మెన్ మధు యాష్కీ, ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మెన్ దామోదర్ రాజనర్సింహతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పార్లమెంట్ పరిశీలకులు పాల్గొన్నారు. ఈ సమావేశ వివరాలను పీఏసీ కన్వీనర్ షబ్బీర్ అలీ మీడియాకు వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలవడానికి కేసీ వేణుగోపాల్ పలు సూచనలు చేసారని చెప్పారు.

రాష్ట్రాభివృద్ధిలో కేంద్రానిది కీలకపాత్ర

- మిగులు రాష్ట్రం అప్పులమయంగా మారింది : కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రాభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తున్నదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులమయంగా మార్చిందని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేంద్రంపై బురద జల్లుతున్నదని విమర్శించారు. మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. దేశంలో కుటుంబ పార్టీలకు పాతర వేసే రోజు ఎంతో దూరం లేదని చెప్పారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ ఒక్కటేనని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కేసీఆర్ కేంద్ర మంత్రిగా పనిచేశారనీ, ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు కేసీఆర్‌తో సంసారం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ కేరాఫ్ అడ్రస్‌గా సోనియాగాంధీ ఆఫీస్ మారిపోయిందని విమర్శించారు. ఆగస్టు 15 న ప్రతి ఇంటి మీద జాతీయ జండా ఎగురవేయాలనీ, ప్రతి ఇంటి నుంచి మట్టిని స్వీకరించి ఢిల్లీ కర్తవ్య పథ్‌లో నిర్మించే స్మారక స్థూపం కోసం పంపిద్దామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో గడ్డుకాలం ఉంది కాబట్టే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు.

గవర్నర్ వెనక్కి పంపిన బిల్లులకు మండలి మరోసారి ఆమోదం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ వెనక్కి పంపించిన నాలుగు బిల్లులను శాసనమండలి శనివారం మరోసారి ఆమోదించింది. తెలంగాణ మున్సిపల్ లా (సవరణ) బిల్లు -2022ను, తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (సవరణ) బిల్లు-2022ను రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు మండలిలో ప్రవేశపెట్టారు. తెలంగాణ ప్రయివేటు యూనివర్సిటీ సవరణ బిల్లు-2022ను విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మరోసారి ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది.

12న చలో హైదరాబాద్‌కు హైకోర్టు ఉద్యోగుల మద్దతు

- దక్షిణాదిలో సీపీఎస్‌ను రద్దు చేసే తొలి రాష్ట్రం తెలంగాణ కావాలి : టీఎస్‌సీపీఎస్ఈయూ అధ్యక్షులు స్థితప్రజ్ఞ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను అమలు చేయాలంటూ తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ఈయూ) ఆధ్వర్యంలో ఈనెల 12న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి హైకోర్టు ఉద్యోగులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. శనివారం సర్వీస్ అసోసియేషన్ హైకోర్ట్ ఫర్ ద స్టేట్ ఆఫ్ తెలంగాణ నాయకులు ఖాద్రి అధ్యక్షతన, నిశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ మాట్లాడుతూ ఇటీవల 16 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల గుండా పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర చేపట్టామని గుర్తు చేశారు. సీపీఎస్‌ను రద్దు పాత పెన్షన్‌ను పునరుద్ధరించాల్సిందేనని రాష్ట్రంలోని సీపీఎస్, ఓపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఏకమయ్యారని చెప్పారు. 'అభి నహి తో కభి నహి' అనే నినాదంతో ఈనెల 12న 3.30 లక్షల మంది గళం ప్రభుత్వానికి తెలిసేలా చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు.

డీఎస్ నకరా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో 1982, డిసెంబర్ 17న వెలువడిన తీర్పులో అత్యున్నత న్యాయస్థానం పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు అని ప్రకటించిందని వివరించారు. ఉద్యోగి విశ్వాసంగా చేసిన సేవలకు కంపెన్సేషన్ మాత్రమే కాదనీ, పెన్షన్ చెల్లింపులో సామాజిక, ఆర్థిక, న్యాయం, వృద్ధాప్య భద్రత దాగి ఉన్నాయని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల్లో సీపీఎస్‌ను రద్దు చేసే తొలి రాష్ట్రం తెలంగాణ కావాలని స్థితప్రజ్ఞ అన్నారు. ఇప్పటి వరకు రాజస్థాన్ ఛత్తీస్గఢ్ జార్ఖండ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేస్తున్నాయని గుర్తు చేశారు. ఈ సమావేశంలో టీఎస్‌సీపీఎస్ఈయూ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, సర్వీసెస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ రెడ్డి, కోశాధికారి వెంకటేష్, నాయకులు సతీష్, సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కోటకొండ పవన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరేంద్రరావు, నాయకులు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం : మంత్రి కేటీఆర్

నేతన్నల కోసం ఆరోగ్య బీమా కార్యక్రమం అమలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జాతీయ చేనేత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించాలని చేనేత, జౌళి శాఖ మంత్రి కె.తారక రామారావు ప్రజా ప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఆ సందర్భంగా ప్రభుత్వం తరపున నేతన్నల కోసం పలు కార్యక్రమాలను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ మేరకు ప్రజా ప్రతినిధులకు ఆయన లేఖ రాశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా చేనేత రంగం అభివృద్ధి, నేతన్నల సంక్షేమం కోసం వినూత్న పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. . దీంతో పాటు నేతన్నకు బీమా కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా కొనసాగించబోతున్నామని వివరించారు.

ఎక్కువ ఖర్చుతోటే ప్లాస్టిక్ ప్రత్యామ్నాయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ పదార్థాన్ని రూపొందించాలంటే పర్యావరణంపై ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వస్తుందని రిలయన్స్ ఇండస్ట్రీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ గౌబా తెలిపారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ప్యాకేజింగ్ అండ్ సస్టేనబులిటీ అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలనేవి అంత చౌకగా లేవనే విషయం వివిధ అధ్యయనాల్లో తేలిందన్నారు. ఇతర ప్రత్యామ్నాయాలతో పోల్చినప్పుడు ఇవి తక్కువ ఉష్ణోగ్రతల వద్ద ప్రాసెసింగ్ చేయబడటమే దీనికి కారణమని తెలిపారు.

బీఓబీకి రూ.4,070 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 87.7 శాతం వృద్ధితో రూ.4,070 కోట్ల నికర లాభాలు సాధించింది. నికర వడ్డీ ఆదాయంతో పాటు వడ్డీయేతర ఆదాయంలో పెరుగుదల బీఓబీ మెరుగైన ఆర్థిక ఫలితాలకు ప్రధాన మద్దతును అందించాయి. గతేడాది ఇదే క్యూ1లో రూ.2,168.1 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.20,119.52 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ1లో 48.50 శాతం వృద్ధితో రూ.29,878.07 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం 24.4 శాతం వృద్ధితో రూ.10,997 కోట్లుగా నమోదయ్యింది. వడ్డీయేతర ఆదాయం మూడు రెట్లు పెరిగి రూ.3,322 కోట్లుగా చోటు చేసుకుంది. గడిచిన జూన్ త్రైమాసికంలో బీఓబీ మొండి బాకీల కోసం రూ.1,693 కోట్ల కేటాయింపులు చేయగా.. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,560 కోట్ల కేటాయింపులు జరిపింది.

28న రిలయన్స్ ఏజీఎం

న్యూఢిల్లీ : రిలయన్స్ ఇండస్ట్రీస్ 46వ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం) ఈ నెల 28న జరుగనుంది. అలాగే 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఒక్కో షేరుకు రూ.9 చొప్పున డివిడెండ్ చెల్లింపులకు రికార్డు తేదీని ఆగస్టు 21గా నిర్ణయించినట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని ఆ కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ సారి వార్షిక సమావేశంలో ప్రధానంగా రిలయన్స్ జియో ఫైనాన్సియల్ సర్వీసెస్‌పై కీలక ప్రకటన చేస్తారని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఏసీపీ భీమిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేత



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

రాచకొండ కమిషనరేట్ పరిధిలో వనస్థలిపురం ఏసీపీగా సంకిరెడ్డి భీమిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు శనివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు పూజారి చక్రవర్తి, యువజన విభాగం నియోజకవర్గం నాయకులు మొగుళ్ళ జీవన్ కుమార్ రెడ్డిలు.. సంకిరెడ్డి భీమిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

'నివాస ప్రాంతాలలో వ్యర్థాలను వేయకండి'



నవతెలంగాణ - హస్తినాపురం

నివాస ప్రాంతాల వద్ద వ్యర్థాలను వేయకూడదని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. ఈ మేరకు శనివారం డివిజన్ పరిధిలో కార్పొరేటర్ పర్యటించి..మాట్లాడారు.డివిజన్ పరిధిలోని నందనవనం జే.ఆన్.ఆర్.ఎం బ్లాక్ ల వద్ద వ్యర్థ పదార్థాలను వేస్తున్నారన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. దీని వలన దుర్వాసనలు వెలువడి, అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. వెంటనే ఆ వ్యర్థాలను తొలగించాలని సంబంధిత జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మల్లికార్జున్, మమత మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు.

మానస మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

- ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్
- డీఐఓ కిషన్ నాయక్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

కూకట్‌పల్లి శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో అనుమానాస్పదంగా మతి చెందిన మానస మతిపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కిషన్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ శ్రీ చైతన్య కళాశాలలో మానస లాగ ఎందరో విద్యార్థులు కార్పొరేట్ కళాశాలల ఒత్తిడిల వల్ల ప్రాణాలు పోగొట్టుకుంటు న్నారని తెలిపారు. శ్రీ చైతన్య కార్పొరేట్ కళాశాల ఒక్క బ్రాంచిపై గుర్తింపు తీసుకుని వందల బ్రాంచీలు పెట్టినా ఇంటర్మీడియట్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అనేకసార్లు శ్రీ చైతన్య కళాశాలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదు. కార్పొరేట్ కళాశాలలకు ఇంటర్ బోర్డు కొమ్ముగాస్తుందన్నారు. విద్యార్థి మృతికి ఇంటర్మీడియట్ బోర్డ్ విద్యార్థులు ఒక కారణమైన కళాశాల యజమాన్యం మరో కారణం అన్నారు. కార్పొరేట్ కళాశాలలు ఇచ్చే ముడుపులకు అధికారులు లొంగిపోతున్నారని తెలిపారు. మంచి విద్య అందుతుందని తల్లిదండ్రులపై ఒత్తిడి చేసి మరీ ఈ శ్రీ చైతన్య కళాశాలలో అడ్మిషన్ తీసుకుని ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థలను విద్యార్థుల తల్లిదండ్రులు నమ్మొద్దు అన్నారు. నిజంగా ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులకు విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే శ్రీ చైతన్య కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ అధికారులు ఈ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.అరుణ్ పాల్గొన్నారు.



పేదలకు సీఎంఆర్ఎఫ్ వరం : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ- బడంగ్ పేట్

సీఎం సహాయ నిధి పేదలకు ఓ వరం అని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం పరిధి బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గూడ కు చెందిన ఫాతిమా భర్త రహీం, ఎన్. శశికాంత్ తండ్రి శ్రీకాంత్, ఎం. వేణుగోపాల్ రెడ్డి తండ్రి రంగారెడ్డిలకు సీఎం సహాయ నిధి నుంచి ఒక్కొక్కరికి రూ.2లక్షల 50వేలు విలువ గల చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ మహిళా నాయకురాళ్లు జ్యోతి, గీత పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించండి : మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతి

మీర్ పేట్ :

ఎన్నో ఏండ్లుగా సేవలందిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని మీర్ పేట్, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్, జల్‌పల్లి, తుక్కుగుడ మున్సిపాలిటీలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, పారిశుద్ధ్య కార్మికులుగా, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల్లో పని చేస్తున్నామని తెలిపారు. దాదాపు 30 ఏండ్ల నుండి చాలీచాలని వేతనా లతో దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నామని చెప్పారు. ఇటీవల వీఆర్ఏలను క్రమబద్ధీకరణ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లుగా మమ్మల్ని కూడా క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్, శివ గౌడ్, చిరంజీవి పాల్గొన్నారు.



ఇంటి స్థలాలు ఇప్పించాలని వినతి



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

ఇండ్లులేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇప్పించాలని కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు జి. శివకుమార్ మాట్లాడుతూ అబ్దుల్లాపూర్ మెట్ గ్రామ రెవెన్యూ సర్వే నెం. 283లో ఇందిరమ్మ పథకం కింద పేదలకు కేటాయించిన ఇండ్ల స్థలం లో గుడిసెలు వేసుకుంటే రెవెన్యూ అధికారులు కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి ఆ స్థలాన్ని పేదలకే కేటాయించే విధంగా అసెంబ్లీలో చర్చించాలని ఎమ్మెల్సీని కోరారు. ఇండ్లు లేక ఎంతో మంది పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ(ఎం) నాయకులు కనుకయ్య, సురేష్, ప్రణయ్ తదితరులు ఉన్నారు.

రమణను పరామర్శించిన బండారు దత్తాత్రేయ



నవతెలంగాణ-వనస్థలిపురం

డివిజన్ పరిధిలోని బృందావన్ మెడోస్‌లో నివాసముంటున్న దత్తాత్రేయ వ్యక్తిగత సెక్రటరీ రమణ ఆరోగ్యం బాగ లేదు. ఈ విషయాన్ని తెలుసుకున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీఎన్ రెడ్డి డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డిలు శనివారం రమణను ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. తర్వా త రమణకు ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో కాలనీ అధ్యక్షులు శివశంకర్, శశికాంత్, రాజు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే బేతి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ- నాగోల్

ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస గుప్త హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను మర్యాదపూర్వంగా కలిసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

టీ-హబ్‌లో కెరీర్ గ్రోత్ సమ్మిట్

- నైపుణ్యం, అభివృద్ధిపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎఫ్ఎల్ఎమ్ కెరీర్ గ్రోత్ సమ్మిట్ శనివారం నగరంలోని టీ-హబ్‌లో జరిగిన నిపుణుల కెరీర్ కోచ్‌లతో విద్యార్థులు తమ కెరీర్ సంబంధిత సందేహాలను పరిష్కరించుకునే కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 300 మంది విద్యార్థులు, కెరీర్ కోచ్‌లు ఈ సమ్మిట్‌లో పాల్గొన్నారు. ఈ సమ్మిట్‌లో కెరీర్ కోచ్‌లు మాంద్యం ప్రూఫ్ కెరీర్‌ను ఎలా నిర్మించాలి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎలా వచ్చి ప్రజల జీవితాల్లో కొత్త సాధారణం కాబోతోంది, తాజా గ్రాడ్యుయేట్లు అవకాశాలను అన్వేషించి, నైపుణ్యాన్ని ఎలా పెంచుకోవాలి అనే వివషయాల గురించి చర్చించారు. ఫ్రంట్ లైన్స్ మీడియా స్థాపించిన సాయి కష్ణ మంత్రవాది, ఉపేంద్ర గులిపిల్లి మాట్లాడుతూ మీమ్స్ ద్వారా సమాచారాన్ని ప్రచారం చేయడమే తమ ఆలోచన అన్నారు. తాము సమాచారాన్ని అందించడానికి, ఉద్యోగ అవకాశాలను ప్రకటించడానికి సోషల్ మీడియాను ఉపయోగిస్తాం అని తెలిపారు. ఫ్రంట్‌లైన్ మీడియాకు ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో 9,500,000 మంది ఫాలోవర్లు ఉన్నారని తెలిపారు. 2020లో ఫ్రంట్‌లైన్స్ ఎడ్యుటెక్‌ని స్థాపించామనీ, విద్యార్థులను ఉపాధికి సిద్ధం చేస్తున్నామని చెప్పారు. తాము ముగ్గురు విద్యార్థులతో ప్రారంభించామనీ, ఇప్పుడు 19వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మూడేండ్లలో వందలాది మంది సభ్యులను ఉద్యోగాల్లో ఉంచామనీ, తాము తెలుగులో ట్రెండింగ్ టెక్నాలజీలన్నింటినీ వివరిస్తామనీ, వాటికి బలమైన పునాదులను అభివద్ధి చేస్తామని తెలిపారు. ఇద్దరు కార్మికులతో ప్రారంభమైన ఫ్రంట్‌లైన్స్ ఎడ్యుటెక్ ఇప్పుడు 30 మంది ఉద్యోగులను కలిగి ఉందనీ, వారు ఆంధ్ర, తెలంగాణాలో ఇంజినీరింగ్ కష్టాల్లో ఉపన్యాసాలు, మెంటర్ షిప్‌లు, కెరీర్ సహాయాన్ని అందిస్తారు అని చెప్పారు.

'వైద్య' కాంట్రాక్ట్ ఎన్‌పీహెచ్ఏను రెగ్యులర్ చేయాలి'



నవతెలంగాణ - ఎల్బీనగర్

వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఎన్‌పీహెచ్ఏను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ రంగా రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి అన్నారు. నోటిఫికేషన్ క్యాన్సల్ చేసి ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీసును సరూర్ నగర్ పీహెచ్ మెడికల్ ఆఫీసర్‌కు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌పీహెచ్ఏ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ 2023 జారీ చేసిందన్నారు. 1520 పోస్టులు భర్తీ చేయబోతున్నది..ఈ రిక్రూట్మెంట్ కోసం పరీక్ష నిర్వహించి సెలెక్ట్ చేయబోతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులు కూడా పరీక్షలు రాసి మెరిట్ వస్తే సెలెక్ట్ చేస్తామని చెప్పడం, కాంట్రాక్టు నియామకాలు జరిగేటప్పుడు కూడా వీరితో వివిధ టెస్టులు రాయించి నియామకం చేశారన్నారు. కానీ 20 ఏండ్ల నుంచి కాంట్రాక్ట్ ఎంప్లాయిలుగా పనిచేస్తున్న సిబ్బందిని మరల టెస్టులు రాయాలని చెప్పడం దారుణమని అన్నారు. అర్హులైన కాంట్రాక్టు ఏఎన్ఎం అందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే 15 నుండి సమ్మె చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో జై విజయ, ఎస్. సుజాత, సి. స్వర్ణలత, కె.ఈశ్వరమ్మ, పి. అలివేలు, శకుంతల, సరిత, అనురాధ, అన్నపూర్ణ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా కె.శ్రీనివాస్



నవ తెలంగాణ- చైతన్యపురి

రాచకొండ కమిషనరేట్ పరిధిలోని సరూర్ నగర్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కె.శ్రీనివాస్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో రాజీ పడేది లేదన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

తట్టి అన్నారంలోని శ్రేయాస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ అండ్ ఎంటర్ప్రెన్యూర్షిప్ (ఐఐ ఈ)పై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ అండ్ ఎంటర్ప్రెన్యూర్షిప్‌లో ఉన్న ఉద్యోగ అవకాశాలు, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అనంతుల హృదయ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సాయి సత్యనారాయణ రెడ్డి ఏసీఐసీ-కేఎల్ స్టార్టప్ ఫౌండేషన్ రమాకాంత్ వల్లభనేని, సెంటర్ హెడ్ శ్రీ గోవిల్ అలోక్, ఐఐసి-కో ఆర్డినేటర్ డాక్టర్. ఏసీ.ఉమామహేశ్వరరావు, ఏవో రాజు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రేయాస్ లో 5 కే రేస్...

శ్రేయాస్ ఇంజనీరింగ్ కళాశాలలో యూత్ ఫేస్టులో భాగంగా హెచ్ఐవికి వ్యతిరేకంగా 5 కే రేస్ నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ హృదయ రెడ్డి తెలిపారు. తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ తో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్ సాయి సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేలిముద్ర పద్ధతిని తీసివేయాలి

- సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య



నవతెలంగాణ-వనస్థలిపురం

వేలిముద్ర పద్ధతిని తీసివేయాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏఎల్ఓ అసిస్టెంట్ కమిషనర్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ కార్మికులకు కొత్త లేబర్ కార్డు నమోదు చేసుకోవడం కోసం వేలి ముద్ర తప్పనిసరి అనే నిబంధనలను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్మికుల చేతి వేలి ముద్రలు అరుగుదలకు గురి అయ్యాయని..అందుకే వేలి ముద్ర వేయడానికి సహకరించవని తెలిపారు. లేబర్ కమిషనర్ అధికారులు ఈ విషయాన్ని పరిశీలించాలని కోరారు. కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పాత పద్ధతిలోనే కార్డు నమోదు, రెన్యూవల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, భూతరాజు, కాశయ్య పాల్గొన్నారు.

'అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు'



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షులు కొత్త కిషన్ గౌడ్ అన్నారు. మండలంలోని కవాడి పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కొత్త కిషన్ గౌడ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. పేదరిక నిర్మూలన, అభివృద్ధి సాధికారత బీఆర్ఎస్ తోనే సాధ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో యాదవ సంఘం అధ్యక్షులు కాశయ్య, నాయకులు సత్తయ్య, శ్రీరాములు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు పూజారి చక్రవర్తి గౌడ్, నాయకులు సర్వీరాజు, నియోజకవర్గం యువజన నాయకులు జీవన్ రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి భీమిరెడ్డి, బాలొరెడ్డి పాల్గొన్నారు.

ఐవీఎఫ్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ



నవతెలంగాణ -నాగోల్

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉప్పల్ నియోజకవర్గ పరిధి రామంతాపూర్‌లోని బాలభారతి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్‌ను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఐవీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస గుప్త మాట్లాడుతూ వైద్య, విద్య పరంగా నిరుపేదలు ఆర్థిక స్తోమత లేక దూరమవుతున్నారని అన్నారు. అలాంటి వారిని గుర్తించి, సహాయ సహకారాలు అందించడంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ముందుంటుందని చెప్పారు. అదేవిధంగా ఐవీఎఫ్ మేడ్చల్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి సంబు పాండయ్య గుప్త ఆధ్వర్యంలో యూకేజీ చదువుతున్న ధనలక్ష్మి, రెండో తరగతి చదువుతున్న వినయ్, సహస్ర, ఏడవ తరగతి చదువుతున్న ఆకాశ్, పదవ తరగతి చదువుతున్న వైష్ణవి లతో పాటు పదిమంది విద్యార్థులను దత్తత తీసుకొని చదివిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బాలభారతి ఉన్నత పాఠశాల కార్యదర్శి కాపర్తీశ్వర్, ప్రిన్సిపల్ నాగమణి, వైస్ ప్రిన్సిపల్ నాగలక్ష్మి, ఐవీఎఫ్ నాయకులు సంబు పాండయ్య గుప్త, కొత్తపల్లి రమేష్, జోనగిరి శ్రీనివాసులు, శ్రావణ్ కుమార్, నగేష్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ నాయకులు, సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

బోడపూడి వెంకటేశ్వరరావు 26వ వర్ధంతి



నవతెలంగాణ- చైతన్యపురి / ఎల్బీనగర్

బోడపూడి వెంకటేశ్వరరావు 26వ వర్ధంతిని దిల్‌సుఖ్‌నగర్ సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ బోడపూడి వెంకటేశ్వరరావు తన చిన్నతనం నుండే పోరాటాల్లో చురుగ్గా పాల్గొనేవారని గుర్తుచేశారు. స్వతంత్ర ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. రైతులను ఆదుకోవడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి సిహెచ్ వెంకన్న, ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, సీపీఐ(ఎం) నాయకులు చెన్నారం మల్లేష్, గంధం మనోహర్, భూతరాజు కాశయ్య, మేకల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి : సీఐటీయూ



నవతెలంగాణ - ధూల్ పేట్

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీఐటీయూ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం. శ్రవణ్ కుమార్ పిలుపునిచ్చారు. సంతోష్ నగర్ ఐఎస్ సధన్ సీఐటీయూ కార్యాలయంలో కేంద్ర కార్మిక సంఘాలు.. ఇందిరాపార్క్ వద్ద ఈ నెల 9,10 తేదీల్లో చేపట్టే మహా పడావో కార్యక్రమం సందర్భంగా శనివారం హైదరాబాద్ సౌత్ జిల్లా ఐక్య కార్మిక సంఘాల పిలుపులో భాగంగా హైదరాబాద్‌లో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీజేపీ ప్రభుత్వం 9 ఏండ్ల కాలంలో ప్రభుత్వ రంగ సంస్థలను..విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా అమ్మేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాషాయ ప్రభుత్వాన్ని క్విట్ ఇండియా స్ఫూర్తితో బీజేపీ ప్రభుత్వాన్ని వదిలించుకోవడానికి కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఏడాదికి 2 కోట్లు ఉద్యోగాలు, ఇంకా నల్ల డబ్బును తెచ్చి పేదల ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తానని చెప్పి బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. భేటి పడావో, భేటి బచ్చావో, మేకిన్ ఇండియా వంటి ఆకర్షణీయమైన వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం... నిత్యం విదేశీ జపం చేస్తూ, కార్పొరేట్‌కు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుటుందని ఆరోపించారు. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను ఒకే ఒక కలం పోటుతో రద్దు చేసి..నాలుగు లేబర్ కోడులను తెచ్చి కార్మిక హక్కులను నేల రాసాడాని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహించనున్న మహా పడావో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జంగయ్య, సీఐటీయు జిల్లా అధ్యక్షులు మీనా, ఏఐడీఈఎఫ్ నాయకులు కృష్ణ మోహన్, కిషన్, కృష్ణ, కోటయ్య, చెన్నయ్య, సాయిలు, గౌస్, వీరన్న, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

'న్యాయం జరిగే వరకూ పోరాడుతాం'



నవతెలంగాణ- బడంగ్‌పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 2లో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ కాంగ్రెస్ పార్టీ పక్షాన ఆందోళన చేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ దావుద్ ఖాన్ గూడలో దీక్ష చేపట్టిన భూ నిర్వాసితులకు..మేయర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్‌లు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడంగ్ పేట్‌లోని సర్వే నెం2 లో 40 ఎకరాల 16 గుంటల భూమిని 1955 నుండి దళిత రైతులు సాగుచేసుకుంటున్నారని తెలిపారు. కానీ ఆ భూమి వారికి దక్కకుండా ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో దళితులకు 3ఎకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కానీ దీనికి విరుద్ధంగా దళితుల దగ్గర ఉన్న భూమిని లాక్కుంటున్నారని ఆరోపించారు. దీక్ష చేస్తున్న దళితులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, బడంగ్ పేట్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుబాన్ యాదవ్, మహిళా అధ్యక్షురాలు అమృత నాయుడు, నాయకులు బాలింగని జంగయ్య, గట్టు బాలకృష్ణ, పుట్టగళ్ల జగన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో హరిత భారత్ స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం



నవతెలంగాణ- సంతోష్ నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని కర్మన్ ఘాట్ శ్రీ చైతన్య హై స్కూల్‌లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా హరిత భారత్ అంశంపై విద్యార్థులతో శనివారం ర్యాలీ నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ సయ్యద్ ఖాసీం అలీ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏ.జీ.ఎం. టి. సతీష్ మాట్లాడుతూ శ్రీ చైతన్య యాజమాన్యం విద్యార్థులలో సామాజిక స్పృహ కలిగించే కార్యక్రమాలతో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంను డిజైన్ చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఇదే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామని అకాడమిక్ డీన్ వెంకటరమణ తెలిపారు. విద్యార్థులతో మొక్కలు నాటించినట్లు వైస్ ప్రిన్సిపల్ సింగిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు. అకాడమిక్ కో-ఆర్డినేటర్ రఘు వంశీ ప్రత్యేక అతిథిగా విచ్చేసి విద్యార్థులకు హరిత భారత్ గురించి సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. రవీందర్ రెడ్డి, ఇంచార్జిలు సతీష్, లక్ష్మీ, సత్యనారాయణ, కవిత, స్వాతి, రమాదేవి, పీ.ఈ.టీ.లు రఘు, అశోక్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ అడ్మిషన్లకు గడువు పెంపు

నవతెలంగాణ-హయత్‌నగర్

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలలో డిగ్రీ కోర్సుల అడ్మిషన్లకు ఈనెల 16 వరకు అవకాశం ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్ నగర్ ప్రిన్సిపల్ డాక్టర్ జోత్స్నప్రభ, అభ్యాసకుల సహాయ కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ ఈ శంకర్‌లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సుల్లో చేరడానికి, విద్యార్హతలు, ఫీజు తదితర వివరాలను www.braouonline.in లో పొందుపర్చినట్లు వెల్లడించారు. ఇంటర్మీడియెట్, నేషనల్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఇంటర్ పూర్తి చేసిన వారు, తెలంగాణ ఓపెన్ ఇంటర్ పాస్ అయిన వారు పాలిటెక్నిక్, రెండు సంవత్సరాల ఐటీఐ కోర్సులలో 2023 వరకు పాసైన విద్యార్థులు నేరుగా డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ పొందొచ్చని సూచించారు. హయత్ నగర్ పరిసర ప్రాంతాలలో ఇంటర్ తత్సమాన అర్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు కోర్సు ఫీజు కూడా ఆగస్టు 16 లోపు చెల్లించుకోవచ్చునని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7997496295/ 7382929771 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వృద్ధురాలి మెడలో పుస్తెల తాడు అపహరణ



నవతెలంగాణ-హయత్ నగర్

వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును ఇద్దరు యువకులు అపహరించిన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పూర్తి వివరాలు..అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని తొరుర్ రాజీవ్ గృహ కల్పలో నివాసం ఉంటున్న కట్టెకొల లక్ష్మీ అనే వృద్ధురాలు ఇంట్లో ఒంటరిగా ఉంది. ఆ సమయంలో అదే ప్రాంతంలో ఫైనాన్స్ నడిపే షేక్ అబ్దుల్ రాజాక్..ఇతని స్వస్థలం గుంటూరు జిల్లా. ఈ నెల 5న తన ద్వీ చక్ర వాహనంపై నుండి బంగారు పుస్తెల తాడును అపహరించాడు. దానిని అతని స్నేహితుడు అయిన హయత్ నగర్ రాజా రాజేశ్వరీ కాలనీలో నివాసం ఉంటున్న వెల్దు చరణ్ సాయిలు కలిసి దానికి దానిని వనస్థలిపురంలో వుండే మనప్పురం ఫైనాన్స్ మేనేజర్ గొడుగు ప్రశాంత్ వద్ద తాకట్టు పెటారు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకుని విచారించారు. అతని వద్ద నుండి ఒక ద్వీ చక్ర వాహనం, 60వేల నగదు, 3సెల్ ఫోన్లు, 2తులాల బంగారు పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నారు. మొత్తం వాటి విలువ రూ.2,50,000ఉంటుందని అంచనా వేశారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, వనస్థలిపురం ఏసీపీ భీమ్ రెడ్డి, హయత్ నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కౌన్సిలర్ మంగళపురి వెంకటేష్ పుట్టిన రోజు



నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ మున్సిపాలిటీ 4 వ వార్డు కౌన్సిలర్ మంగళపురి వెంకటేష్ పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. తన పుట్టిన రోజు సందర్భంగా కౌన్సిలర్ వెంకటేష్ వృద్ధాశ్రమంలో అనాథలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ నేతలు కౌన్సిలర్‌తో కేక్ కట్ చేయించి శాలువతో సన్మానించారు. పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

గుడి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఉప్పల్

జీఎంఆర్ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మెన్ గుడి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం సాధన ఇన్స్టిట్యూట్‌లో పేద విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నోట్ బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీఎంఆర్ స్వచ్ఛంద సంస్థ చైర్మెన్ గుడి మధుసూదన్ రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో జనంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, అరటికాయల భాస్కర్, పల్లె నర్సింగ్‌రావు, పిట్టల నరేష్, రవీందర్ రెడ్డి, రవీందర్, జెల్లీ మోహన్, వీరేష్, వినోద్, సురేష్, బాబూరావు, రాజు పాల్గొన్నారు.

కమలానగర్‌లో కామ్రేడ్ ఫెడరిక్ ఎంగెల్స్128 వర్ధంతి



నవతెలంగాణ-కాప్రా

భారత కమ్యూనిస్టు పార్టీ, మార్క్సిస్టు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో కమలానగర్ పార్టీ ఆఫీసులో కామ్రేడ్ ఫెడరిక్ ఎంగెల్స్ 128వ వర్ధంతి సభ శనివారం నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సాగర్, జిల్లా కార్యదర్శి సత్యం హాజరై ఫెడరిక్ ఎంగెల్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ట్రేడింగ్ నాయకులు సుదర్శన్ మాట్లాడుతూ.. ఏంగిల్స్ కార్ల్‌మార్క్స్ సిద్ధాంత అధ్యయనం, రచనలలో భాగస్వామిగా ఉన్నారని తెలిపారు. వీరు కమ్యూనిస్టు భావజాలాన్ని శాస్త్రీయంగా విశదీకరించి శాస్త్రీయ సమాజ పరిణామాన్ని కమ్యూనిజం ఆవశ్యకతను తెలిపారని వివరించారు. ఎంగెల్స్ అనేక పుస్తకాలు రచించి సోషలిజం, కార్మికవర్గ పునాదుల పటిష్టతకు గొప్ప గొప్ప గ్రంథాలు రాశారని చెప్పారు. కార్యక్రమంలో జె. చంద్రశేఖర్, శ్రీనివాసరావు, శ్రీనివాస్, కోమటి రవి, సంతోష్, వినోద, మంగ, అశోక్, రాజశేఖర్ శోభ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బస్సు పాసుల పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు పాఠశాలకు సకాలంలో వెళ్లేందుకు రవాణా సదుపాయంతో పాటు ఉచితంగా బస్సు పాసులు పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయమని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 400 మందికి శనివారం బస్సు పాసులు అందజేశారు. పాసు నిర్వహణకు ఒక్కో విద్యార్థులు చెల్లించాల్సిన రూ.50లను కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ తన సొంత డబ్బు చెల్లించారు. ఈ కార్యక్రమంలో చెంగిచెర్ల డిపో మేనేజర్ కవిత, అసిస్టెంట్ మేనేజర్ ఆనంద్‌రావు, ఘట్‌కేసర్ స్టేషన్ మేనేజర్ వెంకటేష్, బస్సుపాస్ ఇన్‌చార్జిలు రాజు, చక్రపాణి, మల్లికార్జున్, రాంరెడ్డి, కార్గో ఎగ్జిక్యూటివ్‌లు అనిల్ కుమార్, రాము, పాఠశాల ప్రిన్సిపాల్ శోభ, పాఠశాల సిబ్బంది,డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

ఉప్పల్ నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే

- వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని వినతి
- జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన స్పీకర్



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తన నియోజ కవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి విషయాలు అసెంబ్లీ స్పీకర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఉప్పల్ బాగాయత్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రెండు ఎకరాలు స్థలం కేటాయించాలని కోరారు. మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌కు రెండు ఎకరాల స్థలం కేటాయించి నిర్మాణం చేపట్టాలన్నారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలని, ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి వరంగల్ జాతీయ రహదారి మెయిన్ రోడ్డు కారిడార్ పనులను పూర్తి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అసమర్థతతో ఉప్పల్ నుంచి వరంగల్‌కు వెళ్లే ప్రధాన రహదారి సమస్యలకు నిలియంగా మారిందని వాపో యారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రోడ్డుకు మరమ్మ తులు వెంటనే చేపట్టాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి జన్మదిన సందర్భంగా అసెంబ్లీలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఇతర శాసన సభ్యులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలలోకి రానివ్వద్దని ఆదేశాలు ఇచ్చే అర్హత లేదు

- కాంగ్రెస్ ఘట్కేసర్ మండల్ యువజన అధ్యక్షుడు కె.వినోద్ కుమార్



నవతెలంగాణ-ఘట్కేసర్

ప్రభుత్వ పాఠశాలలోనికి మీడియాను, విద్యార్థి సంఘాలను రానివ్వొద్దని ఆదేశాలు ఇచ్చే అర్హత ప్రభుత్వానికి లేదని ఘట్‌కేసర్ యువజన కాంగ్రెస్ నాయకులు కే. వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సంయుక్త కార్యదర్శి ఎం. శ్రావణ్, కొర్రేముల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పాండు చారితో కలిసి మాట్లాడుతూ..ఉత్తర్వులు ఇవ్వడం చూస్తే ప్రభుత్వానికి విద్యార్థి సంఘాలను, మీడియాను చూస్తే ఎంత భయం వేస్తుందో అర్థమవుతుందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. పాఠశాలలో అనేక సమస్యలు ఉండడంతోనే విద్యార్థి సంఘాలు, మీడియాను అనుమతించకుండా ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు కుట్ర చేస్తుందని మండిపడ్డారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను ఎందుకు భర్తీ చేయడం లేదని పేర్కొన్నారు. సీఎం మనవడే ఒక్క ప్రభుత్వ పాఠశాలను చూసి కన్నీరు పెడితే రాష్ట్రంలోని ఇతర పాఠశాలల పరిస్థితి ఎలా ఉంటుందో ఆత్మ విమర్శ చేసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కొర్రెముల ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకొని పోరాటాలు చేస్తామన్నారు. ఎన్ని నిర్బంధాలు పెట్టినా పోరాటం ఆగేదిలేదున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలి




- ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-ఘటకేసర్

విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన ఓరియెంటేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను వారి తల్లిదండ్రులు ఎప్పటికప్పుడూ గమనిస్తుండాలని సూచించారు. కళాశాలకు ఫోన్ చేసి వారి చదువు పట్ల తెలుసుకోవాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా విషయ పరిజ్ఞానంపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం సంపాదిస్తేనే రాణిస్తారని చెప్పారు. మంచిగా చదివి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనురాగ్ యూనివర్సిటీలో అత్యుత్తమ పరిజ్ఞానంతో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ ఛాన్సలర్ యువీ దేశాయ్, వైస్ ఛాన్సలర్ రామచంద్రం, రిజిస్ట్రార్ సమీన్ ఫాతీమా, సీఈవో నీలిమా, హెచ్ఐడీలు, అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం : డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-జవహర్‌నగర్

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని, పేద ప్రజలు నివసించే జవహర్ నగర్‌లో ఉచితంగా వైద్య సేవలు అందించడం సంతోషంగా ఉందని డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం కార్పొరేషన్‌లో లయన్స్‌క్లబ్, సూర్యోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్ సౌజన్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. ఆధునిక కాలంలో చిన్న వయసులోనే రకరకాల రోగాలు వస్తున్నాయని తెలిపారు. ముందు జాగ్రత్త వహిస్తే మేలన్నారు. పేద ప్రజలకు ఎంత సేవ చేసినా తక్కువేనని, లయన్స్ క్లబ్ కార్పొరేషన్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. అంతకుముందు 100 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో జవహర్ నగర్ సీఐ సీతారాం, లయన్స్ క్లబ్ గవర్నర్ హరీష్‌రెడ్డి, మీర్‌పేట్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, యశోద హాస్పిటల్ సిబ్బంది, సురేఖారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మహేష్, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గబ్బిలాల్‌పేట్‌లో ఆటో డ్రైవర్ అదృశ్యం



నవతెలంగాణ-జవహర్‌నగర్

ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆటో డ్రైవర్ అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. కార్పొరేషన్‌లోని గబ్బిలాల్‌పేట్‌లో మహ్మద్ మాజీద్(32) భార్య షహనాజ్ సుల్తానాతో కలిసి నివాసముంటు న్నాడు. మాజీద్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈ నెల 2న పని కోసమని ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదు. దీంతో ఆచూకి కోసం చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. దీంతో భార్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు : మేయర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

బంజారాహిల్స్‌లో చేపట్టిన పనులన్నింటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. శనివారం బంజారాహిల్స్ ప్రాంతంలో రూ. 10 కోట్ల72 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన మౌలిక సదుపాయాలు కల్పించే పనులను సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలో మౌలిక వసతులు కల్పించేందుకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి రోడ్లు, ఫంక్షన్ హాల్స్, గ్రేవ్ యార్డ్, స్టార్మ్ వాటర్ నాలా పనులకు నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. చేపట్టిన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు అధికారులను ఆదేశించారు. సిగ్నల్ ఫ్రీ రవాణా వ్యవస్థను ఎస్.ఆర్.డీ.పీ ద్వారా 48 పనులను చేపట్టగా ఫ్లైఓవర్‌లు, అండర్ పాస్‌లు, ఆర్.ఓ.బీ.లు పూర్తయ్యాయని అన్నారు. రూ.450 కోట్ల వ్యయంతో ఇందిరా పార్కు నుంచి వీ.ఎస్.టీ వరకు చేపట్టిన స్టీల్ బ్రిడ్జిని మంత్రి కేటీఆర్ త్వరలో ప్రారంభించనున్నారని తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 13లో రూ.200లక్షల వ్యయంతో గ్రేవ్ యార్డ్ ముఖ ద్వారం, టాయిలెట్స్, బర్నింగ్ ప్లాట్ ఫామ్ నిర్మాణ పనులు చేపట్టనున్నారని తెలిపారు. ఎన్.బీ.టీ.నగర్‌లో రూ. 590 లక్షల వ్యయంతో చేపట్టిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు, రూ. 75లక్షలతో కారంపూడి బస్తీ కల్వర్టు పనులు, రూ.205 లక్షలతో శ్రీరామ్ నగర్ కమ్యూనిటీ హాల్, అంబేద్కర్ నగర్ కమ్యూనిటీ హాల్, రూ.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న ప్రేమ్ నగర్ నాలా పనులను మేయర్ పరిశీలించారు. ఉదయ్ నగర్ పాఠశాలలో అదనపు ఫ్లోర్ నిర్మాణ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వెంకటేష్ దొత్రె, ఎస్ఈ రత్నాకర్, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఈఈలు పాల్గొన్నారు.

కార్మికురాలు అలివేలు చిత్ర పటానికి నివాళి



కార్వాన్ సర్కిల్ నానల్ నగర్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికురాలు అలివేలు ఆకస్మిక మృతికి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సంతాపం తెలిపారు. శనివారం కార్మికురాలి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మృతురాలి చిత్రపటానికి ఆమె పూలమా లలు వేసి నివాళులర్పించారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామ తెలిపారు. ఈ కార్యక్ర మంలో కార్పొరేటర్ స్వామి యాదవ్, డిప్యూటీ కమిషనర్, ఏ.ఎం.ఓ.హెచ్, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన విద్యార్థులు దొరికారు..ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు



నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడలోని ఓ ప్రయివేట్ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు తప్పిపోయిన సంఘటన ఓయూ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ సంఘటనతో పిల్లల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురై పోలీసులను ఆశ్రయించగా, తప్పిపోయిన కొద్ది గంటల్లోనే పిల్లలు దొరికారు.దీంతో అటు పోలీసులు, ఇటు పిల్లల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హబ్సిగూడలోని శ్రీసాయిహైస్కూల్లో ఆరో తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులు ప్రతి రోజు ఆటోలో స్కూల్‌కు వెళ్లి తిరిగి ఆటోలో ఇంటికి వెళ్తుతుంటారు. కాగా శనివారం పాఠశాలకు వచ్చిన వారు సాయంత్రం స్కూల్‌లో కనిపించకపోవడంతో సదరు ఆటో డ్రైవర్ వారి తల్లిదండ్రులకు విషయం చెప్పాడు. దీంతో విద్యార్థుల తల్లిద్రండులు స్కూల్‌కు చేరుకుని తమ పిల్లల గురించి ఆరా తీశాక ఓయూ పోలీసుస్టేషన్ ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకిదిగిన పోలీసులు స్కూల్ పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా గుర్తించారు. స్కూల్ వదిలాక నలుగురు కలిసి ఫ్రెండ్షిప్ డే సందర్భంగా గిఫ్ట్ కొందామని నడుచుకుంటూ చిలుకానగర్ వైపు వెళ్లారు. అక్కడ ఓ మిర్చిబండి వద్ద మిర్చీలు తింటుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకువచ్చారు. వారిని తిరిగి వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

మీడియా ప్రతినిధులపై విరుచుపడ్డ విద్యార్థుల తల్లిదండ్రులు..

విద్యార్థులు స్కూల్ నుంచి మిస్సయిన విషయం తెలుసుకున్న పలువురు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఈ విషయాన్ని ఛానల్స్‌లో ప్రసారం చేశారు. ఇలా చేయడం వల్లనే పోలీసులు విద్యార్థులను స్వల్పవ్యవధిలో పట్టుకోగలిగారు. పిల్లలు దొరికిన తరువాత మరిన్ని వివరాలు సేకరించేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై విద్యార్థుల తల్లిదండ్రులు దాడికి యత్నించినట్లు తెలిసింది. దీంతో మీడియా ప్రతినిధులు విద్యార్థుల తల్లిదండ్రులపై ఓయూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

నేడు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం, అమరవీరుల స్థూపం ఆవిష్కరణ

- హాజరు కానున్న ఎమ్మెల్సీ కవిత, మంత్రి మల్లారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ పట్టణ పరిధిలోని రాఘవేంద్ర నగర్‌లో నిర్మించిన ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం, అమరవీరుల స్థూపం ఆవిష్కరణ ఆదివారం నిర్వహించనున్నట్టు విగ్రహ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 9గంటలకు ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుంద న్నారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మె ల్సీ కవిత ముఖ్య అతిథిగాప్ర పాల్గొంటారని తెలిపా రు. ఆమెతో పాటు కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, ఫుడ్ కార్పొరేష న్ చైర్మెన్ మేడ రాజీవ్ సాగర్, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్ రెడ్డి తదితరులు వస్తున్నారని తెలిపారు. ఆవిష్కరణకు ఎమ్మెల్సీ కవిత వస్తున్న సందర్భంగా బహిరంగ సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ఉద్యమకారులు, పట్టణ ప్రజలు, నాయకులు రావాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని కాపాడాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో వెస్ట్‌గాంధీ నగర్ కాలనీలో 9వ విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ..భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించాలంటే బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రాజేంద్ర కుమార్, వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, డీఈ రఘు, మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రామ్‌రెడ్డి, స్థానిక నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, పాఠశాల విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు సాయం చేయడం అభినందనీయం : కౌన్సిలర్



నవతెలంగాణ-కీసర

అనాథాశ్రమంలోని పేదలకు సాయం చేయడం అభినందనీయమని నాగారం మున్సిపల్ 15 వ వార్డు కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.శనివారం క్రైసిస్ రెస్క్యూ ఫౌండేషన్, సికింద్రాబాద్ వద్ద పూజ్య సుఖవల్లభదాస్‌జీ ఆధ్వర్యంలో హరివందన స్వామీజీ, స్వామినారాయణ గురుకుల ఇంటర్నేషనల్ స్కూల్, అహ్మద్‌గూడ ఈస్ట్ గాంధీనగర్‌లోని అనాథ శరణాలయాలకు బి య్యం, మెటీరియల్, స్టేషనరీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ కౌన్సిలర్ కొత్త సురేఖా భాస్కర్‌గౌడ్, స్కూల్ డైరెక్టర్ రామచంద్ర, కాలనీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, సెక్రెటరీ శ్రావణ్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే ప్రజల సమస్యలు పరిష్కారం'



నవతెలంగాణ-కీసర

కాంగ్రెస్‌తోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం కీసర మండలం బోగారం గ్రామంలో కీసర మండల యూత్ కాంగ్రెస్ అధక్షుడు కందాడి శివరాంరెడ్డి ఆధ్వర్యంలో డోర్ టూ డోర్ క్యాంపెయినిం గ్ నిర్వహించారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి ఆదేశాల మేరకు మేడ్చల్ మల్కాజిగిరి ఇన్‌చార్జి గణేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంది శ్రవణ్ కుమార్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ తటాకం అభిలాష్ నేతృత్వంలో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ మ్యానిఫెస్టో ను ప్రజలకు వివరించారు. ముఖ్య అతిథి మేడ్చల్ యూత్ జనరల్ సెక్రెటరీ బద్దం రుక్వర్ధన్‌రెడ్డి, యూత్ అసెంబ్లీ అధ్యక్షులు కొత్త శశాంత్‌గౌడ్ డోర్ టూ డోర్ క్యాంపెయినింగ్‌లో పాల్గొన్నా రు. కార్యక్రమంలో కీసర యువజన కాంగ్రెస్ వర్కింగ్ అధక్షుడు ముద్దం మల్లేష్, బోగారం సర్పంచ్ జైహింద్‌రెడ్డి , కీసర మండ లాధ్యక్షుడు కృష యాదవ్, బోగారం గ్రామ అధ్యక్షులు బాల నరసింహ యాదవ్, బోగారం నాయకులు సత్యనారాయణ, గోధుకుంట ఎంపీటీసీ కిరణ్, జ్యోతి, ప్రవీణ్ కుమార్, రాజు యాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ మల్లేష్ యాదవ్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ శివయ్య, బోగారం మైనార్టీసెల్ అధ్యక్షులు షేక్ హైమద్ తదితరులు పాల్గొన్నారు.

'నూతన ఆవిష్కరణలు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాలి'



నవతెలంగాణ-ఘట్కేసర్

నూతన ఆవిష్కరణలు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే విధంగా ఉండాలని హైదరాబాద్ బిట్స్ పిలానీ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ ఎంబీ. శ్రీనివాస్ అన్నారు. శనివారం కాచవానిసింగారం, నల్లా మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సమస్యలను అధిగమించే సాంకేతిక నైపుణ్యం పెంపొంచడానికి ఇంజినీరింగ్ ఎక్స్‌ప్లోరేషన్ ఫర్ సస్టేటని బిలిటీ డెవలప్‌మెంట్ గోల్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టార్టప్ల దిశగా పయనిస్తున్న విద్యార్థులను అన్ని రకాలుగా ప్రోత్సహించాలన్నారు. అప్పుడే లక్ష్యం చేరుకుంటారన్నారు. సాంకేతిక పరిష్కారాల కోసం విద్యార్థులు ఒక విభాగానికి పరిమితం కాకుండా అన్ని విభాగాల్లో సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ దివ్య, ప్రిన్సిపాల్ ఎంఎస్వీ రమేశ్ పాల్గొన్నారు.

పల్లె చెరువు స్థలాన్ని రక్షించాలని అధికారులకు వినతి



నవతెలంగాణ-శామీర్‌పేట

తూంకుంట మున్సిపాలిటీ ఉప్పరిపల్లి పరిధిలోని పల్లె చెరువు స్థలాన్ని అక్రమంగా కబ్జా చేసి బర్ల షెడ్డు నిర్మాణం చేసుకుని నల్లా కనెక్షన్ తీసుకున్న అక్రమార్కుల చెర నుంచి చెరువు పక్కనున్న స్థలాన్ని రక్షించాలని మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు రాము శనివారం శామీర్‌పేట తహశీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. తూంకుంట మున్సిపల్ కమిషనర్ లేకపోవడంతో మేనేజర్ శ్రవన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పొలామొల్ల పాండు, మాజీ సర్పంచ్ రవీందర్, శంకర్, యాదగిరి, సాయిరాం, వెంకటేష్ పాల్గొన్నారు.

చిల్కానగర్‌లో అభివృద్ధి శూన్యం : కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్‌లో అభివృద్ధి శూన్యంగా కన్పిస్తోందని కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కల్లి..బొల్లి మాటలు చెప్పి ప్రజా సమస్యలు పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి పాలకులను ఇంటికి పంపాలన్నారు. బస్తీ సమస్యల పరిష్కారం కోసం బస్తీ నిద్ర కార్యక్రమంలో భాగంగా శనివారం చిల్కానగర్ డివిజన్ లోని ఎస్సీ కమ్యూనిటీహాల్ ఆదర్శ్ నగర్, కుమ్మరి కుంట, న్యూ రాంనగర్, శివాలయం, బొడ్రాయి, చిల్కానగర్ కాలనీలలో గడపగడపకూ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదర్శ్ నగర్‌లో రోడ్లు, డ్రయినేజీ అస్తవ్యస్తంగా ఉందన్నారు. చిన్నపాటి వర్షానికి నీళ్లు నిలుస్తున్నదని తెలిపారు. అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని హెచ్చరించారు. కుమ్మరి కుంటలో డ్రయినేజీ సమస్య నేటికీ అదే విధంగా ఉందని, మురుగునీరు కాలనీలో ప్రవహిస్తుంటే ప్రజలకు డెంగ్యూ, మలేరియా వాదులకు వస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో అంజయ్య, మేడల మల్లికార్జున గౌడ్, సంజయ్ జైన్, వినోద్, పత్తి కుమార్, గణేష్ నాయక్, సంతోష్, నరసింహారెడ్డి, సుధాకర్ శెట్టి, శ్రీనివాస్ యాదవ్, కృష్ణ, రమేష్‌గౌడ్, రాజేష్, సాయిరెడ్డి, వెంకటేష్, మహిళా నాయకురాలు మంజుల, మునీబేగం, భారతమ్మ, లీలావతి, సుజాత, సోను, ఇర్ఫాన్, కార్తీక్, మదన్, అజీజ్, సాజీద్, నాగ, నవీన్, అశోక్, చరణ్ ఇర్ఫాన్, రవి, నందులాల్, సాధిక్, సతీష్ తదితరులున్నారు.



కాప్రాలో సుభాష్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



ఉప్పల్‌లో సంపత్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే బేతి

ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను నియోకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. కాప్రా కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్, గుండారపు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

జీడీమెట్లలో ఆర్టీసీ కార్మికుల ధర్నా

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన బిల్లును గవర్నర్ ఆమోదించకపోవడంతో ఆర్టీసీ కార్మికులు నిరసనలు తెలిపారు. ఈ మేరకు శనివారం జీడీమెట్ల బస్ డిపో ముందు ఉదయం 6 గంటల నుండి ధర్నాకు దిగారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసిన బిల్లును వెంటనే ఆమోదించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రభుత్వం పంపిన బిల్లును గవర్నర్ పెండింగ్‌లో పెట్టడం దారుణం అన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలను అర్థం చేసుకొని ఆమోదించాలని కోరారు.

అల్వాల్ డీసీ శ్రీనివాస్ రెడ్డిని కలిసిన కార్పొరేటర్

నవతెలంగాణ- నేరేడ్‌మెట్



అల్వాల్ మున్సిపల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి నూతనంగా పదవీ బాధ్యతలు తీసుకున్న సందర్భంగా శనివారం అల్వాల్ 134 డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి ఆయనను కలిసి శుభాభివందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...అల్వాల్ పట్టణ అభివృద్ధికి ప్రజలందరి సహకారం అవశ్యమన్నారు. పట్టణాభివృద్ధే ధ్యేయంగా సలహాలు, సూచనలతో సమైక్యంగా ముందుకు వెళ్తమన్నారు. కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. అల్వాల్ డివిజన్ అభివృ ద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉదయ్, కవిత , నాగేశ్వరరావు, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించడానికి లౌకిక శక్తులు ఏకం కావాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశ ప్రజలను మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతూ, విభజన రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీ తక్షణమే ఓడించడానికి లౌకిక శక్తులంతా ఏకం కావాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్ పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకత్వ రాజకీయ శిక్షణా తరగతులు రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. శనివారం మొదటి రోజు రాజకీయ శిక్షణా తరగతులకు పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతుల్లో భాగంగా ఫ్రెడరిక్ ఎంగెల్స్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి సాగర్ పూలమాలవేసి నివాళ్లర్పించారు. అనంతరం 'వర్తమాన రాజకీయాలు-సీపీఐ(ఎం) వైఖరి' అనే అంశంపై బోధించారు. ఒక పక్క ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్ అనుకూల విధానాలకు అనుభవిస్తున్న మోడీ ప్రజలను ఐక్యంగా మతం పేరుతో చీల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే వారు రాజకీయ లబ్ది కోసం యూనిఫామ్ సివిల్ కోడ్‌ను ముందుకు తెచ్చారని, ప్రజలు అప్రమత్తంగా దీన్ని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, పేదలు, రోజువారి కూలీ పనులు చేసుకునే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెరుగుతున్న ధరలపై ప్రధాని ఒక్కసారి కూడా స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. మణిపూర్‌లో రెండు తెగల మధ్య చిచ్చుపెట్టి ప్రజల ప్రాణాలు పోయేలా రెచ్చగొట్టి ఘర్షణ వాతావరణం సృష్టించిన బీజేపీని రాబోయే రోజుల్లో ప్రజలు ఓడించాలని పిలుపునిచ్చారు. మహిళలను నగ్నంగా ఊరేగించిన వారిపై మోడీ చర్యలు తీసుకోవాలని, ఈ విషయంపై ఆయన ఒక్కసారి కూడా మాట్లాడకపోవడం సరికాదన్నారు. ప్రజలను మతం పేరుతో రెచ్చగొడితే రాబోయే రోజుల్లో మోడీపై తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జె.చంద్రశేఖర్, ఎర్ర అశోక్, చింతల యాదయ్య, కోమటి రవి, వినోద, జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్, శంకర్, రాజశేఖర్, సబిత, జి.శ్రీనివాస్, శ్రీనివాస్, పార్టీ జిల్లా సీనియర్ నాయకులు యాదగిరిరావు, అండలి, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.



వరద ముప్పునకు శాశ్వత పరిష్కారం

- కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి
- అసెంబ్లీలో ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో మౌలిక సదుపాయాల కల్పన, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి ఫలితాల పైన చర్చలో భాగంగా శనివారం కె.పి. వివేకానంద్ ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆ ర్ నాయకత్వంలో గడిచిన 9 ఏండ్లలో తెలంగాణ రాష్ట్రంలో నిరంతరంగా విద్యుత్ సరఫరా, ఇంటింటికి మంచి నీరు, హైదరాబాద్ నగరంలో రూ.10 లక్షల సీసీ కెమెరాలు, 3866 కోట్లతో సేవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేసు కొని హైదరాబాద్ నగరం మౌలిక సదుపాయాలలో దేశం లోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. కేటీఆర్ నాయకత్వం లో పెట్టుబడుల విషయంలో హైదరాబాద్ నగరం ప్రపం చంతో పోటీపడే స్థాయికి చేరిందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ నగరం దేశంలో మూడు, నాలుగు నగరాలతో పోటీపడేదని కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక దేశంలోని పెద్దపెద్ద నగరాలు హైదరా బాద్‌తో పోటీ పడే స్థాయికి వచ్చిందన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్ నుండి జేఎన్టీయూ వరకు ఫ్లైఓవర్ నిర్మాణానికి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాల ని ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారు. ఎస్.ఎన్.డి.పి. పథకం ద్వారా చేపడుతున్న కాలువ నిర్మాణాల వల్ల కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని అంగడిపేట్, సుచిత్ర పరిసర లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పుకు శాశ్వత పరిష్కారం లభించింది తెలిపారు.

ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలపై 'టీఎన్జీవో' సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉద్యోగుల జేఏసీ చైర్మెన్, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు బి.రవి ప్రకాష్ అధ్యక్షతన జిల్లాలోని ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలపై జిల్లా ఆఫీస్ బేరర్లు, వివిధ యూనిట్ అండ్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులతో కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగుల సీనియారిటీ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమచేయాలని, వేతనంతో కూడిన ప్రసూతి సెలవు అమలు చేయాలని, ఫ్రీ బస్ పాస్ అందజేయాలని, అందరికీ యూనిఫామ్ అలవెన్సు వర్తింపజేయాలని, అందరికీ టాబ్స్ అండ్ ఉచిత సిమ్ కార్డ్స్ ఇవ్వాలని, ఎంప్లాయి హెల్త్ స్కీం అందరికీ వర్తింపజేయాలని, పెండింగ్ బిల్స్ త్వరగా క్లియర్ చేయాలని, పీఆర్సీ డీఏ అనౌన్స్ చేయాలని వంటి ప్రధాన సమస్యలపై చర్చించి, పరిష్కారం దిశగా ఉద్యోగుల నుంచి అభిప్రాయాలను సేకరించి పరిష్కారం దిశగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్‌లు కేంద్ర కార్యవర్గ సభ్యులు పాలు బాయి ఈశ్వర్, ఉపాధ్యక్షులు రవి చంద్ర, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పద్మ, కార్యవర్గ సభ్యులు శ్రీచంద్, కలెక్టరేట్ యూనిట్ ప్రెసిడెంట్ జేమ్స్ దాస్, ఘట్కేసర్ యూనిట్ అధ్యక్షుడు ఈఎస్ఎస్ గిరికాంత్, మల్కాజిగిరి యూనిట్ అధ్యక్ష, కార్యదర్శి అరుణ, మినిస్టరియల్ ఫోరమ్ అధ్యక్ష, కార్యదర్శి రాంరెడ్డి-అనిత, మెడికల్ అండ్ హెల్త్ ఫోరమ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యం, కుత్బుల్లాపూర్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు నజీమా-సత్యజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

నవతెలంగాణ-దుండిగల్

అధికార పార్టీలైన కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాల పనితీరుతో అనేక వైఫల్యాలతో



ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ పార్టీ ద్వారానే దేశ సమగ్ర అభివృద్ధితో పాటు, ప్రజల సంక్షేమ పథకాలతో సురక్షితంగా ఉంటారనే నమ్మకంతోనే పార్టీలో చేరుతున్నారని కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ ప్రతినిధి కొలను హనుమంత రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మల్లంపేట్ గ్రామవాసులు శనివారం టీపీసీసీ ప్రతినిధి కొలను హనుమంత రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర వైఫల్యాలపై నిరంతరం పోరాటం చేస్తున్న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి నాయకత్వానికి ప్రజలందరూ మద్దతు తెలుపడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రానున్న రోజుల్లో పునర్ వైభవం సంతరించుకొని అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీలో అశోక్, ప్రేమ్ కుమార్, రాజు, ప్రతాప్, శ్రీనివాస్‌ల మిత్రబృందం చేరారు. కాంగ్రెస్ ప్రభత్వం తెలంగాణ రాష్ట్రం కోసం కృషి చేసిన, ప్రతి ఒక్కరిని కాంగ్రెస్ గుర్తిస్తుందని అదేవిధంగా పార్టీ అధికారంలోకి వచ్చాక తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల కుటుంబంలో ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తుందన్నారు. ప్రాణాలర్పించిన కుటుంబంలో నెలకు రూ.25000 అమరవీరుల పెన్షన్ , అదేవిధంగా ఉద్యమంలో పాల్గొన్న యువత పై కేసులను ఎత్తివేయడంతో పాటు, జూన్ 2న వారికీ తెలంగాణ ఉద్యమకారులుగా ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు...

- పాఠశాల డైరెక్టర్ నరిశెట్టి సుందర రాజు

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూచిత్రలోని సెయింట్ ఆంథోనీ హై స్కూలులో శనివారం పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ నరిశెట్టి సుందర రాజు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంపొదించాలన్న ఉద్దేశ్యంతో పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించామన్నారు. ఈ ఎన్నికల్లో గోయల్, ఆర్పిత ఇతర నాయకులు గెలుపొందగా, గెలుపొందిన విద్యార్థుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో విద్యార్థులు మర్చిఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పాఠశాల పరిసర ప్రాంతాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫాథర్ విన్సెంట్ ఆరోక్య స్వామి, మల్లవరపు ధనరాజ్, ప్రిన్సిపల్ సరితా, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- కార్పొరేటర్ రషీదా మొహమ్మద్ రఫీ

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



రాజకీయాలకతీతంగా డివిజన్‌ను ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తానని స్థానిక కార్పొరేటర్ రషీదా మహమ్మద్ రఫీ అన్నారు. శనివారం చింతల్ డివిజన్ పరిధి(పట్వారి ఎన్క్లేవ్ ఎంటీఏఆర్ కంపెనీ నుండి షరాన్ చర్చి) వరకు రూ.43.9 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు పడకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కాంట్రాక్టర్లను ఆదేశించారు. సమస్య ఎదైనా ఆమె దృష్టికి తీసుకువస్తే అందరి సహాయ సహకారాలతో పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ.సంపత్ బీజేపీ రాష్ట్ర నాయకులు రాజా కొట్టే సదానం ద్, డివిజన్ బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు బాల్ రెడ్డి, వివిధ కాలనీవాసులు సీతారామయ్య, స్టార్ లైట్ అపార్ట్మెంట్ వెల్ఫేర్ అధ్యక్షులు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి వెంగయ్య, సాగర్ రెసిడెన్సి అధ్యక్షులు బలరాం మూర్తి, అశోక్ పాల్గొన్నారు.

పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలి

- కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహన నగర్‌లో రూ.55.10 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాలనీ వాసులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హైదర్ నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ మహదేవ్, కాలనీ వాసులు అందే నర్సింహ, రామ కోటేశ్వర్ రావు, యాది రెడ్డి, మదన్ మోహన్, కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎమ్మెల్యే పాదయాత్ర

- కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్



కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని డివిజన్‌లో ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా చేపడుతున్న పాదయాత్రలో భాగంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం బాలానగర్‌లో పాదయాత్ర నిర్వహించనున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి తెలిపారు. శనివారం బాలానగర్‌లోని సామ్రాట్ హెటల్‌లో సన్నాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే పాదయాత్ర చేపట్టారన్నారు. ఇందులో భాగంగా సోమవారం ఆగస్టు 7 నుండి బాలానగర్ డివిజన్ పరిదిలో ఫిరోజ్ గూడ నుంచి పాదయాత్ర ప్రారంభం కానున్న తరుణంలో డివిజన్ కార్పొరేటర్ అధ్యక్షతన జరిగే పాదయాత్రలో స్థానిక నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం బాలానగర్ డివిజన్ పరిశీలకుడు నరేందర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, వాటిని ప్రజలకు చేరువచేసి వారికి ఏమైనా సమస్యలు ఉంటే వాటిని తెలుసుకుని వాటిని పరిష్కరించే ఉద్దేశంతో ఎమ్మెల్యే పాదయాత్ర చేపట్టినట్టు వారు పేర్కొన్నారు. పాదయాత్రలో తాగునీరు, డ్రయినేజీ, సీసీ రోడ్లు వంటి సమస్యలు ఉంటే ఎమ్మెల్యే, కార్పొరేటర్ దృష్టికి తీసుకురావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ మందడి సుధాకర్ రెడ్డి, డివిజన్ ఇన్‌చార్జి నరేందర్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు దర్శనం శాకయ్య, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాజా, బీఆర్ఎస్ పార్టీనాయకులు, మహిళలు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి : కార్పొరేటర్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రంగారెడ్డి నగర్ డివిజన్ ప్రజల సంక్షేమానికి, మహిళల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ బి .విజయ శేఖర్ గౌడ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధి గాంధీ నగర్‌లో కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్ చేతుల మీదుగా మహిళా భవన్, కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణం పనులు స్థానికులు, మహిళలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను డివిజన్ ప్రజల సహాయ సహకారాలతో రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకొస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు జల్దా లక్ష్మి నాథ్,అబ్దుల్ ఖాదర్, బస్తీ నాయకులు మేకల ఎల్లయ్య, సత్యనారాయణ, కమలా బాయి, పద్మ, తిమ్మయ్య, మల్లీశ్వరి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో, ట్రాలీ డీసీఎం యూనియన్ జెండా ఆవిష్కరణ



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

నేరేడ్‌మెట్ క్రాస్ రోడ్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం నేరేడ్ మెట్ చౌరస్తాలో ఆటో, ట్రాలీ డీసీఎం యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ మల్కాజిగిరి నియోజకవర్గం కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి హజరై యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి బెజ్జాల కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేరేడ్ మెట్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి, చెన్న రేడి, ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా నాయకులు దర్శనం యాదగిరి, జవహర్ నగర్ ఏఐటీయూసీ ఆటో ట్రాలీ యూనియన్ అధ్యక్షులు ఎల్లయ్య, నేరేడుమెట్ లేబర్ అడ్డా కార్యదర్శి జె. వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డ్రైవర్ కార్మిక సోదరులను ఉద్దేశించి రొయ్యల కృష్ణమూర్తి, బెజ్జాల కృష్ణమూర్తిలు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా తమ సమస్యల పరిస్కారం కోసం కార్మిక సోదరులు 104 సంవత్సరాల క్రితం దేశ రాజధాని కేంద్రంలో ఏఐటీయూసీ కార్మిక సంఘాన్ని స్థాపించి, వారి హక్కుల సాధన కోసం కార్మికులు యూనియన్లు ఏర్పాటు చేసుకొని పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఏఐటీయూసీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాడి తమ హక్కులను ఎన్నో సాధించు కోవడం జరిగిందన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ పరిధిలో ఉన్న డీసీఎంయం, ట్రాలీ, ఆటో కార్మిక సోదరులు అభద్రత భావానికి లోనవుతున్నాయని రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి ఉందని వాపోయారు. వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలనుండి ఎలాంటి సహకారం అందడం లేదని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్ పోలీసులు వేధింపులు కారణంగా తప్పులేకున్నా అధిక మొత్తంలో ఫైన్లు వేస్తుండటంతో కోలుకోలేని విధంగా ఓనర్స్, డ్రైవర్స్ పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేక తమ కుటుంబాలను పోషించలేక డ్రైవింగ్ నేర్చుకొని స్వంత డబ్బులు పెట్టి కొనలేక ఋణాల ద్వారా మోటారు వెహికల్స్‌కొని తమ కుటుంబ పోషణకు జీవన ప్రయాణాన్ని కొనసాగిస్తు న్నారని, వారిని అన్ని విధాలుగా ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు.దేశ వ్యాప్తంగా లక్షలాది మంది ఓనర్స్, డ్రైవర్స్ ఉపాధి పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఓనర్స్ అండ్ డ్రైవర్స్ బి.బీరప్ప, ఎస్. కామేశ్వర్రావు, నరేందర్, జై రాజ్, విచేందర్, ఎం.డి హుస్సేన్, కె.శేఖర్, కాశ్మీర్ లాల్, రవీందర్ గౌడ్, ఎల్లయ్య కుర్మ బి.నర్సిహ్మా యాదవ్, మదన్ గౌడ్, నాగరాజు, సురేష్, ఎం. రాజు కుర్మ, వెంకటేష్, శ్రీను యాదవ్, రవి గౌడ్, రాజు యాదవ్, సిద్దులు కుర్మ మహేష్ కుర్మ సంతోష్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకారం అందజేసిన నేరేడ్ మెట్ సీఐ జి.నాగరాజుని కార్మిక సోదరులు ఘనంగా సన్మానించారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ -బాలానగర్



నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేది బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం కూకట్‌పల్లి సర్కిల్ ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలో ఐదవ రోజు పాదయాత్ర ముగించుకుని అనంతరం పార్టీ కార్యాలయం ఆవరణలో ఓల్డ్ బోయిన్‌పల్లి ప్రగతి నివేదన సభను నిర్వహించారు. ఈ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో అర్హులైన 4,400 లబ్దిదారులకు ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న సొంత ఇంటి కళ నెరవేరుస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్ని పార్టీల జెండాలు వచ్చినా తెలంగాణలో నిలిచేది గులాబీ జెండానేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో లేని అనేక సంక్షేమ పథకాలు తెలంగాణ ప్రభుత్వంలో సుసాధ్యమయ్యాయని సగర్వంగా తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రగల్భాలకై కరపత్రా లను ముద్రించుకొని తెలంగాణకు ఏం వెలగబెట్టారని, పాదయా త్రలు నిర్వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు.? డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులు కొందరి మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని లబ్దిదారులకు ఆయన తెలిపారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ మాట్లాడుతూ ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలో పాదయాత్రలో భాగంగా తమ దృష్టికి వచ్చిన ప్రతి సమ స్యను అలసత్వం త్వరితగన పరిష్కరిస్తామన్నారు. డివిజ న్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులలో నెలాఖరులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని డివిజన్‌ల కార్పొరేటర్లు ఆవుల రవీందర్ రెడ్డి, జూపల్లి సత్యనారాయణ, శిరీష బాబూరావు, మందడి శ్రీనివాసరావు, మహేశ్వరి శ్రీహరి, నాయకులు నరేందర్ గౌడ్, కర్రె జంగయ్య, లావణ్య, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మహీంద్రా వర్సిటీలో రెండో వార్షికోత్సవ వేడుకలు



- విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం

నవతెలంగాణ-దుండిగల్


కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాల్టీ పరిధిలోని బహదూర్‌పల్లిలో గల మహీంద్రా విశ్వవిద్యాలయంలో రెండో వార్షిక స్నాతకోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జీఎంఆర్ గ్రూప్ చైర్మెన్ గ్రంధి మల్లికార్జున రావు అప్‌గ్రాడ్ చైర్మెన్ రోని స్క్రీవ్ వాల, మహేంద్ర యూనివర్సిటీ చాన్సలర్ ఆనంద్ మహేంద్ర, ఎంఈఐ. చైర్మెన్ వినీత్ నయ్యర్‌లు హాజరై మొదట జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జీఎంఆర్ గ్రూప్ చైర్మెన్ గ్రంధి మల్లికార్జున రావు మాట్లాడుతూ అభ్యాస వైఖరి అనేది ఉత్సుకత, మానవత్వంపై ఆధారపడి ఉందన్నారు. విద్యార్థులు కంఫర్ట్ జోన్ల నుంచి బయటికి రావాలన్నారు. మేధా పరమైన వృద్ధిని పెంపొందించుకోవడానికి భవిష్యత్తులో నాయకులను శక్తివంతంగా పెంపొందించడం టెక్ మహేంద్ర యూనివర్సిటీ నిబద్ధతకు నిదర్శనం అన్నారు. జీవితాంతం విద్యార్థులా ప్రవర్తించాలని ప్రతి ఒక్కరిని కోరుచున్నానని తెలిపారు. ఈ సందర్భంగా గౌరవ అతిథి, అప్‌గ్రాడ్ చైర్మెన్ రోనీ స్క్రూవాలా మాట్లాడుతూ.. ఆరు సూపర్ నైపుణ్యాలను విద్యార్థులకు వివరించారు. అవి స్పష్టత, అనుసంధానం, నమ్మకం, ఉత్సుకత, మార్పు, ఎంపిక అన్నారు. విద్యార్థులు జీవితకాలం నేర్చుకునే దశలోకి ప్రవేశించేటప్పుడు మనం ఎలా నేర్చుకుంటాం, ఎవరి నుంచి నేర్చుకుంటామనేది చూడాలన్నారు. ఇతరుల జీవితాలను మెరుగుపరచడంపై నిరంతరం ఆలోచించాలని విద్యార్థులను కోరారు. ఈ సందర్భంగా మహీంద్రా యూనివర్శిటీ ఛాన్సలర్ ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ మన జీవితాలు యంత్రాలతో ఎంతగా పెనవేసుకుపోతాయో, నిర్ణయం తీసుకునే అల్గారిథమ్ నుంచి మనల్ని వేరుచేసే మానవత్వాన్ని కాపాడుకోవడం, పెంపొందించడం అంత ముఖ్యమైనదన్నారు. ఎంఈఐ చైర్మెన్ వినీత్ నయ్యర్ మాట్లాడుతూ క్వాంటిటీతో కాకుండా నాణ్యతతో పనిచేయాలన్నదే తమ ప్రధాన ఆలోచన అన్నారు. టెక్ మహీంద్రా ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఎంఈఐ), మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో సీపీ గుర్నానీ మాట్లాడుతూ విద్యార్థులు మొదట ఉపాధ్యాయులకు, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేయాలన్నారు. టెక్ మహీంద్రా 76 సంవత్సరాల క్రితం ఉన్న కంపెనీ, రాబోయే 76 సంవత్సరాల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం పట్టభద్రులైన ముగ్గురు పీహెచ్‌డీ, 22 ఎంటెక్, 262 బీటెక్ విద్యార్థులకు పట్టాలు అందజేశారు. లైఫ్ సైన్సెస్ ల్యాబ్ కాంప్లెక్స్, మహీంద్రా ఈ-హబ్‌లను గ్రంధి మల్లికార్జునరావు, రోనీ స్క్రూవాలా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టెక్ మహీంద్రా ఎండీ, సీఈవో మోహిత్ జోషి, మహీంద్రా యూనివర్శిటీ వైస్-ఛాన్సలర్ డాక్టర్ యాజులు మేదురి పాల్గొన్నారు.

పేరం రాములుకు పరామర్శ



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ఎరుకల సంఘం జూబ్లీహిల్స్ నియోజకవర్గం సీనియర్ నాయకులు పేరం రాములు సంఘంలో పని చేసే ఎంతో మందికి సహాయ సహకారాలు అందించి రెండేండ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ, చికిత్స తీసుకుంటూ మంచానికే పరిమి తమయ్యారు. శనివారం సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి రాయపురం మహేందర్, సంఘం జూబ్లీహిల్స్ నియోజకవర్గం అధ్యక్షులు కూతాటి రవి, సీనియర్ నాయకుడు బెల్లంకొండ రవి, ఉపాధ్యక్షుడు పేరం ముత్యాలు, పులిచేరి భాస్కర్, కార్యదర్శి రాజ్‌కుమార్, యూత్ లీడర్ రాయపురం అఖిల్, తదితరులు వారిని పరామర్శించారు.



మున్నూరు కాపు కార్పొరేషన్ సాధన పై ఏర్పాటు చేసిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు బుర్గుబావి హన్మంతు రావు, జిల్లా యూత్ కన్వీనర్ పుప్పాల భాస్కర్ ఆధ్వర్యంలో దూలపల్లి నుండి బయలదేరిన మున్నూరు కాపు నాయకులను అరెస్టు చేసి, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలిం చారు. ఈ కార్యక్రమంలో సాయిని శ్రీనివా స్, లక్ష్మినారాయణ, అశోక్, పందిరి యాదగి రి, సత్యనారయణ, కమలాకర్, రావుల రా జు, రఘు, సతీష్, డాక్టర్ శ్రీనివాస్, దర్శన్, నగేష్, తాటి రవి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్‌ని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్ వీర్ భగత్ సేవక్ సభ్యులు శనివారం డిప్యూటీ మేయర్ కార్యాలయంలో కలిశారు. వారు ఆదివారం నిర్వహించు మెగా బ్లడ్ డొనేషన్, ఫ్రీ హెల్త్ చెకప్ క్యాంప్ కు ముఖ్య అతిథులుగా హాజరు కాగలరని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దశరత్, రాములు, వంశీ గంగపురం, విష్ణువర్ధన్ రెడ్డి, విశ్వనాథ్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

మైనార్టీ అభ్యర్థులకు దూరవిద్యలో టెన్త్, ఇంటర్.. దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సిటీబ్యూరో

వివిధ కారణాలతో చదువుకు దూరమైన వారికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) ద్వారా చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. పదో తరగతి, ఇంటర్ చదవాలనే కోరిక ఉన్న అర్హులైన మైనార్టీ(ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు) అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మహ్మద్ ఇలియాస్ అహ్మద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో(2023-24) ప్రవేశం పొందాలనుకునే వారు ఈనెల 10వ తేదీ వరకు ఎలాంటి జరిమానా లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అపరాధ రుసుముతో 31 వరకు చెల్లించ వచ్చునని వివరించారు. 14 సంవత్సరాలు నిండిన వారందరికీ దూరవిద్య ద్వారా పదో తరగతి, ఇంటర్ చదువుకునేందుకు అర్హులని, మరిన్ని వివరాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. తెలంగాణఓపెన్‌స్కూల్.ఆర్గ్‌ని సంప్రందించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియాస్ సూచించారు.



వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా కళాశాల సామాజిక శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో 'జయంతి ఉత్సవా'న్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యాపకులు ఎ.తిరుపతి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య హాజరయ్యారు. వక్తలుగా అధ్యాపకులు డా.కిశోర్ కుమార్, ఎస్.రవి ప్రసాద్, డా.అంజనేయులు, డా.చిన్నబాబు, ఇ.నర్సింగరావు, పి.వి.ఈశ్వర్ పాల్గొని, ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన ఉద్యమాలు, రచనలు, కవితలను తెలియజేశారు. ముఖ్య అతిథి డా.జి.సుకన్య మాట్లాడుతూ నాటి తెలంగాణ ప్రజలకు నీళ్ళు, నిధులు, నియామకాలలో జరిగిన వివక్ష తో పాటు తెలంగాణాకు జరిగిన అన్యాయాలను వివరించారు. తెలంగాణ చరిత్రను అధ్యయనం చేసి, భవిష్యత్ తెలంగాణ అభివృద్ధి కోసం పాటు పడాలని విద్యార్థులకు సూచించారు. అధ్యాపకులు జె.శ్రీదేవి, బి.శ్రీనివాస్,డా.జె.భారతి, డా.రాజారత్నం, డా.కె.నిర్మల, డా.యాదవ్, ఎం.సంగీత, బి.విజయ నిర్మల, ఎల్.విష్ణుప్రియ, ఇఫ్రత్ సుల్తానా, షీబారాణిలతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వక్తల ప్రసంగం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

లోపాలను సరి చేసేదే నిజమైన స్నేహం

● డా.హిప్నో పద్మా కమలాకర్

నవతెలంగాణ-సిటీబ్యూరో



లోపాలను సరి చేసేదే నిజమైన స్నేహమని డా.హిప్నోకమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ డైరెక్టర్ డా.హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. ఆగస్టు 6న అంతర్జాతీయ స్నేహ దినోత్సవం సందర్భంగా ముషీరాబాద్‌లోని ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో డా.హిప్నోకమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాలికలకు పోష కాహారం, కథలు, పాటలు, గొప్ప వ్యక్తుల పుస్తకాలు, పెన్సిల్, ఎరేజర్లు అందజేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్నేహం మానవ సంబంధాల నిజమైన రూపమన్నారు. ఏమైంది అని అడిగేవారు, ఏమీ కాదులే అని చెప్పే వారు స్నేహితులన్నారు. కులం, మతం, రంగు, వయస్సు, జాతితో సంబంధం లేకుండా స్నేహాన్ని జరుపుకోవడం ఈ రోజు ప్రాముఖ్యత అన్నారు. స్నేహం ఇతరుల పట్ల దయ, సద్భావనతో, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం, అభినందనలు ఇవ్వడం లేదా కృతజ్ఞతలు తెలియజేయడం వంటివి చేయాలని కోరారు. అందమైన స్నేహం ఎప్పటికీ అలాగే ఉంటుందని చెప్పారు. మన ప్రతి అడుగులో విశ్వసించగలిగే వ్యక్తే స్నేహితులన్నారు. క్లాసులోనూ, చుట్టుపక్కల ఉన్న వ్యక్తులే స్నేహితులనుకోకూడదన్నారు. మంచి సోదరిగా, సోదరుడిగా, కుమార్తెగా, కొడుకు గా కుటుంబంలోనూ స్నేహ సంబంధాలు ఏర్పరుచుకోవాలని తెలిపారు. ఎన్ని సమస్యలు ఉన్నా ఎప్పటికీ విడిచిపెట్టని వారే నిజమైన స్నేహితులు అని తెలిపారు. స్నేహితులనే వారు పెన్సిల్, ఎరేజర్ లా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవభారత లయన్స్ క్లబ్ జోనల్ చైర్‌పర్సన్ పీ.హెచ్.గోపాలకష్ణ, జి.హిమకర్, సైకాలజిస్ట్ నితీష్ , హాస్టల్ హెడ్ బాపు ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు..

1. నేడు ఆచార్య జయశంకర్ సార్ 12వ స్మారకోపన్యాసం-స్ఫూర్తి సదస్సు
సమయం : ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు
స్థలం:మదినా ఎడ్యుకేషన్ సెంటర్, నాంపల్లి హైదరాబాద్
అంశం:అసహన రాజకీయాలు-భారతదేశం
ప్రొ:అజయ్ గుడవర్తి(జె.ఎన్.యు న్యూఢిల్లీ)
జహీర్ అలీఖాన్ సియాసత్ ఎడిటర్

ప్రభుత్వ ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా ఆర్డీవో లను నియమించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతి నిధులు అన్నారు. శనివారం కోఠిలోని డీఎం ఈ ప్రాంగణంలోడాక్టర్ పల్లం ప్రవీణ్‌కుమార్, డాక్టర్ బొంగు రమేష్, డాక్టర్ నరహరి. డాక్టర్ రంగఅజ్మీర డాక్టర్ లాలు ప్రసాద్‌రాథోడ్, డాక్టర్‌శేఖర్‌లు మాట్లాడుతూ దవాఖానాల్లో సూపరిం టెండెంట్‌తో పాటు అడ్మిని స్ట్రేషన్ విషయంలో ఆర్డీవోల సేవలను వినియోగించుకోవాలని శుక్రవారం అసెంబ్లీలో మంత్రి హరీష్‌రావు చేసిన తీర్మానాన్ని ఖండిస్తున్నామ న్నారు.కింది స్థాయి ఉద్యోగం నుండి వచ్చిన ఆర్డీవోలను తమపై పెత్తనం చేయించడం సరికాదని, ప్రభుత్వం తమ పెండింగ్ సమస్యలను పరిష్కరిం చకుండాతమపై అజమాయిషీ చేలా యించాలని చూస్తుంది మండిపడ్డారు. మంత్రి హరీష్ రావు చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని కోరారు. 2016 నుండి పీఆర్సీ ఏరియర్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ డిమాండ్ చేశారు. డాక్టర్ల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వైఖరిని విడనాడాలని, డీహెచ్ పరిధిలో టైంబాండ్ ప్రమోషన్లు వెంటనే కల్పిం చాలన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం త్వరలో వైద్య గర్జన నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్ ఉమాకాంత్, డాక్టర్ రాజు, డాక్టర్ వినోద్ డాక్టర్ శ్రీనివాస్‌చ, డాక్టర్ భూపేందర్, డాక్టర్ రవి, డాక్టర్ రమేష్ డాక్టర్ అబ్బయ్య డాక్టర్ వసంత్, డాక్టర్ కళ్యాణ్ డాక్టర్ లక్ష్మణ, పాల్గొన్నారు.

8న జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముట్టడిని జయప్రదం చేయాలి



- **సీపీఐ(ఎం) జూబ్లీహిల్స్ జోన్ కమిటీ**

నవ తెలంగాణ- జూబ్లీహిల్స్

డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం కలెక్టర్ ఆఫీస్‌లో నేరుగా దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులు పరిశీలించి, డబల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వా లని, ఆగస్టు 8న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముట్టడిని జయప్రదం చేయాలని, సీపీఐ(ఎం) జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో రహమత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ రెండు బొమ్మల వద్ద ధర్నా కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇండ్లు లేని పేదలు వేలాదిమంది హైదరాబాద్ కలెక్టర్ ఆఫీసులో, ఖైరతాబాద్ ఎమ్మార్వో ఆఫీస్‌లో, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వాటిని ఇప్పటివరకు అధికారులు పరిశీలించలేదన్నారు. వెంటనే పరిశీలించి అర్హులకు ఇండ్లు ఇవ్వాలని,లేని పక్షంలో 8వ తేదీన మంగళవారం హైదరాబాద్ కలెక్టర్ ఆఫీస్ లక్డీకపూల్ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. భారీ సంఖ్యలో వచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ నాయకులు రాపర్తి అశోక్, టి.సాయి శేషగిరిరావు, జె.స్వామి, జి.బిక్షపతి , సోమేష్, భాగ్యరాజు, లక్ష్మయ్య, దేవదాసు, మైపాల్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కస్టమర్లకు మరింత అందుబాటులోకి 'విజయలక్ష్మి డీర్ బ్రాండ్' ఉత్పత్తులు

- **ఎండీ జీ.సంపత్‌కుమార్**

నవతెలంగాణ-సిటీబ్యూరో



'విజయలక్ష్మి డీర్ బ్రాండ్' ఉత్పత్తులు ప్రజలకు మరింత అందుబాటులోకి వచ్చాయి. విజయలక్ష్మి డీర్ బ్రాండ్‌కు దాల్స్ పరిశ్రమలో 33 ఏండ్ల అనుభవముంది. ముఖ్యంగా మినప పప్పు, కందిపప్పు, పెసర పప్పు, శనగ పప్పు, పుట్నాల పప్పు ఇలా ఐదురకాల పప్పుదిసుల తయారీ పరిశ్రమలో అగ్రగామీగా నిలిచింది. ఈ సందర్భంగా విజయలక్ష్మి డీర్ బ్రాండ్ ఎండీ జీ.సంపత్‌కుమార్ శుక్రవారం మాట్లాడారు. నేడు మార్కెట్లలో నిత్యావసర వస్తువులు నకిలీగా తయారు చేస్తున్నారని, వాటిని వినియోగిస్తున్న వారు రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మా కస్టమర్లకు నాణ్యమైన పప్పుదినుస్సులను అందించడమే మా ధ్యేయమన్నారు. కస్టమర్ల ఆరోగ్యంతోపాటు మంచి రుచి, హైక్వాలిటీ అందించేందుకు నేరుగా రైతు పొలాల నుంచి సేకరిస్తామని తెలిపారు.హైదరాబాద్, కూకట్‌పల్లిలోని మాల్స్‌తోపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల్లోని ఉషోదయ సూపర్ మార్కెట్లో మా ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మా బ్రాండ్స్ వినియోగించి ప్రజలు మంచి ఆరోగ్యాన్ని పొందాలని కోరారు.

ఒకేషనల్ కోర్సుల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు: డీఐఈఓ బడ్డెన్న

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఏఅండ్‌టీ, పీఎస్‌టీటీ, ఎంపీహెచ్‌డబ్ల్యు(ఒకేషనల్), కెమిస్ట్రీ(ఉర్దుమీడియం) సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డి.ఒడ్డెన్న తెలిపారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిబంధనల ప్రకారం విద్యార్హతతో పాటు కళాశాలలు, సబ్జెక్టుల వారీగా ఖాళీల వివరాలను ఆన్‌లైన్‌తో పాటు జిల్లా డీఐఈవో కార్యాలయంలోనూ ప్రదర్శించినట్టు ఆయన వివ రించారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులలో అర్హత సర్టిఫికెట్‌లతో(ఎస్ఎస్‌సీ నుంచి పీజీ కాన్వకేషన్, కన్సాలిడేటెడ్ మార్క్స్ మెమో కాపీలు) మంగళవారం(8వతేదీన) లోపు జిల్లా డీఐఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.



ఆర్చరీలో డబుల్ ధమాకా

- అదితికి పసిడి, సురేఖకు కాంస్యం
- ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్స్

బెర్లిన్ (జర్మనీ) : ప్రపంచ సీనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్స్‌లో భారత ఆర్చర్ల పతక జోరు కొనసాగుతుంది. శుక్రవారం మహిళల జట్టు విభాగంలో జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్ కౌర్‌లు పసిడి పతకంతో సరికొత్త రికార్డు సృష్టించగా.. శనివారం సైతం పతకాల పంట పండింది. గత నెలలో జూనియర్ ఆర్చరీ వరల్డ్‌కప్‌లో పసిడి సాధించిన అదితి స్వామి.. తాజాగా 17 ఏండ్ల వయసులోనే సీనియర్ విభాగంలో ప్రపంచ చాంపియన్‌గా అవతరించి రికార్డు సృష్టించింది. మహిళల వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో యువ ఆర్చర్ అదితి స్వామి పసిడి వెలుగులు వెలిగించింది. మెక్సికో ఆర్చర్ ఆండ్రీయ బెక్రెరాతో పసిడి పోరులో అదితి స్వామి 149-147తో అద్వితీయ విజయం సాధించింది. అంతకముందు జరిగిన ఆల్ ఇండియన్ సెమీఫైనల్లో సీనియర్ ఆర్చర్, తెలుగు తేజం వెన్నం జ్యోతి సురేఖపై అదితి స్వామి 149-145తో విజయం సాధించింది. సహచర ఆర్చర్ చేతిలో ఓటమి నుంచి వేగంగా పుంజుకున్న జ్యోతి సురేఖ.. కాంస్య పతక పోరులో సత్తా చాటింది. టర్కీ ఆర్చర్ ఐపెక్ టోమర్క్‌పై 150-146తో పర్‌ఫెక్ట్ స్కోరుతో సత్తా చాటింది. దీంతో ఒకే ఈవెంట్‌లో భారత్ పసిడి, కాంస్య పతకాలు సాధించి డబుల్ ధమాకా చూపించింది.

మరో మ్యాచ్ రీ షెడ్యూల్!



- కాళీ పూజతో పాక్, ఇంగ్లాండ్ మ్యాచ్ మార్పు

కోల్‌కత : అసలే ఆలస్యంగా షెడ్యూల్ విడుదల, ఆపై వరుసగా పర్వదినాల కారణంగా కీలక మ్యాచుల్లో మార్పులు చేయాలంటూ వినతి. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ షెడ్యూల్ విచిత్ర పరిస్థితి ఎదుర్కొంటుంది. గల్లీ క్రికెట్ తరహాలో రోజుకో మ్యాచ్‌ను రీ షెడ్యూల్ చేయాలని రాష్ట్ర క్రికెట్ సంఘాల నుంచి బీసీసీఐ, ఐసీసీకి అభ్యర్థనలు అందుతున్నాయి. తాజాగా ఈ జాబితాలో పాకిస్థాన్, ఇంగ్లాండ్ మ్యాచ్ సైతం చేరింది. నవంబర్ 12న ఇంగ్లాండ్, పాక్ జట్లు కోల్‌కతలోని ఈడెన్ గార్డెన్స్‌లో తలపడాలి. కానీ ఆ రోజు కాళీమాత పూజ ఉండటంతో క్రికెట్ మ్యాచ్‌కు భద్రత కల్పించటం కోల్‌కత పోలీసులు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్టు సమాచారం. తాజాగా కోల్‌కత ఈడెన్ గార్డెన్స్ మైదానాన్ని ఐసీసీ బృందం పర్యవేక్షించగా.. ఈ సందర్భంగా నవంబర్ 12న మ్యాచ్‌ను రీ షెడ్యూల్ చేయాలనే ప్రతిపాదన ఐసీసీ దృష్టికి వెళ్లిందని తెలుస్తోంది. దీనిపై బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. నవరాత్రి ఉత్సవాల్లో తొలి రోజు పండుగ కారణంగా అహ్మదాబాద్‌లో అక్టోబర్ 15న జరగాల్సిన భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌ను అక్టోబర్ 14కు మార్పు చేస్తున్న సంగతి తెలిసిందే. అక్టోబర్ 12న హైదరాబాద్‌లో జరగాల్సిన పాకిస్థాన్, శ్రీలంక మ్యాచ్‌ను సైతం అక్టోబర్ 10కి మార్పు చేయనున్నారు. దీంతో ప్రపంచకప్‌లో పాకిస్థాన్ ఆడుతున్న మూడు మ్యాచులను రీ షెడ్యూల్ చేయాల్సిన పరిస్థితి తలెత్తనుంది. త్వరలోనే ఐసీసీ, బీసీసీఐ ప్రపంచకప్ రీ షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉంది.

పుంజుకుంటారా?!

ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్) స్టార్స్ వర్సెస్ సీపీఎల్ (కరీబియన్ ప్రీమియర్ లీగ్) స్టార్స్‌గా పరిగణిస్తున్న ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో తొలి పంచ్ కరీబియన్లు విసిరారు. స్వల్ప స్కోర్ల థ్రిల్లర్‌లో ఓ బౌండరీ ఇరు జట్లకు మధ్య వ్యత్యాసంగా నిలిచింది. టెస్టు, వన్డేల్లో కరీబియన్ శిబిరంలో పస తగ్గినా.. టీ20ల్లో ఆ జట్టు అరివీర భయంకరమే. నాణ్యమైన విండీస్ జట్టుపై పొట్టి ఫార్మాట్‌లో సత్తా చాటేందుకు హార్దిక్ సేన సిద్ధమవుతోంది. యువ జట్టుతో 2024 టీ20 ప్రపంచకప్ సన్నద్ధతకు టీమ్ ఇండియా సై అంటోంది!.

- విండీస్‌తో భారత్ రెండో టీ20 నేడు
- సిరీస్ సమంపై హార్దిక్‌సేన గురి

రాత్రి 8 నుంచి డిడి స్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-ప్రావిడెన్స్

2023 వన్డే వరల్డ్‌కప్ ఏడాదిలో టీ20 సిరీస్‌కు పెద్దగా ప్రాధాన్యత లేదు అనిపించింది. కానీ భారత్, విండీస్ టీ20 సిరీస్ అందుకు భిన్నమైన అనుభూతి అందిస్తోంది!. తొలి టీ20ల్లోనే అందరి దృష్టిని ఆకర్షించిన భారత్, విండీస్ యువ స్టార్స్.. ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో ఆధిపత్య పోరుకు తెరతీశారు. 2024 టీ20 ప్రపంచకప్ వెస్టిండీస్, అమెరికాల్లోనే జరుగనుండటంతో టీమ్ ఇండియా ఈ సిరీస్‌ను సవాల్‌గా తీసుకుంటుంది. యువ ఆటగాళ్లకు ఇక్కడి పిచ్‌లు, పరిస్థితులపై అవగాహన కలిగేందుకు ఈ సిరీస్‌ను కీలకంగా భావిస్తుంది. ఇదే సమయంలో టెస్టు, టీ20ల్లో తేలిపోయిన ఆతిథ్య విండీస్.. అచ్చొచ్చిన టీ20 ఫార్మాట్‌లో సిరీస్ విజయం దిశగా అడుగులు వేస్తోంది. సమంపై హార్దిక్‌సేన, ఆధిక్యంపై పావెల్ గ్యాంగ్ కన్నేసిన వేళ భారత్, వెస్టిండీస్ రెండో టీ20 మ్యాచ్ నేడు.

కుర్రాళ్లకు పరీక్ష

తొలి టీ20లో భారత బ్యాటర్లు స్లో వికెట్‌పై తడబడ్డారు. అరంగేట్ర బ్యాటర్ తిలక్ వర్మ మినహా మరో ఆటగాడు ఆకట్టుకునే ప్రదర్శన చేయలేదు. బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడిన తిలక్ వర్మ.. మ్యాచ్‌ను భారత్ పరం చేసినట్టే కనిపించాడు. కానీ అతడి నిష్క్రమణ తర్వాత పరిణామాలు వేగంగా మారిపోయాయి. రెండో టీ20లోనూ తిలక్ వర్మ భారత్‌కు కీలకం కానున్నాడు. ఇక కెప్టెన్ హార్దిక్ పాండ్య, వైస్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌లు



ఇటు వ్యక్తిగతంగా మెరుగైన ప్రదర్శన చేయటంతో పాటు జట్టుగా ముందుకెళ్లటంపై దృష్టి నిలిపారు. సూర్యకుమార్ యాదవ్ ఇష్టమైన పొట్టి ఫార్మాట్‌లోనైనా ధనాధన్ మోత మోగించాలని ఎదురు చూస్తున్నాడు. ఇషాన్ కిషన్, శుభ్‌మన్ గిల్, సంజు శాంసన్‌లు సైతం మంచి ఇన్నింగ్స్‌లు ఆడాల్సి ఉంది. గత సీజన్ ఐపీఎల్ హీరో యశస్వి జైస్వాల్ బెంచ్‌పై అందుబాటులో ఉన్నాడు. టెస్టుల్లో కదం తొక్కిన యశస్వి జైస్వాల్‌కు నేడు రెండో టీ20లో అవకాశం దక్కుతుందేమో చూడాలి. తిలక్ వర్మ శైలిలోనే నిలకడగా ఊచకోత ఇన్నింగ్స్‌లు ఆడటంలో యశస్వి దిట్ట. బౌలింగ్ విభాగంలో ఇద్దరు స్పిన్నర్లనే నేడు ఎంచుకునే వీలుంది. కుల్దీప్, చాహల్ ఉండగా.. అక్షర్ పటేల్‌పై వేటు పడొచ్చు. ముకేశ్ కుమార్, అర్షదీప్ సింగ్‌లు డెత్ ఓవర్లలో మెరుస్తున్నా.. ఇంకా మెరుగైన ప్రదర్శన అవసరం. ఉమ్రాన్ మాలిక్, అవేశ్ ఖాన్‌లలో ఒకరు నేడు తుది జట్టులో నిలిచే అవకాశం కనిపిస్తోంది. లేదంటే, యశస్వి జైస్వాల్ రూపంలో అదనపు బ్యాటర్‌ను ఎంచుకునే అవకాశం సైతం లేకపోలేదు.

జోరుమీదున్న విండీస్

టెస్టులు, వన్డేలు అటుంచితే.. టీ20ల్లో కరీబియన్లది భిన్నమైన జట్టు. 'టీమ్ ఆఫ్ బౌండరీ హిట్టర్స్'గా విండీస్‌కు ఘనమైన పేరుంది. పొట్టి ఫార్మాట్‌లో స్ట్రయిక్‌రొటేషన్‌కు విలువ లేదని నిరూపించిన విండీస్.. బాదుడుతోనే అసమాన విజయాలు సాధించింది. సీపీఎల్‌లో దుమ్మురేపిన కుర్ర క్రికెటర్లు జట్టులో ఉండగా ఆతిథ్య జట్టు సిరీస్‌లో ఆధిక్యంపై కన్నేసింది. కెప్టెన్ రోవ్‌మాన్ పావెల్, షిమ్రోన్ హెట్‌మయర్, నికోలస్ పూరన్ సహా కైల్ మేయర్స్, బ్రాండన్ కింగ్‌లు ప్రమాదకర బ్యాటర్లు. తమదైన రోజు ఆకాశమే హద్దుగా చెలరేగుతారు. బంతితోనూ అల్జారీ జొసెఫ్, షెఫర్డ్, మెక్‌కాక్‌లకు తోడు ఒడీన్ స్మిత్ ప్రభావశీల బౌలర్లు. ఆరంభ మ్యాచ్‌లోనే విజయం, ఫేవరేట్ ఫార్మాట్ కావటంతో రెండో టీ20లోనూ విజయమే లక్ష్యంగా కరీబియన్లు బరిలోకి దిగుతున్నారు. ఈ గ్రౌండ్‌లో చెత్త రికార్డు ఒక్కటే ఆతిథ్య జట్టుకు అతిపెద్ద ప్రతికూలత!.

పిచ్ రిపోర్టు

ప్రావిడెన్స్ స్టేడియంలో ఆతిథ్య విండీస్‌కు మంచి రికార్డు లేదు. ఇక్కడ జరిగిన 11 టీ20ల్లో వర్షం కారణంగా మూడు మ్యాచుల్లో ఫలితం తేలలేదు. మిగతా మ్యాచుల్లో ఏకంగా ఐదింట కరీబియన్ జట్టు ఓటమి చవిచూసింది. ఈ రికార్డు నేడు భారత్‌కు సానుకూలం కానుంది. సహజంగా ఈ పిచ్‌పై స్పీడ్‌స్టర్స్‌కు సక్సెస్ అవకాశం ఎక్కువ. మ్యాచ్ సాగుతున్న కొద్ది పిచ్ నెమ్మదిగా మారి పరుగుల వేట కష్టమవుతుంది. అంతిమంతగా ఇది స్పిన్నర్లకు ఉపకరిస్తుంది. ఇక్కడ సగటు తొలి ఇన్నింగ్స్ స్కోరు 123 పరుగులు. టాస్ నెగ్గిన తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తుంది.

వర్షం సూచన

భారత్, వెస్టిండీస్ రెండో టీ20కు వర్షం సూచనలు ఎక్కువగా ఉన్నాయి. విండీస్ కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు మ్యాచ్ ఆరంభం అవుతుంది. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సరిగ్గా మ్యాచ్ జరిగే సమయంలోనే 40 శాతం వర్షం కురువనుందని వాతావరణ శాఖ వెల్లడించింది. మ్యాచ్‌కు ముందే వర్షం అంతరాయం కలిగిస్తే.. కుదించిన ఓవర్లతో రెండో టీ20 జరిగేందుకు ఆస్కారం ఎక్కువ.



తుది జట్లు (అంచనా)

భారత్ : ఇషాన్ కిషన్, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య (కెప్టెన్), సంజు శాంసన్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, అర్షదీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్, ముకేశ్ కుమార్.

వెస్టిండీస్ : బ్రాండన్ కింగ్, కైల్ మేయర్స్, జాన్సన్ చార్లెస్, నికోలస్ పూరన్, రోవ్‌మాన్ పావెల్ (కెప్టెన్), షిమ్రోన్ హెట్‌మయర్, రోమారియో షెఫర్డ్, జేసన్ హోల్డర్, అకీల్ హుస్సేన్, అల్జారీ జొసెఫ్, ఒబెడ్ మెక్‌కాయ్.

ఫైనల్లో ప్రణయ్

- సెమీస్‌లో ప్రియాన్షుపై గెలుపు



సిడ్నీ (ఆస్ట్రేలియా) : భారత బ్యాడ్మింటన్ వెటరన్ ఆటగాడు, వరల్డ్ నం.9 హెచ్.ఎస్ ప్రణయ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లోకి ప్రవేశించాడు. శనివారం జరిగిన మెన్స్ సింగిల్స్ సెమీఫైనల్లో సహచర భారత యువ షట్లర్ ప్రియాన్షు రజావత్‌పై హెచ్.ఎస్ ప్రణయ్ 21-18, 21-12తో వరుస గేముల్లో సాధికారిక విజయం సాధించాడు. ఆదివారం జరుగనున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 టోర్నీ మెన్స్ సింగిల్స్ ఫైనల్లో చైనా షట్లర్ వెంగ్ హాంగ్ యాంగ్‌తో ప్రణయ్ పోటీపడనున్నాడు. వరల్డ్ నం.24 చైనా షట్లర్‌తో గతంలో ఆడిన ఏకైక మ్యాచ్‌లో ప్రణయ్ పైచేయి సాధించాడు. మలేషియా మాస్టర్స్‌లో వెంగ్ హాంగ్ యాంగ్‌పై విజయంతోనే ఆరేండ్ల పతక దాహానికి ప్రణయ్ తెరదించటం విశేషం. సీజన్లో రెండో టైటిల్‌పై కన్నేసిన హెచ్.ఎస్ ప్రణయ్ మెన్స్ సింగిల్స్ టైటిల్ పోరులో హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతున్నాడు.

21 ఏండ్ల మధ్యప్రదేశ్ కుర్రాడు ప్రియాన్షు రజావత్ పోరాటానికి సెమీస్‌లో తెరపడింది. ప్రియాన్షుకు ఇదే కెరీర్ తొలి 500 సిరీస్ సెమీఫైనల్స్. తొలి గేమ్‌లో విరామం అనంతరం పొరపాట్లు చేసిన ప్రణయ్.. ప్రియాన్షు పుంజుకునేందుకు చోటిచ్చాడు. దీంతో 14-14తో ప్రియాన్షు స్కోరు సమం చేశాడు. ప్రియాన్షు పోటాపోటీగా పాయింట్లు సాధించగా 18-18తో ఉత్కంఠకు దారితీసింది. చివర్లో వరుస పాయింట్లు సాధించిన ప్రణయ్ 21-18తో తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో గేమ్‌లో 5-2తో ముందంజ వేసిన ప్రణయ్‌ని.. ప్రియాన్షు వెంటాడాడు. 7-7తో స్కోరు సమం చేశాడు. విరామ సమయానికి 11-7తో ప్రణయ్ ఆధిక్యం సాధించాడు. సీనియర్ షట్లర్‌తో సమరంలో వెనుకంజ వేసిన ప్రియాన్షు రజావత్ రెండో గేమ్‌ను సైతం కోల్పోయాడు. 43 నిమిషాల్లోనే ఫైనల్స్ బెర్త్ ఖాయం చేసుకున్న హెచ్.ఎస్ ప్రణయ్.. మలేషియా మాస్టర్స్ తర్వాత మరో టైటిల్ విజయం దిశగా దూసుకెళ్లాడు. భారత స్టార్ షట్లర్లు పి.వి సింధు, కిదాంబి శ్రీకాంత్ సహా లక్ష్యసేన్ క్వార్టర్స్‌లోనే ఇంటిముఖం పట్టిన సంగతి తెలిసిందే.



నవచిత్రం

మనస్ఫూర్తిగా నవ్వుకుంటారు



సంతోష్ శోభన్, రాశీ సింగ్

హీరో సంతోష్ శోభన్ నటిస్తున్న తాజా చిత్రం 'ప్రేమ్ కుమార్'. రైటర్ అభిషేక్ మహర్షి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సారంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై శివ ప్రసాద్ పన్నీరు నిర్మిస్తున్నారు. రాశీ సింగ్, రుచిత సాధినేని హీరోయిన్లు. ఈ సినిమా ఈనెల 18న రిలీజ్ అవుతోంది. ఈ నేపథ్యంలో శనివారం ఈ చిత్ర పరిచయ వేదిక కార్యక్రమం జరిగింది.

హీరో సంతోష్ శోభన్ మాట్లాడుతూ, "అభిషేక్ మహర్షి, శివ ప్రసాద్లకు థ్యాంక్స్. వాళ్ల నమ్మితేనే సినిమా ఇంత వరకు వచ్చింది. ఈ సినిమా మిమ్మల్ని రెండు గంటల పాటు మనస్ఫూర్తిగా నవ్విస్తుందని నమ్ముతున్నాను. ఈనెల 18న థియేటర్స్‌లో కలుద్దాం' అని అన్నారు. డైరెక్టర్ అభిషేక్ మహర్షి మాట్లాడుతూ 'ఈ కథ ఫిక్స్ కావటానికి కారణం సంతోష్ శోభన్. అనంత్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. థియేటర్‌లో సౌండ్ కొత్తగా ఉంటుంది. ఆడియెన్స్ సర్‌ప్రైజ్ అవుతారు. ఈ సినిమా చూస్తున్నప్పుడు మన ఫ్రెండ్స్ గుర్తుకొస్తారు. బయట మనం ఎలా ఉంటామో అదే పాత్రలను తెరపై చూస్తారు' అని అన్నారు. నిర్మాత శివ ప్రసాద్ మాట్లాడుతూ, 'ఆడియెన్స్‌ను ఎంటర్‌టైన్ చేయాలనేదే లక్ష్యంగా చేసిన సినిమా. ఇకపై ప్రతీ పార్టీలో మా మూవీ సాంగ్ వినిపిస్తుంది' అని తెలిపారు. 'ఇందులో అంగన అనే పాత్రలో డబ్బున్న అమ్మాయి ఎలా ఉండకూడదో అలా ఉండే టైప్ చేశా' అని నాయిక రుచితా సాధినేని చెప్పారు.

ఇంత కంటే ఏం కావాలి?

చిరంజీవి నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో తమన్నా, కీర్తి సురేష్, సుశాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానున్న నేపథ్యంలో చిరంజీవికి చెల్లెలుగా నటించిన కీర్తి సురేష్ శనివారం మీడియాతో ముచ్చటించారు. 'రజనీకాంత్‌కి సిస్టర్‌గా నటించా. అలాగే ఇప్పుడు చిరంజీవికి సిస్టర్‌గా కనిపించడం ఆనందంగా ఉంది. చిరంజీవి, రజనీకాంత్.. ఇద్దరు బిగ్గెస్ట్ స్టార్స్‌తో నటించాను. ఇంతకంటే ఏం కావాలి. ఈ సినిమాలో ఉన్న మరో గొప్ప విశేషం ఏంటంటే, చిరంజీవితో డ్యాన్స్ చేసే అవకాశం కూడా దొరికింది. ఆయనతో ఒక్క ఫ్రేమ్ లోనైనా డ్యాన్స్ చేయాలని వుండేది. కానీ ఇందులో రెండు పాటల్లో డ్యాన్స్ చేసే అవకాశం దొరికింది.



కీర్తి సురేష్

దర్శకుడు మెహర్ రమేష్ ఈ కథ చెప్పినప్పుడు చాలా నచ్చింది. అయితే సిస్టర్ క్యారెక్టర్ అనగానే డ్యాన్స్ చేసే అవకాశం ఉండదేమో అని భయపడ్డా. కానీ ఇందులో నా క్యారెక్టర్‌కి ఆ స్కోప్ ఉంది. అన్నయ్యతో చాలా బబ్లీ, జాలీగా ఉండే క్యారెక్టర్ కాబట్టి సూపర్‌గా కుదిరింది. ఈ సినిమా కథ ప్రధానంగా బ్రదర్ సిస్టర్ స్టోరీ. బ్రదర్ సిస్టర్ ఎమోషన్‌తో పాటు అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పక్కా ప్యాకేజ్‌గా ఉంటుంది. మా అమ్మ చిరంజీవితో 'పున్నమినాగు' చిత్రంలో నటించారు. అప్పటి చాలా విషయాలు అమ్మ నాకు చెప్పింది. చిరంజీవి ఎనర్జీ, డెడికేషన్, అలాగే సెట్‌లో ఇచ్చిన సలహాలు సూచనలు గురించి చెప్పింది. చాలా కేరింగ్‌గా చూసుకునేవారట. అమ్మ చాలా చిన్న వయసులో సినిమాల్లో వచ్చింది. అప్పుడు ఒక చిన్న పాపకి చెప్పినట్లు అన్ని విషయాలు చెప్పారట. ఈ విషయాన్ని చిరంజీవితో నేను చెప్పినపుడు.. చిరంజీవి రియాక్షన్ నాకు చాలా సర్ప్రైజ్ చేసింది. 'మీ అమ్మ చాలా అమాయకురాలు. నువ్వు మాత్రం అలా కాదు. స్ట్రీట్ స్మార్ట్ నువ్వు' అని చిరంజీవి అన్నారు(నవ్వుతూ). సాధ్యమైనంత వరకు మంచి పాత్రలతో మెప్పిస్తా' అని కీర్తి సురేష్ అన్నారు.

గ్రామంలో అందరికీ మతిమరుపు ఉంటే?

రామకృష్ణ, హరికృష్ణ హీరోలుగా నటిస్తున్న చిత్రం 'తికమక తాండ'. టిఎస్ఆర్ గ్రూప్ అధినేత, టిఎస్ఆర్ మూవీ మేకర్స్ ప్రొడ్యూసర్ తిరుపతి శ్రీనివాసరావు నిర్మిస్తున్నారు. గౌతమ్‌మీనన్, చేరన్, విక్రమ్ కె.కుమార్ వంటి దర్శకుల దగ్గర కో డైరెక్టర్‌గా పని చేసిన వెంకట్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఎన్నో చిత్రాల్లో బాల నటిగా అలరించిన ఆని కథానాయికగా పరిచయమవుతోంది. రామకృష్ణ, హరికృష్ణ ఇద్దరూ కవలలు హీరోలుగా నటించడం విశేషం.



అని, రామకృష్ణ

నిర్మాత తిరుపతి శ్రీనివాసరావు మాట్లాడుతూ,' అర్థవంతమైన చిత్రాలు చేయాలని సినిమాల్లోకి వచ్చా. తొలి చిత్రానికి మంచి కథ కుదిరింది. నిరూప్ కుమార్ ఇచ్చిన కథ, వెంకట్ ఎగ్జిక్యూషన్‌కు ఫిదా అయ్యి ఈ సినిమా చేస్తున్నా. మాటలు, సన్నివేశాలు ఎక్కడ అసభ్యత లేని కథ ఇది. కుటుంబ ప్రేక్షకులతోపాటు అన్ని వర్గాల ప్రేక్షకులను ఈ చిత్రం అలరిస్తుంది. సురేశ్ బొబ్బిలి సంగీతం సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. సిడ్ శ్రీరామ్ 'పుత్తడి బొమ్మ..' పాట ఇప్పటికే యూట్యూబ్‌లో 11 లక్షల వ్యూస్ తెచ్చుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది' అని అన్నారు.

'1990 పీరియడ్‌లో గ్రామీణ నేపథ్యంలో సాగే కథ ఇది. సమాజంలో ఎప్పటినుండో ఉన్న ఒక సమస్య, ఆ సమస్య వల్ల ఒక గ్రామం అంతా మతిమరుపు సమస్యతో బాధపడుతుంటారు. ఆ సమస్య నుంచి ఎలా బయటపడ్డారనే సామాజిక అంశంతో ఈచిత్రం తెరకెక్కుతోంది. వరంగల్ జిల్లాలోని మారుమూల గ్రామంలోని అందమైన లొకేషన్స్‌లో చిత్రీకరణ చేశాం. రామకృష్ణ, హరికృష్ణ తమ పాత్రల్లో ఒదిగిపోయారు, వారి నటన ఈ చిత్రానికి ప్రత్యేకంగా నిలుస్తుంది. కెమెరామెన్ పనితీరు హైలైట్‌గా నిలుస్తుంది. ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం' అని దర్శకుడు వెంకట్ తెలిపారు.



బోధన్‌లో ర్యాలీ

ప్రభుత్వోద్యోగులుగా గుర్తిస్తూ అసెంబ్లీలో తీర్మానం



- జీపీ కార్మికుల డిమాండ్.. 31 రోజులు పూర్తయిన సమ్మె
- బోధన్ పట్టణంలో భారీ ర్యాలీ, పలుచోట్ల వినూత్న తరహాలో నిరసనలు
- హక్కులను కాలరాసి టెంట్ల వద్ద మొసలికన్నీరు కారుస్తున్న బీజేపీ నేతలు

నవతెలంగాణ-బోధన్/ విలేకరులు

వేతనాలు పెంచి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని గ్రామ పంచాయతీ కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 31 రోజులు పూర్తయింది. శనివారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో గ్రామ పంచాయతీ కార్మికులతో భారీ కార్మిక ప్రదర్శన నిర్వహించి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. ప్రజలకు ప్రత్యక్షసేవలందిస్తున్న పంచాయతీ సిబ్బంది పట్ల ప్రభుత్వం వివక్ష పాటించడం శోచనీయమన్నారు. నూటికి 80శాతం మంది దళితులు గ్రామ పంచాయతీ కార్మికులు కావడం వల్లే వివక్ష కొనసాగిస్తున్నారా అని ఆమె విమర్శించారు. మోడీ స్వచ్ఛ భారత్, కేసీఆర్ పచ్చదనం పరిశుభ్రత పిలుపును చిత్తశుద్ధితో అమలు చేశారని అన్నారు. ఎన్నికలకు ముందు పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని సీఎం వాగ్దానం చేసి 9 ఏండ్లు గడిచినా ఎందుకు చేయలేదన్నారు. ధరలు బారెడు, జీతం జానెడు ఉంటే ఎలా అని ఎద్దేవా చేశారు. వేతనాలు పెంపు కోసం ప్రభుత్వం రూపొందించిన జీవో నెంబర్ 60 ప్రకారం గ్రామపంచాయతీ సిబ్బందికి రూ.19వేలు ఇవ్వాలన్నారు. రూ. 8500తో ఎలా జీవిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచకుండా పని భారం పెంచడానికి జీవో నెంబర్ 51ని రూపొందించి ఒకే కార్మికుడు అనేక పనులు చేయాలనే మల్టీపర్పస్ విధానాన్ని ప్రవేశ పెట్టడడం సరికాదన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెలో గొంతెమ్మ కోర్కెలు లేవని, న్యాయం, ధర్మం నీతి మాత్రమే ఉందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ కార్మికుల హక్కులను కాలరాసే చర్యలకు ఒడిగట్టిందన్నారు. బీజేపీ నేతలు నేడు టెంట్ల వద్దకు వచ్చి మద్దతు ఇచ్చినప్పటికీ అసలు కార్మికుల ప్రాథమిక హక్కులను లేకుండా చేస్తున్నది బీజేపీ అనేది మరువకూడదన్నారు. కార్పొరేట్లకు ఉపయోగపడే 4 లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల పొట్టలు కొడుతుందన్నారు. 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచిన ఘనత బీజేపీ సర్కార్‌దేనని వీటిపై ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జీపీ జేఏసీని చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్, జిల్లా నాయకులు ఖాజమోహినోద్దీన్, గ్రామపంచాయతీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నన్నేసాబ్, జిల్లా ఉపాధ్యక్షులు సాగర్, రాజేశ్వరి, రేఖ, పద్మ, జాకీర్, అశోక్, సాయిలు, హనుమండ్లు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో బండారు చంద్రరావు భవన్లో నియోజకవర్గ కో కన్వీనర్ కారం పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీపీఐ(ఎం) జాతీయ నాయకులు ఎం.సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు హాజరై మాట్లాడారు. పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి, కార్మికుల సమ్మెను ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా డే సందర్భంగా ఆగస్టు



9, 10 తేదీలలో దేశవ్యాప్తంగా కలెక్టరేట్ ఎదుట కేంద్ర కార్మిక సంఘాలు, రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు నిర్వహిస్తున్న మహా పడావ్ ధర్నాకు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. దమ్మపేట మండలంలో వాటర్ ట్యాంక్ ఎక్కి కార్మికులు నిరసన తెలిపారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్, ఎర్రుపాలెం మండలాల్లో ఎంపీడీఓలకు వినతి పత్రాలు అందజేశారు.

మీర్‌పేట్ కార్పొరేషన్ సమగ్రాభివృద్ధికి బాటలు..

- ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం
- ఎస్ఎన్‌డీపీ నాలా రెండో దశ పనులకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి రూ. 35 కోట్లు మంజూరు
- 'నవతెలంగాణ'తో డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి


విద్యుత్ కాంతులతో ట్యాంక్‌బండ్‌ను తలపిస్తోన్న చందన చెరువు
డిప్యూటీ మేయర్ విక్రమ్ రెడ్డి

నవతెలంగాణ-మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్ సమగ్ర అభివృద్ధికి మంత్రి సబితా ఇంద్రారెడ్డి బాటలు వేస్తున్నారని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి అన్నారు. నవతెలంగాణ దినపత్రిక 8వ వార్షికోత్సవం సందర్భంగా నవతెలంగాణ యాజమాన్యానికి, ఉద్యోగులకు, విలేకరులకు, పాఠకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత మంత్రి సబితా ఇంద్రారెడ్డి నాయకత్వంలో మీర్ పేట్ శరవేగంగా అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందని చెప్పారు.

నాలాల నిర్మాణంతో ముంపునకు శాశ్వత పరిష్కారం..

గతంలో వర్షాల కారణంగా మీర్‌పేట్ కార్పొరేషన్‌లో కాలనీవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. వర్షం కురిస్తుందంటే ముంపు ప్రాంతాల్లో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించేవారన్నారు. సబితా ఇంద్రారెడ్డి గెలిచిన తర్వాత ముంపునకు శాశ్వత పరిష్కారం ఆలోచించి వర్షపు నీరు నేరుగా వెళ్లేందుకు ప్రత్యేకంగా ఒక నాలా నిర్మాణం చేయాలని ఆలోచించి ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ నిధులు మంజూరు చేసి ఎస్ఎన్‌డీపీ నాల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారని పేర్కొన్నారు. మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని మూడు చెరువులను(పెద్ద చెరువు, మంత్రాల చెరువు, చందన చెరువు) ఒకదానికొకటి అనుసంధానం చేస్తూ ఎస్ఎన్‌డీపీ నాల మొదటి దశలో రూ 18.19 కోట్ల నిధులతో పెద్ద చెరువు నుంచి సీతా హెూమ్స్, తిరుమల ఎంక్లేవ్, బాలాజీ నగర్, ఎంఎల్ఆర్ కాలనీ మంత్రాల చెరువు వరకు ఒకటి, అయోధ్య నగర్, బాలాజీ నగర్, ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ, ఎంఎల్ఆర్ కాలనీ మంత్రాల చెరువు వరకు మరొకటి రెండు నాలాల పనులు చేపట్టగా మంత్రాల చెరువు వరకు నిర్మాణం చివరి దశలో ఉన్నాయి. మొదటి దశ పనులను వెంటనే పూర్తి చేసి రెండో దశ పనులకు ప్రభుత్వం రూ.35కోట్లు మంజూరు చేసినట్టు ఇటీవలే మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారని తెలిపారు. రెండో దశలో టీజేపీ క్వార్టర్స్ నుంచి చందన చెరువు వరకు ఒక నాలా, విజయ హెూమ్స్, ఓంసాయి నగర్, ఆదిత్య నగర్, టీకేఆర్ కాలేజీ సౌత్ గేట్ మీదుగా ఆర్ఎన్ రెడ్డి నగర్, నందిహిల్స్ వరకు మరో నాలాను నిర్మాణం చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ పనులు సైతం అతి త్వరలో ప్రారంభించాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. వర్షాకాలంలో వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా పనులు తొందరగా ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నాలాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

చెరువుల సుందరీకరణతో కార్పొరేషన్‌కు కొత్త అందాలు..

ఎన్నో సంవత్సరాల నుంచి మురికి కుపాలుగా, గుర్రపుడెక్కకు, దోమలకు నిలయంగా మారిన పెద్ద చెరువు, మంత్రాల చెరువు, చందన చెరువులు నేడు సుందరీకరణతో కళకళలాడుతున్నాయి..దాదాపు రూ 20కోట్ల (పెద్ద చెరువు- 10కోట్లు, మంత్రాల చెరువు- 4కోట్లు, చందన చెరువు- 6కోట్లు) రూపాయలతో సుందరీకరణ చేపట్టారు. చందన చెరువు వీధి దీపాలతో, చిన్న పిల్లల పార్కు, పెద్దలకు మూడు కిలోమీటర్ల మేర చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ తదితర ఏర్పాటు చేశారు. దీంతో సాయంత్రం అయ్యిందంటే చాలు చిన్న పిల్లలతో తల్లిదండ్రులు వచ్చి పిల్లలను ఆడిస్తూ కాసేపు సేద తీరుతున్నారు. దీనికి ప్రధాన కారణం మంత్రి సబితా ఇంద్రారెడ్డికి అభివృద్ధి, ప్రజల పట్ల ఆమెకు ఉన్న అంకిత భావమే అన్నారు. నిరంతరం ప్రజల కోసం పరితపించే మహా నాయ కురాలు



సబితా ఇంద్రారెడ్డి అని కొనియాడారు. మీర్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో మరెన్నో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


చిల్డ్రన్ పార్కులో ఆడుకుంటున్న పిల్లలు

మీర్‌పేట్ రోడ్డు విస్తరణతో పెరిగిన సందడి..

'మొన్నటి వరకు మీర్ పేట్ ప్రధాన రహదారి చాలా చిన్నగా ఉంది. గ్రామ పంచాయితీ నుంచి మున్సిపల్, కార్పొరేషన్‌గా మారినా మీర్ పేట్ ప్రధాన రహదారి మాత్రం విస్తరణకు నోచుకోలేదు. మీర్ పేట్ జనాభా 40 నుంచి 50వేలు ఉండేది. ప్రస్తుతం జనాభా ఒక లక్ష 20వేలు దాటింది. రోజురోజుకు రద్దీ విపరీతంగా పెరిగింది. కానీ రోడ్డు మాత్రం పెంచకుండా ఉంది. దీంతో వాహన దారులు చాలా ఇబ్బందులు పడ్డారు.గమనించిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి అల్మాస్ గూడ కామన్ నుంచి చందన చెరువు వరకు రూ 7కోట్ల నిధులతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు చేశారు. జిల్లెలగూడ అంబేద్కర్ విగ్రహం నుంచి గాయత్రీ నగర్ చౌరస్తా వరకు ఆర్సీఐ రోడ్డు నుంచి లలిత నగర్ చౌరస్తా మీదుగా ,ప్రశాంతి హిల్స్ చౌరస్తా నుంచి బీఎస్ రెడ్డి చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ చేయడం జరిగింది' అని తెలిపారు. ఇన్ని అభివృద్ధి పనులు కేవలం నాలుగు సంవత్సరాల కాలంలో ఒక మీర్ పేట్ కార్పొరేషన్ పరిధిలో చేశారంటే మొత్తం నియోజకవర్గం పరిధిలో ఇంకా ఎన్ని అభివృద్ధి పనులు చేశారో మీకే అర్థమవుతుందన్నారు. ఎవరూ ఊహించనంత అభివృద్ధి కార్యక్రమాలు జరగడానికి, మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ రూపురేఖలు మారడానికి ప్రధాన కారణం మంత్రికి అభివృద్ధి పట్ల, ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు అర్థం అవుతుందని అన్నారు.

ప్రజా గొంతుక నవతెలంగాణ

- నవతెలంగాణ పత్రికకు వార్షికోత్సవ శుభాకాంక్షలు
- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

ప్రజా సమస్యల సాధన కోసం నిరంతరం పనిచేస్తున్న నవతెలంగాణ పత్రిక 8 వ వార్షికోత్సవ వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషకరం అని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ నాగారం మున్సిపల్ పరిధిలో మూడేండ్లలో ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ పాలకవర్గం ఏర్పడిన మూడేం డ్లలో రూ. 66 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, మున్సిపల్ పరిధిలోని 20 వార్డులలోని పలు కాలనీల్లో రూ. 8 కోట్లతో సీసీ రోడ్లు, రూ. 7 కోట్లతో అంతర్గత మురికి కాలువలు, రూ.5 కోట్లతో బీటీ రోడ్లు నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించామన్నారు. రూ.15 కోట్లతో మున్సిపాల్టీ పార్కులు, కమ్యూనిటీ హాళ్లకు ప్రహ రీలు చేపట్టి వివిధ కాలనీల వాసులకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. మున్సిపాల్టీలో రూ. 4.5 కోట్లతో నిర్మిం చనున్న మార్కెట్‌కు సంబంధించిన పనులు జరుగుతు న్నాయని,


నాగారంలో పార్క్ ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి ,నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి (ఫైల్‌ఫోటో)

నాగారం, రాంపల్లిలో నాలుగు చోట్ల రూ. 3 కోట్లతో వైకుంఠదామాల అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. చెత్త సేకరణకు రూ. కోటి 32 లక్షలతో ట్రాక్టర్లు, ఆటోలు కొను గోలు, రూ. 50 లక్షలతో చేపట్టిన జంక్షన్ పనులు పూర్తి చేశామని చెప్పారు. రూ.13 కోట్లతో హరితహారం, స్వచ్ఛ సర్వేక్షణ్, ఇతర పనులు చేసినట్టు తెలిపారు. బాక్స్ డ్రైన్ పను లకు రూ. 8 కోట్లు, సీసీ రోడ్లకు రూ. కోటి 30 లక్షలు, అంతర్గత మురికి కాలువ పనులకు హెచ్ఎండీఏ రూ. 60 లక్షలు నిధులు కేటాయించగా పనులు త్వరలో మొదలు కానున్నాయన్నారు. మున్సిపాల్టీలో రూ. 8.5 లక్షలతో స్వర్గలోక వాహనాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మున్సిపాల్టీలో నిరంతరం నిఘా కోసం రూ.32 లక్షలతో సీసీ కెమె రాలు ఏర్పాటు, ఐకాం కంపెనీ సహకారంతో స్వీపింగ్ మెషన్ కొనుగోలు చేశామని అన్నారు. రూ.40 లక్షల తో మున్సిపాల్టీలో నాలుగు బస్తీ దవాఖానలు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు.


నాగారంలో పార్క్

ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించడంలో నవతెలంగాణ ముందుంది



- డాక్టర్ శిరీష ఓం ప్రకాష్ యాదవ్

నవతెలంగాణ-అంబర్ పేట

ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించడంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్యగా వారధిగా నవ తెలంగాణ దినపత్రిక ముందుంటుందని బీఆర్ఎస్ అంబర్ పేట నియోజకవర్గం సీనియర్ నాయకులు డాక్టర్ శిరీష ఓం ప్రకాష్ యాదవ్ అన్నారు. శనివారం నవ తెలంగాణ ప్రతినిధితో వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, నిజాన్ని నిర్భయంగా చెప్పడంలో నవతెలంగాణ నిబద్ధతతో పనిచేస్తోందన్నారు. భిన్నమైన అభిప్రాయాల వ్యక్తీకరణ పట్ల అసహనం ప్రదర్శించే అప్రజాస్వామిక ధోరణిని ఎప్పుడూ ఎండగడుతూనే ఉందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో పత్రికలు ప్రతిపక్ష పాత్ర పోషించాలని నమ్ముతున్న నవతెలంగాణ ఎక్కడా వెనక్కి తగ్గకుండా ముందుకుసాగుతోందని, ఎల్లప్పుడూ కార్మికులకు కర్షకులకు అండగా ఉంటున్నదన్నారు. ఈ సందర్భంగా నవతెలంగాణ దినపత్రికకు వారు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.



> నిన్ను నిన్నుగా ప్రేమించుటకు
> నీ కోసమే కన్నీరు నింపుటకు
> నేనున్నాని నిండుగ పలికే
> తోడొకరుండిన అదే భాగ్యమూ...
>
> స్నేహానికి ఇంతకంటే గొప్ప నిర్వచనం ఇంకేముంటుంది. జీవితం చుట్టూ ఒక గాడాంధకారం అలుముకున్నప్పుడు, నిరాశా నిస్పృహలు చుట్టుముట్టినపుడు.. నీ కోసం నేనున్నాను.. అంటూ భుజం తట్టే ఆత్మీయ స్పర్శ స్నేహం. ఆనందాన్ని రెట్టింపు చేస్తుంది. విషాదాన్ని సగానికి సగం తగ్గిస్తుంది. మానవ సంబంధాలన్నీ ఆర్థిక బంధాలుగా మారిపోయి, మనిషన్నవాడు మాయమైపోతున్న తరుణంలో ఇంకా ఎక్కడో ఒక చోట ఆత్మీయమైన స్నేహాలు, ఉన్నతమైన మానవతా విలువలు వెలుగు రేఖలుగా దారి చూపుతూనే ఉంటాయి.
>
> - ఎం.కె.

నీ... స్నేహం!



స్నేహమంటే ఒక నులివెచ్చటి స్పర్శ. భాషకందని కమ్మటి భావన. చుట్టూ అల్లుకున్న మానవ సంబంధాల పొదరింట్లో విరిసిన అందమైన గులాబీ. జీవితంలో మరిచిపోలేని ఒక మధుర జ్ఞాపకం. ఎప్పుడో చిన్నప్పుడు... బుడిబుడి అడుగుల బాల్యంలోనే అల్లుకునే స్నేహ బంధాలు కొన్నయితే... పరవళ్లు తొక్కే యవ్వనంలో పెనవేసుకునే అనుబంధాలు మరి కొన్ని. ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, ఏ కాలేజీలోనో, లైబ్రరీలోనో, కలిసి నడిచే కారిడార్‌లోనో, తరగతి గదిలోని ఒకే బెంచిపై, మాస్టారు బోధించే పాఠాల్లోని సందేహాల్లో ఊపిరి పోసుకొనే స్నేహం..

ఒక మహావృక్షంలా ఎదుగుతుంది. జీవితంతో మమేకమవుతుంది. ఒక విడదీయరాని అనుబంధమై పోతుంది. అసలు కళాశాల అంటేనే స్నేహితుల కలల కాణచి. సహ విద్యార్థిగా రూపుదిద్దుకొనే పరిచయం.. స్నేహమై ఎలా ఎదుగుతుందో, జీవితంలో ఒక తీపి గుర్తుగా ఎలా మిగిలిపోతుందో ఏ డైరీని అడిగినా చెబుతాయి. మదిలో నిక్షిప్తమైన భావాలను, అనుభవాలను, అనుభూతులను పంచుకోవడం తప్ప ఏ స్వార్థం లేని జీవన బంధం స్నేహం. జీవితంలో ఎవరున్నా, లేకున్నా మంచి నేస్తం ఒకరు తోడుంటే చాలు.

కొందరి ఫ్రెండ్ షిప్ స్కూల్‌తో ఫుల్ స్టాప్ పెడతారు. మరికొందరు కాలేజీతో కామా పెడతారు. కానీ స్కూల్ నుంచి మొదలై కాలేజీలో కంటిన్యూ అయి జీవితాంతం బ్రహ్మముడిలా విడిపోకుండా అలా పెనవేసుకుంటాయి.

> స్వార్థం, స్వలాభం కోసం స్నేహాన్ని కవచంగా వాడుకునే నీచ స్వభావులకూ కొరత లేదు. అవసరం మేరకు స్నేహం, ప్రేమ నటిస్తూ, అవసరం తీరాక ముఖం చాటేసే మహానుభావులూ ఉన్నారు. నిజానికి, స్నేహానికి మించిన సంపదగానీ, సత్కార్యంగానీ మరొకటి లేదు. ఇతరులను ప్రేమించలేనివారికి, స్నేహితులు లేనివారికి జీవితంలో ఎన్ని ఉన్నా నిరుపయోగమే. స్నేహ ధర్మాన్ని పాటిస్తేనే ఇహమైనా, పరమైనా దైవం మనందరికీ మంచి స్నేహితులను, సద్బుద్ధిని ప్రసాదించాలని, పరస్పర స్నేహ సంబంధాలలో వృద్ధిని, శుభాన్ని కలుగజేయాలని కోరుకుందాం.

స్నేహమంటే స్కూల్, కాలేజీ ఇవే కాదు ఒక యజమాని సేవకుడి మధ్యలో కూడా తారతమ్యాలు లేని అరమరికలు లేని స్నేహం అంతస్థులు మరిచి అంతరంగాలను పంచుకుంటుంది. స్నేహానికి కులం లేదు. మతం అడ్డురాదు. అది చంద్రుని వెన్నెల లాంటిది. వీచే చిరుగాలి వంటిది. జలజలా రాలే సెలయేటి లాంటిది అవును అన్ని మతాలకు దోస్తీ సమ్మతమే. ఓ నిముషం కోపంగా మరునిముషం నవ్వులతో.. మరి కాసేపు ఈర్ష్యతో.. ఇంకాసేపు - అనురాగంతో.. జీవితంలో కురిసే రసాలన్నిటినీ రుచిచూపించేదే స్నేహం. అది భవిష్యత్తును కలలు కంటుంది. వర్తమానంలో కలహించుకుంటుంది. గతాన్ని గుర్తుచేసుకొని కంటతడి పెడుతుంది. స్నేహానికి ఉన్న విలువను కాపాడుకొని.. అసూయలను పాతరేసి.. ఈర్ష్యలను వదిలేసి.. కమ్మనైన కలలు కనే మంచి తోడు ప్రతి ఒక్కరికి దొరుకుతారు. ఆ తోడును జీవితాంతం నిలుపుకునే అదృష్టం ఉంటే అదే అమృత స్నేహం.

స్నేహానికున్న విలువ వెలకట్టలేనిది. ఈ లోకంలో స్నేహితుడు/ స్నేహితురాలు లేకుండా ఏ వ్యక్తి వుండరు. అంతటి ఉన్నతమైన స్నేహానికున్న ప్రాధాన్యతను చెప్పేందుకు ఏర్పాటైనదే స్నేహితుల రోజు. స్నేహితుల రోజును ప్రతి ఆగస్టు మొదటి ఆదివారం జరుపుకుంటారు.

1935లో అమెరికా కాంగ్రెస్ "ఫ్రెండ్‌షిప్‌డే"ను ప్రకటించింది. స్నేహ మాధుర్యాన్ని చవిచూసిన ప్రతి ఒక్కరూ వారి అభిప్రాయంతో ఏకీభవించారు. ఫలితంగా ప్రపంచంలో నేడు అనేక దేశాలు స్నేహితుల రోజును జరుపుకుంటున్నాయి. ప్రతి ఏటా తమ తమ మిత్రులకు సంప్రదాయ బద్ధంగా శుభాకాంక్షలు తెలుపుకుంటూ వుంటారు మిత్రులు. సుదూర ప్రాంతాలలో వున్న మిత్రులందరూ ఒకచోట చేరి స్నేహితుల రోజున కలిసి విందులు, వినోదాలలో పాల్గొనడం జరుగుతోంది. అయితే ఈ స్నేహుతుల రోజులలోనూ రకాలున్నాయి. అవేంటంటే...

జాతీయ స్నేహితుల రోజు ఆగస్టులో వచ్చే మొదటి ఆదివారం జరుపుకుంటారు. అలాగే మహిళా స్నేహితుల రోజును ఆగస్టు మూడో ఆదివారం సెలబ్రేట్ చేసుకుంటారు. అదే విధంగా అంతర్జాతీయ స్నేహితుల నెలగా ఫిబ్రవరి మాసాన్ని పరిగణించారు. ఇక పాత స్నేహితులు, కొత్త స్నేహితుల వారాన్ని మే మూడో వారంలో జరుపుకుంటారు. ఇలా ఎన్ని వర్గాలుగా విభజించినా స్నేహితుడు... ఎప్పుడు హితుడే కదా...

> జాతి, కులం, మతం, లింగ, ప్రాంతం తేడాలు లేకుండా ప్రపంచదేశాల మధ్య స్నేహభావం పెంపొందాలనే ఉద్దేశంతో 2011లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ అంతర్జాతీయ సమావేశం నిర్వహించి, అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించింది. దేశాల మధ్య సుహృద్భావం, స్నేహం కలగాలని భావించింది. దేశాల మధ్య వైషమ్యాలు ఉండకూడదని సూచించింది. అన్ని దేశాలు సోదరభావంతో మెలిగి, ప్రపంచ శాంతికి బాటలు వేయాలని సంకల్పిస్తోంది. కానీ , దేశంలో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొంటున్నాయి. కులాలు మధ్య , జాతులు మధ్య చెలరేగిన వైరం కార్చిచ్చులా రెండు రాష్ట్రాలను దహించి వేస్తుంది.

"నా ముందు నడవద్దు, నేను అనుసరించకపోవచ్చు. నా వెనుక నడవద్దు, నేను ముందుకు నడవలేక పోవచ్చు.

నాతోపాటు నడువు.. నా స్నేహితుడిగా ఉండు చాలు.."

స్నేహమేరా జీవితం... స్నేహమేరా శాశ్వతం... అన్నాడో సినీకవి. జగత్తులో ఎన్ని బంధాలు, అనుబంధాలు ఉన్నా స్నేహబంధం అనేది మాత్రం మనిషి జీవితంలో చాలా ప్రత్యేకమైనది. మిగిలిన అన్ని బంధాలు ఏదో రూపంలో మన ప్రమేయం లేకుండానే మన జీవితంలో ప్రవేశిస్తాయి. కానీ స్నేహబంధం మాత్రం పూర్తిగా మన ఇష్టంతో, మనకు నచ్చిన వారితోనే ఏర్పడుతుంది. స్నేహితుల పట్ల విజ్ఞతతో వ్యవహరించడం చాలా అవసరం. సమయ సందర్భాలను బట్టి మాత్రమే స్పందించాలి. స్నేహితుని లోపాలను ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా, అతని మేలుకోరి సున్నితంగా తెలియజెప్పాలి. నేడు స్నేహం కూడా కృత్రిమమై పోయింది. మొహమాటపు స్నేహాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. మనసు లోతుల నుంచి పెల్లుబికే స్నేహ సంబంధాలు చాలా అరుదు. స్నేహం ముసుగులో మోసం, దగా, వంచన కొనసాగుతున్నాయంటే అతిశయోక్తి కాదు.

అలాంటి ఆశయాలకు బాటలు వేసిన వారిలో ముందుగా చెప్పుకోవాల్సింది మార్క్స్ ఏంగెల్స్, చేగవేరా ఫెడల్ క్యాస్ట్రో.. కారల్ మార్క్స్‌కు వెన్నుదన్నుగా నిలిచిన ఏంగెల్స్ మైత్రీబంధం నేటికీ ప్రపంచానికి ఆదర్శం. నేడు స్నేహితుల దినోత్సవం. హ్యాపీ ఫ్రెండ్షిప్ డే...



ఇకనైనా నిద్ర లేవండి !

ఉమ్మడిగున్నప్పుడు
ఉధృతంగ..
దోపిడి గురించి మాట్లాడినం !

అభివృద్ధికి
ఆటంకం జరిగిందని
అక్రమాల్ని విపులీకరించి
నిరసనలు సేపట్టినం !

ఏష బాసలు
పల్చబడుతున్నయని
సిరుతల రామన్నెమాడినం !

విముక్తి నేపథ్యంలో
ఉరికురికి..
ఉద్యమానికి ఊపిరులూదినం !

మూలాల్ని తుంగలోతొక్కి
ఆకాంక్షల్ని..
ఏకపక్షంగ గాలికొదిలినప్పుడు
కనీసం ధిక్కరించెటోడు లేడు !

నిరంకుశంగ
గొంతులకు గొంతులు నులిమితే
ఎలుగెత్తి గిదెట్లని
ప్రశ్నించెటోడు ఒక్కడు రాడు !

దర్నాలు, నిరసనలు
ఈ మట్టిమీద దేశద్రోహమైతే
ఈ ఉద్యమనేల చరిత్రేమిటో.. !

ఎంతటి నియంతైనా..
తవ్వెడు తీసుకున్నకాడ
తంగెళ్ళుపీకుమంటె పీకాలె!
ఫ్లెక్సీలకు పాలాభిషేకాలెందుకు!?

సెరువుల బర్లనుతోలి
కొమ్ములకు బారెం పెట్టినంక
ఇప్పుడు కుములుతే ఏం లాభం !?

ప్రత్యేక పోరాటంలనే కాదు
తుది ఫలితంల కూడ
సృజనకారులకు భాగం ఉంటది !

ఎన్ని నిందలు మోపినా
తుపాకి తూటాలు దించినా
కలాలు, గలాలు..
చైతన్యక్రియ మరువద్దు కదా !

రానున్నది..
ఎన్నికల కోలా'హాలాహలం'
ఇక నటించింది చాలు
కవిగాయకులారా !
ఇకనైనా మొద్దు నిద్ర వదలండి !!

- అశోక్ అవారి, 9000576581

మౌనం అర్ధాంగికారమే కాదు...

మాట ఒకటి
చేతలు రెండు
ఏక్ భారత్
దో పహేచాన్

భారత్ సమ్మాన్ దేశ దేశములలో

మానం, మర్యాద అగ్ని గుండంలో

ఏమిటి...? ఈ దాష్టికం..? దౌర్జన్యం..?
అంటూ దేశమంతా గగ్గోలు
సమాధానం లేని సభాపర్వం

ఒకవైపు చంద్రయానాలు

ఇంకొక వైపు కమిలి, కుమిలి
పోయే ఊరేగింపులు

ఎటూ పొసగని
దో పహేచాన్

స్వచ్ భారత్ అంటే
శుభ్ర భారత్ అనుకున్న

మనుషులపై పోయటం అని అర్థం కాకపాయే

దేశ దేశాలు తిరిగి
భారత్ పహేచానో... భారత్ పహేచానో...
ఇప్పుడు భారత్ బత్తలయ్యింది
అన్న సంగతి తెలియక పాయే

వీటన్నిటికీ జవాబుదారీతనం

మౌనం... మౌనం...

మన్ కీ బాత్
చమన్ కీ బాత్ కాదు
పెదవి దాటని మౌనం
అన్నింటికి అర్ధాంగీకారమే కాదు
నిరంకుశాధికారం కూడా...

- వి. కె.



మహాత్ములు మళ్ళీ పుట్టాలి..!

మహాత్ముల మహోద్యమాలతో
అమర వీరుల బలిదానాలతో
దేశ భక్తుల త్యాగ ఫలాలతో
భారతావనికి స్వరాజ్యమొచ్చింది !

తెల్ల దొరలు వెళ్ళిపోయారు.!
నల్ల నేతలు పల్లకీనెక్కారు.!

స్వాతంత్ర్యం వచ్చి ఏడు పదులు దాటినా
స్వదేశంలో కుచేల సంతతి పెరిగి
అప్పులు కుప్పలుగా నిలిచె.
కానీ...సమగ్రాభివృది శూన్యం..?


గద్దెనెక్కిన వాడు
గుట్టుగా దోచుకున్నాడు.
కొలువులను అడ్డం పెట్టుకొని
అధికారులు తెలివిగా గుంజుకున్నారు..?

దేశంలో వ్యక్తి స్వార్థాలు పెరిగిపోయాయి..?
రాజకీయ, అధికాం అవినీతి
గుర్ర పు డెక్కలా సర్వత్రా
సమాజంలో అల్లుకుపోయాయి..?

ఎన్ని ప్రణాళిక లు వేసినా..
పేదరికం దేశానికి చుట్టరికం లా మారింది..!
ఇంకా దేశం ఎలా ముందుకు వెళ్లుతుంది..??

దేశంకి పూర్వ వైభవం రావాలంటే
ఆనాటిమహాత్ములు మరలా పుట్టాలి..!
అలనాటి త్యాగధనులు తిరిగి జన్మించాలి..!
నవ భారతాన్ని ప్రగతి పథంలో నడప టానికి..
జావగారిన జాతిలో నవ జీవన చేతనం నింపటానికి..!!

- జి.సూర్య నారాయణ, 6281725659



ఒక్కసారొచ్చి పో బిడ్డా...!



అభిరామ్,

ఎలా ఉన్నావ్! కోడలు పవిత్ర, పిల్లలు ఎలా ఉన్నారు. మీరు క్షేమమని తలుస్తాను. నేను మీ జ్ఞాపకాల్ని, మీ నాన్నతో నా అనుబంధాన్ని నెమరు వేసుకుంటూ ఒంటరిగా కాలం నెట్టు కొస్తున్నాను. మీరు జర్మనీ వెళ్ళి మూడేళ్ల దాటి పోయింది. పోయిన శ్రావణమాసంలో వస్తారనుకున్నాను. కాని, రాలేదు. ముసలి దాన్ని ప్రాణం ఉండబట్టలేక ఉత్తరం రాస్తున్నాను. నా ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే ఉంది. జీవితంలో ఇలాంటి రోజు వస్తుందని నేను ఊహించ లేదు. అనుకున్నవి జరగక పోవడమేగా జీవితమంటే! మీతో నా ఎడబాటు ఈ వయసులో నాకు ఇది పెద్ద శిక్షలాంటిదే!

మనిషికి జీవితం ఎన్ని గుణ పాఠాలు నేర్పుతుందో! ఎన్ని కష్టాలు కన్నీళ్లు కలబోసిన అనుభవాలను ఆవిష్కరిస్తుందో! తలుచుకుంటేనే, గుండె బరువెక్కుతుంది. నాకు బాగా గుర్తు... నువ్వు పుట్టినప్పుడు ముగ్గురు ఆడబిడ్డల తరవాత, మగబిడ్డ పుట్టావని ఎంత సంతోషించామో! నువ్వు మా నోముల పంటవు. ఎన్ని ఒక్క పొద్దులుండి, ఎందరో దేవుళ్లకు మొక్కుకున్నానే. పుట్టిన వారసుడివి.. నువ్వు విజయదశమి రోజు పుట్టినా పండగలన్ని ఒక రోజు జరుపుకున్నట్టు సంబర పడ్డాం. నిజం చెప్పాలంటే నిన్ను పాలతో కాదు మా రక్తాన్ని ధారపోసి, ప్రాణంగా పోషించుకున్నాం. నువ్వు పసివాడిగా ఉన్నప్పుడు నాన్న పడే కష్టం చూడలేక, మీ పెద్దక్క నాన్నలో పాటు కూలి పనికెళ్తానని, మారాం చేసింది. "ఈ గొడ్డు చాకిరి నాతోనే పోవాలి. ఈ కూలి పని బదుకు నాతోనే అంతం కావాలి. మీరంతా పెద్దపెద్ద చదువులు చదువుకొని గొప్ప ఉద్యోగాలు చెయ్యాలి" అని నాన్న అక్కకు నచ్చచెప్పేవాడు. మా రెక్కల కష్టంతోనే మిమ్మల్ని చదివించి ప్రయోజకుల్ని చేశాం. నీ స్థితిని చూడకుండానే మీ నాన్న కాలం చేశారు.

పోయిన గోదావరి పుష్కరాలకు మనం రాజమండ్రి వెళ్ళినపుడు మీ నాన్న అన్న మాటలు నా మనసులో అలాగే ఉండిపోయాయి. "మనం ఎన్ని కష్టాలుపడ్డా పిల్లల్ని పస్తులు లేకుండా సాకాం. అయినా మన పిల్లలు మంచివాళ్లే! తీర్చలేని కోరికలు ఎప్పుడూ అడగలేదు. వాళ్లకు తెలుసనుకుంటాను. నాన్న కుచేలుడని. కాలం కలిసిరాక నేను భగవంతుడు దగ్గరకు వెళ్ళిపోయినా! నీకేం పర్వాలేదు. నీ ముద్దుల కొడుకు అభిరావమ్ ఉన్నాడుగా! నిన్ను ప్రాణంగా చూసుకుం టాడులే!" అనే మాట కడుపు నిండా నవ్వుతూ అనేవాడు. అలాంటి సందర్భంలో మీ నాన్ననే చూడాలనిపించేది. బాధ్యతల్ని తీర్చుకొని, బంధాలన్ని తెంచుకొని వెళ్ళిపోయాడు.

అత్తగారిళ్లకు ఆడపిల్లలు, ఉద్యోగాల పేరుతో మీరు దిక్కులు పంచుకొని వెళ్ళిపోయారు. నేను మాత్రం ఒంటరి పిట్టలా మీ జ్ఞాపకాల మధ్య కాలం నెట్టుకొస్తున్నాను. మన ఊరి కరణం పెద్ద కొడుకు రామనర్సయ్య మామయ్య వాళ్ల పిల్లలు అమెరికా వెళ్ళి ఆరేళ్లయినా తిరిగి రాలేదు. వాళ్లను వృద్ధాశ్రమానికి వెళ్ళమని ఉత్తరం రాశారట. ఊళ్లో ఎట్టా బతికినోళ్ల చివరకు అనాధల్లా శేషజీవితం గడపాల్సి వస్తుందని తులసమ్మత్త కన్నీరు మున్నీరవుతుంది. మనం "బిడ్డల్ని కనగలం గాని, వాళ్ల తలరాతల్ని కాదుగా" అంటూ బాధపడుతుంది. మన ఇల్లు రాములోరి గుడికి పై ఎత్తు నాయినా! నేను పొద్దుటేలకి మాపిటేలకి మధ్య నలిగిపోతున్నాను. మహాశివరాత్రి నుండి ఆరోగ్యం బాగా దెబ్బతింది. శరీరం సహకరించడం లేదు. ఇంకా ఎంత కాలం బతుకుతానో తెలియదు. చూపు మందగించింది. నాకు నేనే భారంగా మారిపోయాను.


అయ్యా! -

"మీకు వీలుంటే ఒక్కసారి వచ్చి చూసిపోండి. ఒంటరి తనం చాలా నరకంగా ఉంది. చివరి రోజుల్లో మీ దగ్గర ఉండాలని ఆశగా ఉంది. మన ఊరు, పొలం, వ్యవ సాయం, రచ్చబండ, రామాలయం, చర్చి వీధి ఈ మాకులు విన్నప్పు డల్లా మీనాన్న పసిబిడ్డలా, నాతో మాట్లా డుతూ ! నా చుట్టూ తిరుగుతున్నట్టే ఉంది. ఊరు పొమ్మం టుంది. కాడి రమ్మం టుంది. మీ నాన్న, మీరు లేని ఇల్లు శూన్యంగా కనిపిస్తుంది. రాత్రయితే చాలు నా మంచం చుట్టూ మీరంతా కూర్చోని కబుర్లు చెప్తున్నట్టుగా ఉంది. ఒంటరిగా నువ్వక్కడ ఎందుకు నా దగ్గరకొచ్చెయ్ అని మీ నాన్న అన్నట్లుగా ఉంది. కానీ, మీ జ్ఞాపకాలే నన్ను బతికిస్తున్నాయి. కన్నీళ్లతో సహజీవనం చేయడం తప్ప ఈ వయసులో నేనేం! చెయ్యగలను.

ఈ పరుగుల ప్రపంచంలో ఆత్మీయతల్ని పంచుకునే సమయం లేని మానవ యంత్రాలు మీరు. అందరు ఉన్నా ఎవ్వరు లేని అనుభవం నాది. కనుక ఈ ఉత్తరం చేరిన వెంటనే వస్తారని ఆశగా ఎదురు చూస్తుంటాను. ఒక వేళ మీరు వచ్చేలోపు నేను కాలం చేస్తే! నన్ను నాన్న సమాధి పక్కనే దహనం చేయించండి. అమ్మగా ఇది నా చివరి కోరిక. తీరుస్తావుగా! ఉంటాను మరి.

శుభాశీస్సులు -

ప్రేమతో...
నీ తల్లి
బద్దిపూడి యశోదమ్మ



మేమేనండీ...

ఎలా పుట్టాలో తెలియకుండా పుట్టి
ఎలా బతకాలో తెలియకుండా
బతికే వాళ్లం
బతకలేక చచ్చేవాళ్లం
హత్యాచారాలలో ఏ దేశమైతే
ముందు ఉంటుందో
అదే మా దేశం
ఇక ఊరు అంటారా!!
ఏ ఊర్లో ఉన్నా
ఐదు రోజులు బయట ఉండేవాళ్ళం
ఏ మతంలో పుట్టినా
ఆడవాళ్ళమే
ఏ కులంలో పుట్టినా
దళితులమే
ఎంత ముద్దుగా పుట్టినా
నాన్న ముఖం చిట్లించాల్సిందే
ఎన్ని నెలలు మోసినా
తల్లీ, కడుపు తీపి మరిచి
కుండీల పాలు చేయాల్సిందే
మాకు చదువు అవసరం లేదు
ప్రేమించే అధికారం లేదు
జీవించే హక్కు లేదు
సమానత్వం జాడే లేదు
ఎంత చదివినా
సంసారం చేయాల్సిందే అంటారు
ఎన్ని మెడల్స్ వచ్చినా
మెడలు వంచాల్సిందే అంటారు
మా జాతిని గౌరవిస్తామంటారు
మమ్మల్ని మాత్రం
మాడ్చి చంపేస్తుంటారు
ఆడదేవతల్ని
అనేక రూపాల్లో కొలుస్తూ ఉంటారు
అమ్మ, అక్క, చెల్లి
ఇలా మేము ఏ రూపంలో ఉన్నా
నామరూపాలు లేకుండా చేస్తారు
ఈ ప్రపంచానికి దిక్కే మేము
ఏ దిక్కు మొక్కు లేకుండా
పడి చచ్చేది కూడా
మేమే మేమే
బతుకు భారమైన
భారతమాతలం



- కీర్తి ఇనుగుర్తి